12 . 2. 2026

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

గురువారం | రంగారెడ్డి, నల్లగొండ

సంపుటి :07 సంచిక : 248 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper



**ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 36వ వార్డు రవీంద్ర నగర్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్**

**ఆదిలాబాద్ వెలుతురు ఫిబ్రవరి 11:**
ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ బుధవారం రోజున ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 36వ వార్డు రవీంద్ర నగర్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్ల

# మున్సిపోల్స్‌పై పీపుల్స్ పల్స్ సర్వే

## అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ గెలుపు

## 7 కార్పోరేషన్లలో 5 కాంగ్రెస్, 2 బిజెపి గెలుపు

## పలుచోట్ల ఎంఐఎం కీలకం

## కానుందని వెల్లడి

**హైదరాబాద్,ఫిబ్రవరి11 వెలుతురు:**
తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలు కోలాహలం ముగిసింది. ఉదయం నుంచీ సాయంత్రం వరకూ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు తరలివెల్లారు. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసిపోగా.. బూత్ లలో ఉన్న వారికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించారు. అయితే, ఎన్నికలు ముగిసిన వెంటనే ఎగ్జిట్ పోల్స్ విడుదలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు జరిగిన ఈ పోలింగ్‌లో కాంగ్రెస్ పార్టీ తన ఆధిపత్యాన్ని చాటుకోనుందని పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్ సర్వే వెల్లడించింది. వారి అంచనాల మేరకు మంచిర్యాల, రామగుండం, నల్లగొండ, మహబుబ్ నగర్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లలో కాంగ్రెస్ జోరు ప్రదర్శించింది. కరీంనగర్, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లను బీజేపీ కైవసం చేసుకునే అవకాశాలు ఉన్నట్లు వెల్లడించింది. ఈ రెండు మున్సిపల్ కార్పొరేషన్లలో బీజేపీ అతిపెద్ద పార్టీగా




అవతరించనుంది. నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్లలో ఎంఐఎం కింగ్ మేకర్ కానున్నదని వెల్లడించింది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ ఏ ఒక్క మున్సిపల్ కార్పొరేషన్ గెలిచే అవకాశాలు లేవని చెప్పింది. ఉత్తర తెలంగాణలో బీజేపీ తన పట్టును నిరూపించుకోనుందని సర్వే చెప్పింది. కరీంనగర్, నిజామాబాద్ కార్పొరేషన్లలో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించి, వాటిని కైవసం చేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయంది. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీకి ఈ ఎన్నికలు కోలుకోలేని దెబ్బ తీసేలా

# ఓటేసిన పలువురు ప్రముఖులు

- కొడంగ్‌లో ఓటేసిన సిఎం రేవంత్,
- మధిరలో ఓటేసిన భట్టి విక్రమార్క

**హైదరాబాద్,ఫిబ్రవరి11 వెలుతురు:**
మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని పలువురు ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొడంగల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో






మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో కరీంనగర్ 50వ డివిజన్ లోని జ్యోతినగర్ ఎస్సార్ హైస్కూల్ లోని 361 పోలింగ్ బూత్ లో ఓటు హక్కును వినియోగించుకున్న కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ మరియు వారి కుటుంబ సభ్యులు
**కరీంనగర్ వెలుతురు ఫిబ్రవరి 11:**





# మున్సిపల్ ఎన్నికల్లో 80 శాతం పైగా కాంగ్రెస్ గెలుస్తుంది...

**కరీంనగర్ వెలుతురు ఫిబ్రవరి 11:**
కాంగ్రెస్ పార్టీ ప్రజల ఆశీర్వాదంతో 80 శాతం కి పైగా మున్సిపాలిటీ స్థానాలు గెలుస్తుందనీ రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ ధీమా వ్యక్తం చేశారు.కరీంనగర్ డిసిసి కార్యాలయంలో ముఖ్య నేతలతో కలిసి మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఆయన మాట్లాడిన విశేషాలు...ఈరోజు తెలంగాణ మున్సిపల్ ఎన్నికల పోలింగ్



ముగిసింది.కాంగ్రెస్ పార్టీ ప్రజల ఆశీర్వాదంతో 80 శాతం కి పైగా మున్సిపాలిటీ స్థానాలు గెలుస్తుంది..తెలంగాణ ఆశ్చర్యకరంగా బీజేపీ బిఆర్ఎస్ ఒకటిగా కలిసి ఎన్నికల వాతావరణాన్ని

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ హవా!

## 90 శాతం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు కాంగ్రెస్ ఖాతాలో

## టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్




# నేడు కార్మిక సంఘాల ర్యాలీ, ధర్నా లో పాల్గొననున్న టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఐ ఎన్ టి యు సి జాతీయ అధ్యక్షులు సంజీవ రెడ్డి తదితరులు

**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 11:**
నేడు కార్మిక సంఘాల ర్యాలీ, ధర్నా లో పాల్గొననున్న టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఐ ఎన్ టి యు సి జాతీయ అధ్యక్షులు సంజీవ రెడ్డి తదితరులు పాల్గొంటున్నారు ఇండియా, అమెరికా వాణిజ్య ఒప్పందం విషయంలో కార్మిక, కర్షక సంఘాలు వ్యతిరేకిస్తూ రేపు దేశ వ్యాప్త ధర్నాకు, నిరసన కార్యక్రమాలు.. సంఘీభావం ప్రకటించిన ఏఐసీసీ గురువారం ఉదయం 11 గంటలకు వి ఎస్ టి నుంచి భారీ ర్యాలీ ప్రారంభం అవుతుంది. అక్కడ నుంచి ఇందిరా పార్కు ధర్నా చౌక్ వరకు ర్యాలీ అనంతరం ధర్నా చౌక్ వద్ద ధర్నాలో మాట్లాడనున్న టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్



# స్వర్ణాంధ్ర లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం

- అభివృద్ధి, సంక్షేమం జోడెడ్లుగా ప్రగతి పయనం
- 19 నెలల కాలంలోనే రాష్ట్రాన్ని గాడిలో పెట్టగలిగాం
- 2019 తర్వాత వ్యవస్థాగత పాలనా వైఫల్యాలు
- విద్యుత్, సాగునీటి పారుదల రంగాల్లో తిరోగమనం
- వ్యవస్థల నిర్వీర్యంతో కుంటుపడిన అభివృద్ధి రంగం
- ఉభయ సభలను ఉద్దేశించిన గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం



**అమరావతి,ఫిబ్రవరి11 వెలుతురు:**
రాష్ట్ర విభజన తర్వాత ఏపీ ఎన్నో కీలక మార్పులు, పరిణామాలను చవిచూసిందని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. పరిమిత వనరులు ఉన్నప్పటికీ దీర్ఘకాలిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేసిందని చెప్పారు. 2019లో జరిగిన ప్రభుత్వ మార్పు రాష్ట్ర పురోగతికి విఘాతం కలిగించిందన్నారు. ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా బుధవారం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. ప్రజా సంక్షేమం అనే కోణంలోనే.. ప్రభుత్వం ప్రతీ నిర్ణయాన్ని తీసుకుంటోందని తెలిపారు. ఏడాదికి రూ.33వేల కోట్లతో సూపర్ సిక్స్ సహా ఇతర డీబీటీ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. 63.12 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ద్వారా ప్రయోజనం చేకూరుతోంద న్నారు. 66 లక్షలకు పైగా విద్యార్థులకు తల్లికి వందనం ద్వారా ఆర్థిక సాయం అందుతోందని గవర్నర్ వెల్లడించారు. 2019 తర్వాత వ్యవస్థాగత పాలనా వైఫల్యాలు తలెత్తాయి. రాష్ట్ర అభివృద్ధి స్తంభించింది. ఆర్థిక ఒత్తిడి తీవ్రమైంది. వ్యవస్థలు విధ్వంసమయ్యాయి. మౌలిక సదుపాయాలు, విద్యుత్, సాగు నీటి పారుదల రంగాలు తీవ్ర తిరోగమనం చవిచూశాయి. గత చేదు అనుభవాలతో విసిగి వేశారిన ప్రజలు.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. గత 19 నెలలుగా మా ప్రభుత్వం పునరుద్ధరణ దశ నుంచి ప్రగతి

# ప్రజాపాలనలో పేదలందరికి సంక్షేమ పథకాలు

- నల్లగొండను అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటా
- ప్రతి డివిజన్ లో ప్రజా దర్బార్
- 24 గంటలు తాగునీరు అందిస్తా
- రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి

**నల్లగొండ వెలుతురు ఫిబ్రవరి 11:**
కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వ పాలనలో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు



నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా బుధవారం నల్లగొండ పట్టణంలోని 33వ డివిజన్ మీర్ బాగ్ కాలనీ నల్లగొండ పబ్లిక్ స్కూల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, పేదల సంక్షేమం గురించి పట్టించుకోలేదని విమర్శించారు. గతంలో విద్యాశాఖ మంత్రిగా ఉన్న వ్యక్తి ఎంజి యూనివర్సిటీ పట్టించుకున్న దాఖలాలు

# అమెరికాకు తలొగ్గిన భారత ప్రభుత్వం

- వాణిజ్య ఒప్పందంతో అమెరికాకే లాభం
- ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో అనిల్ అంబానీ, హర్దీప్ పురిల ప్రస్తావన
- బడ్జెట్ చర్చలో రాహుల్ విమర్శలు
- రాహుల్ వ్యాఖ్యలపై గందరగోళం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి11 వెలుతురు :**
అమెరికా ప్రభుత్వానికి భారత్ తలొగ్గిందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇరు దేశాల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం అమెరికాకు మేలు కలిగించేలా ఉందే తప్ప.. భారత్‌కు దీనివల్ల ఎలాంటి ప్రయోజనమూ లేదన్నారు. కేంద్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ లోక్‌సభలో మాట్లాడారు. తన ప్రసంగంలో వాణిజ్య ఒప్పందంతో పాటు ఏఐ ప్రభావం వంటి అంశాల గురించి ప్రస్తావించారు. ప్రపంచంలో మారుతున్న పరిణామాలకు



## ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 36వ వార్డు రవీంద్ర నగర్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ముఖాల్లో కనిపిస్తున్న చిరునవ్వులు, ఉత్సాహాన్ని గమనిస్తే భారతీయ జనతా పార్టీకి ప్రజలు సంపూర్ణ మద్దతు అందిస్తున్నారని స్పష్టంగా తెలుస్తోందన్నారు. ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారికి కానుకగా ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ పదవిని బీజేపీ గెలుచుకుంటుందని ప్రజలు నమ్మకంతో ఉన్నారని తెలిపారు. అదేవిధంగా, ఆదిలాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి పూర్తిస్థాయిలో జరగాలంటే బీజేపీ పాలన మాత్రమే సాధ్యమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో ప్రజలందరూ బీజేపీకి ఓటు వేసి అభివృద్ధి బాటలో అడుగులు వేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పిలుపునిచ్చారు.

# ఓటేసిన పలువురు ప్రముఖులు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు కొనసాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీల్లో ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ ప్రారంభమైంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగిం చుకుంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, కొడంగల్ లో ఓటు వేశారు. వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ జడ్పీ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ కు వెళ్లి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన హైదరాబాద్‌కు తిరిగి బయల్దేరారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధిరలో ఓటేశారు. నిజామాబాద్ పట్టణంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కరీంనగర్ పట్టణంలో ఓటేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్.. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనే ఆయుధాన్ని కుటుంబ సభ్యులతో కలిసి వినియోగించుకోవాలని బండి సంజయ్ కోరారు. మంచిర్యాలలోని హైటెక్‌సిటీలో 227వ నంబర్ పోలింగ్ బూత్‌లో మంత్రి వివేక్ వెంకటస్వామి ఓటు వేశారు. కామారెడ్డి పట్టణంలోని 151 పోలింగ్ బూత్ లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ ఆలీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపి ధర్మపురి అర్వింద్ తదితరులు కూడా తమ ఓటు హక్కను వినియోగించుకున్నరు. రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు జరుగుతున్న ఈ పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగిసింది.

# శ్రీశైలం మహాక్షేత్రంలో శ్రీ మల్లికార్జున స్వామిని దర్శించిన మంత్రి కొండా సురేఖ

**శ్రీశైలం వెలుతురు ఫిబ్రవరి 11:**

ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన పవిత్ర శ్రీశైలం మహాక్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లికార్జున స్వామి వారిని రాష్ట్ర మంత్రి శ్రీమతి కొండా సురేఖ బుధవారం రోజున ఉదయం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ ప్రధాన ద్వారం వద్ద దేవస్థానం అధికారులు, వేదపండితులు ఆమెకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద మంత్రోచ్చారణల మధ్య మంత్రి గారు స్వామివారి ఆశీస్సులు పొందారు. దర్శనం అనంతరం మంత్రి గారు రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, అభివృద్ధి, సమృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని స్వామివారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు మరియు ఇతర భక్తులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ హవా!

**నిజామాబాదు వెలుతురు ఫిబ్రవరి 11:**

తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించబోతోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో జరిగిన పోలింగ్ సరళిని పరిశీలిస్తే సుమారు 90 శాతం స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యం సాధించబోతోందని ఆయన పేర్కొన్నారు. సీఎం శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో అమలవుతున్న ప్రజా పాలన ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు పట్టణ ఓటర్లు పట్టం కట్టారని ఆయన తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి తీసుకుంటున్న వేగవంతమైన నిర్ణయాలు, పారదర్శక పరిపాలన, సామాజిక న్యాయానికి కట్టుబడి... ఇవన్నీ కలిపి కాంగ్రెస్ పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలపరిచాయని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారనే విషయాన్ని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి” అని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీల అమలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, పట్టణాభివృద్ధికి ప్రత్యేక నిధుల కేటాయింపు వంటి కార్యక్రమాలు ప్రజల మనసులను గెలుచుకున్నాయని ఆయన వివరించారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య వ్యవస్థ మెరుగుదలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఓటర్లలో సానుకూల భావనను కలిగించాయని చెప్పారు. ఈ ఎన్నికల ద్వారా కాంగ్రెస్ పార్టీపై ప్రజలు ఉంచిన విశ్వాసం భవిష్యత్‌లో మరింత బాధ్యతగా పని చేయాలని సూచిస్తోందని మహేష్ గౌడ్ పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన ఈ మద్దతు మా బాధ్యతను పెంచింది. ప్రతి మున్సిపాలిటీ, ప్రతి కార్పొరేషన్‌లో పారదర్శకతతో, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తాం” అని ఆయన హామీ ఇచ్చారు. ప్రతిపక్ష పార్టీలు ప్రచారం చేసిన అసత్యాలు, అవాస్తవాలను ప్రజలు నమ్మలేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇచ్చి నిలబడే ప్రభుత్వమని, ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. మహేష్ కుమార్ గౌడ్ పార్టీ శ్రేణులకు, అభ్యర్థులకు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ, పట్టణాల సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. మొత్తానికి తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలు కాంగ్రెస్ హవాను మరింత బలపరిచాయి. ప్రజా పాలనపై ప్రజల విశ్వాసమే ఈ విజయానికి మూలకారణమని పార్టీ నాయకత్వం అభిప్రాయపడుతోంది.

## మున్సిపోల్స్‌పై పీపుల్స్ పల్స్ సర్వే

ఉన్నాయని తెలిపింది.. ఒక్క మున్సిపల్ కార్పొరేషన్‌ను కూడా గెలుచుకునే అవకాశం ఆ పార్టీకి లేదని పీపుల్స్ పల్స్ అంచనా వేసింది. నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్ నగర్ కార్పొరేషన్లలో అధికార పీఠాన్ని నిర్ణయించడంలో ఎంఐఎం కీలక పాత్ర పోషించనుందని సర్వే వెల్లడించింది.116 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ 36శాతం , బీఆర్ఎస్ 29.7శాతం, బీజేపీ 19.3శాతం ఓట్లను సాధించవచ్చని సర్వే పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ 1210-1290 వార్డులను, బీఆర్ఎస్ 860-930 వార్డులను, బీజేపీ 250-270 వార్డులను గెలుచుకునే అవకాశం ఉందని సర్వే చెబుతోంది. మొత్తంగా చూస్తే, అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన మొదటి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తన పట్టును మరింత పటిష్టం చేసుకోగా, బీఆర్ఎస్, బీజేపీలు తమ ఉనికిని కాపాడుకోవడానికి పోరాడుతున్నాయనే విధంగా సర్వే ఫలితాలు వెలువరించింది రామగుండంలో కాంగ్రెస్ 30-34, బీఆర్ఎస్ 16-20, బీజేపీ 3-6, ఇతరులు 4-7 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. మంచిర్యాలలో కాంగ్రెస్ 39-43, బీఆర్ఎస్ 8-12, బీజేపీ 6-9, ఇతరులు 1-2 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. కొత్తగూడెంలో కాంగ్రెస్ 28-34, బీఆర్ఎస్ 7-9, సీపీఐ 14-16, ఇతరులు 2-4 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. మహబూబ్ నగర్ లో కాంగ్రెస్ 26-30, బీఆర్ఎస్ 18-22, బీజేపీ 6-8, ఎంఐఎం 2-4, ఇతరులు 0-1 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. నల్లగొండలో కాంగ్రెస్ 21-26, బీఆర్ఎస్ 8-12, బీజేపీ 6-10, ఎంఐఎం 2-4, ఇతరులు 1-2 వార్డులు గెలుపొందే అవకాశం. నిజామాబాద్ లో కాంగ్రెస్ 10-16, బీఆర్ఎస్ 2-4, బీజేపీ 26-31, ఎంఐఎం 8-12, ఇతరులు 1-2 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. కరీంనగర్ లో కాంగ్రెస్ 14-16, బీఆర్ఎస్ 10-12, బీజేపీ 24-29, ఎంఐఎం 6-9, ఇతరులు 1-3 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. మొత్తంగా 68-76 మున్సిపాలిటీలను అధికార కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోనుంది. 29-36 మున్సిపాలిటీలను ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్, 3-5 బీజేపీ, 0-1 ఎంఐఎం గెలుచుకునే అవకాశం ఉందని పీపుల్స్ పల్స్ తన సర్వే ఫలితాల్లో పేర్కొంది. 116 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీకి 36 శాతం, బీఆర్ఎస్ కు 29.7 శాతం, బీజేపీకి 19.3 శాతం, ఏఐఎంఐకు 2 శాతం ఓట్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని పీపుల్స్ పల్స్ సర్వే తెలిపింది. కాంగ్రెస్ పార్టీ 1210-1290, బీఆర్ఎస్ 860-930, బీజేపీ 250-270, ఏఐఎంఐఎం 35-44, సీపీఐ 12-17, సీపీఎం 10-14, ఇతరులు 90-110 వార్డులు గెలుపొందే అవకాశం ఉందని పీపుల్స్ పల్స్ వెల్లడించింది. దాదాపు 70 శాతం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కాంగ్రెస్ కైవసం చేసుకునే అవకాశం ఉందని సర్వే పేర్కొంది. ముఖ్యంగా మంచిర్యాల, రామగుండం, నల్లగొండ, మహబూబ్ నగర్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లలో కాంగ్రెస్ జెండా ఎగరవేయనుందని సర్వే అంచనా వేసింది.

# మున్సిపల్ ఎన్నికల్లో 80 శాతం పైగా కాంగ్రెస్ గెలుస్తుంది...

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యంగా చేసింది..బీజేపీ బిఆర్ఎస్ లు మొగన్ని కొట్టి మొరమొర అన్నట్టు సమేత గా ఉంది..ఎక్కడికక్కడ ఘర్షణ వాతావరణం క్రియేట్ చేస్తూ భౌతిక దాడులకు దిగింది.నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోలింగ్ బూత్ లోకి వెళ్లి భయభ్రాంతులకు గురి చేశారు..ప్రభుత్వాన్ని బధనం చేసే కుట్ర చేశారు..10 సంవత్సరాలుగాము న్సిపాలిటీ లకు ఏమి చేయలేక నిధులు ఇవ్వలేక ఇప్పుడు ఎన్నికల సమయంలో బీజేపీ మరోసారి ప్రజలను మభ్యపెట్టాలని చూసింది..రెండు సంవత్సరాలో ప్రజా పాలన ప్రభుత్వం లో ఇందిరమ్మ ఇళ్లు,200 యూనిట్ల ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ,సన్న బియ్యం పంపిణీ,రేషన్ కార్డులు,ఆర్టీసీ లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, సన్న వడ్లు బోనస్,రైతు భరోసా,రైతు రుణమాఫీ ఎన్నో పథకాలు అమలు చేస్తుంది..బీజేపీ కేంద్ర మంత్రుల నుండి కార్యకర్తల వరకు బి ఆర్ ఎస్ మాజీ మంత్రుల నుండి కార్యకర్తల వరకు కలిసి పని చేశారు.. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు..ఈరోజు బీజేపీ అన్ని పేపర్లలో పెద్ద పెద్ద యాడ్ ఇచ్చారు.. 12 సంవత్సరాలుగా కేంద్రంలో మీరే అధికారంలో ఉన్నారు కదా.. ఇవన్నీ ఎందుకు చేయలేదు.. మున్సిపాలిటీ లలో బీజేపీ తోనే అభివృద్ధి సాధ్యమని వేసారు.. భవిష్యత్ లో ఇవన్నీ అమలు చేస్తామని చెప్పారు.. కేంద్రం సహకరించండి..రాష్ట్రం అమలు చేస్తుంది.12 సంవత్సరాలుగా మీరే అధికారంలో ఉన్నారు..పట్టణ ప్రాంతాల్లో ఉన్న సమస్యలు పరిష్కరించండి.. ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతున్న ఎన్నికలు అపహాస్యం చేసే ప్రయత్నం చేశారు..పోలీసుల మీద దాడులు ,ఘర్షణలు ,ఓటర్లను ప్రలోభపెట్టడానికి చేశారు.. 10 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న పార్టీ విచ్చలవిడిగా సంపాదించిన డబ్బులతో ఓట్లు కొనే ప్రయత్నం చేశారు..ఎవరెన్ని కుట్రలు చేసిన ప్రజా పాలన ప్రభుత్వం ను ప్రజలు ఆశీర్వదించారు.. పంచాయతీ ఎన్నికల మాదిరి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తున్నాం..గ్రామీణ ప్రాంతాల్లో చేసిన అభివృద్ధి పట్టణ ప్రాంతాల్లో చేస్తున్నాం.. ఎవరెన్ని కుట్రలు చేసిన ప్రజలంతా కాంగ్రెస్ వైపు ఉన్నారు..రాష్ట్ర వ్యాప్తంగా 80 శాతానికి పైగా కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ లు గెలుస్తుంది..మేము మున్సిపాలిటీ లకు ఇచ్చిన హామీలకు అనుగుణంగా ప్రజా పాలన ప్రభుత్వం పని చేస్తుంది.తెలంగాణ బీజేపీ అధికార దాహం కోసమే..తెలంగాణ ను సాక్షాత్తు ప్రధాని వ్యతిరేకించిన నిధులు ఇవ్వకుండా వివక్ష చూపెడుతూ ప్రధాన మంత్రి కేంద్ర మంత్రులను రాష్ట్ర ముఖ్యమంత్రి,మంత్రులను కలిసిన నిధులివ్వని బీజేపీ నీ ప్రజలు నమ్మే పరిస్థితి లేదు..అధికారం కోసం బీజేపీ వెంపర్లాడుతుంది..తెలంగాణ ప్రజల కళ్ళు పడితే కోనసీమ కొబ్బరి చెట్లు ఎండిపోతున్నయని చెప్పిన పవన్ కళ్యాణ్ తో పొత్తు పెట్టుకున్నారు..ఎన్నికల సమయంలో మత రాజకీయాలు చేస్తూ మత విద్వేషాలు రెచ్చగొడుతూ లబ్ధి పొందే ప్రయత్నం చేశారు..బీజేపీ అన్ని మున్సిపాలిటీ లకు ఇచ్చిన హామీలు నెరవేర్చే బాధ్యత బీజేపీ ది.. అమలు చేసే వరకు కాంగ్రెస్ పార్టీ నిలదీస్తుంది..మీరు ఇచ్చిన హామీలు అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున ప్రణాళికలు చేస్తాం.. మీరు చెప్పిన విధంగా కేంద్రం నుండి నిధులు విడుదల చేయాలి..కేంద్ర మంత్రులు ,రాష్ట్ర మాజీ మంత్రులు మున్సిపల్ ఎన్నికల్లో వ్యవహరించిన తీరు సరికాదు.. గంగుల కమలాకర్ ఐదేళ్లు మంత్రిగా చేశారు..స్మార్ట్ సిటీ చేశారు భూకబ్జాలు చేసినం అని చెప్పిన ఆయన ఎన్ని గెలుస్తారో చెప్పలేకపోతున్నారు..మాజీ మంత్రి పోలీస్ జీపు లో నుండి గుంజి లాగడం చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడ్డారు.. నిజామాబాద్ ఎంపీ నేరుగా పోలీసులను బెదిస్తున్నారు తల్లిని చంపి బిడ్డను ఏర్పాటు చేశారని తెలంగాణ ను అవమాన పరిచిన వ్యక్తికి తెలంగాణ లో ఓటు అడిగే హక్కు లేదు.. రెండు సంవత్సరాలుగా బడ్జెట్ లో తెలంగాణ కు నిధులు కేటాయించిన బీజేపీ కి తెలంగాణ లో ఓటు అడిగే హక్కు లేదు..

# ప్రజాపాలనలో పేదలందరికి సంక్షేమ పథకాలు

లేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన భవనాలకు 200 కోట్లు కేటాయించడంతో పాటు, ఇటీవల నూతనంగా ఫార్మసీ కోర్సులను మంజూరు చేయించడం జరిగిందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని స్పష్టం చేశారు. నల్లగొండలో అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఇక్కడి ప్రజల రుణం తీర్చుకుంటానని తెలిపారు. పేదలకు ఏ సమస్య వచ్చినా వారికి ఎల్లవేళలా అండగా ఉంటారని, నేను బతికున్నంత కాలం పేద ప్రజలను గుండెల్లో పెట్టుకుంటానని పేర్కొన్నారు. మేయర్ ఎన్నిక పూర్తి అయిన తర్వాత ప్రతి డివిజన్లో ప్రజా దర్బారు నిర్వహించి కార్పొరేటర్ ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని అన్నారు నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లో 100 ఎకరాల భూమిని సేకరించి దేవరకొండ రోడ్ లో 4000, నార్కట్పల్లి రోడ్ లో 4,000 ఇందిరమ్మ ఇండ్లను 75 గజాలలో కట్టించి పేదలకు అందజేస్తామని తెలిపారు. నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు పేదోళ్లకు సంబంధించిన ఎన్నికలని తెలిపారు. ఈ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిస్తే అన్ని డివిజన్లో సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని, పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఇతర పార్టీలకు చెందిన అభ్యర్థులు గెలిస్తే ప్రజల సమస్యలు పరిష్కారానికి నోచుకోవన్నారు . త్వరలోనే నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలన్నింటిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తానని, అంగన్వాడీలకు సొంత భవనాలు నిర్మిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించిన నాణ్యమైన విద్యను అందించే విధంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలను మోడల్ కాలేజీ గా మారుస్తామని తెలిపారు నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో ఇప్పటికే కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, మరో 600 కోట్ల పనులకు సంబంధించి టెండర్ దశలో ఉన్నాయని తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ అభివృద్ధి జరుగుతుందని చెప్పారు.ద నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో అన్ని ప్రాంతాలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీని ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కాలనీలో ఉన్న ప్రతి పార్కును అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. జిల్లా గ్రంథాలయాన్ని మోడల్ గ్రంథాలయంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. రూ. 10 కోట్లతో అధునాతన షాదీ ఖానా నిర్మిస్తామని అన్నారు. పట్టణ ప్రజలకు 24 గంటలు తాగునీరు వచ్చే విధంగా 12 ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు నిర్మిస్తున్నామని, ఇప్పటికే కొన్ని పూర్తయ్యాయని తెలిపారు. దీంతో త్వరలో అన్ని కాలనీలకు 24 గంటల తాగనీరు అందుతుందని అన్నారు. కార్పొరేషన్ లలో కాంగ్రెస్ పార్టీదే విజయం: మంత్రి కోమటిరెడ్డి రాష్ట్రంలో జరుగుతున్న కార్పొరేషన్, మున్సిపాలిటీ ఎన్నికలలో అత్యధిక స్థానాలలో విజయం సాధిస్తామని ఈ సందర్భంగా మంత్రి ధీమా వ్యక్తం చేశారు ఏడు మున్సిపల్ కార్పొరేషన్లలో అన్నింటిలో గెలుపొందుతామని, 116 మున్సిపాలిటీలలో 110 స్థానాలలో విజయం సాధిస్తామని తెలిపారు. ఐదేళ్ల మన భవిష్యత్తు నిర్ణయించేది ఓటేనని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. అర్బన్ ప్రాంతాలలో ఓటింగ్ శాతం తగ్గుతుందని, 90 శాతం పోలింగ్ అయ్యే విధంగా ప్రతి ఒక్కరు ఓటు వేసి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేసే వారిని ఎన్నుకోవాలని సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎంఏ హఫీజ్ ఖాన్, నల్గొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం

పథం వైపు పయనిస్తోంది. సూపర్-6, ఇతర సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. అభివృద్ధి కార్యకలాపాలను పునఃప్రారంభించడంపై ప్రధానంగా దృష్టి పెట్టాం. విధానాలు, వ్యవస్థలు, వ్యయ ప్రాధాన్యాలలో కీలక సవరణలు చేశాం. 7 శ్వేతపత్రాల విడుదల ద్వారా పారదర్శకతకు పెద్దపీట వేశాం. సంక్షేమాన్ని అభివృద్ధితో సమతుల్యం చేయడానికి పది సూత్రాలు రూపొందించాం. సంపదను సృష్టించే ప్రగతి చక్రాన్ని నిర్మించడమే దీని లక్ష్యం. స్వర్ణాంధ్ర విజన్ ఒక స్పష్టమైన ఆర్థిక మార్గాన్ని నిర్దేశిరచిందని గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్టసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అందుతోందని గవర్నర్ తెలిపారు. అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేల చొప్పున 46.86 లక్షల మంది రైతులకు లబ్ది చేకూరుతోందన్నారు. దీపం 2.0 పథకం ద్వారా 1.08 కోట్ల మంది పేద కుటుంబాలకు ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉపాధ్యాయ పోస్టుల భర్తీతో పాటు 5,757 మంది కానిస్టేబుళ్ల రిక్రూట్మెంట్ కూడా ప్రభుత్వం పూర్తి చేసిందని వివరించారు. మత్స్యకార సేవలో పథకం ద్వారా 1.2 లక్షల మందికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందుతోందని తెలిపారు. లక్ష మందికి పైగా హ్యాండ్లూమ్, పవర్‌లూమ్‌లపై ఆధారపడిన చేనేత కుటుంబాలకు 200, 500 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్ అందిస్తోందని గవర్నర్ చెప్పారు. విభజన సమస్యలతో పాటు వారసత్వంగా వచ్చిన ఆర్థిక నష్టాలతో ప్రభుత్వం పాలన ప్రారంభించిందని అబ్దుల్ నజీర్ చెప్పుకొచ్చారు. విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం చేసిన అభివృద్ధిని గత పాలకులు ధ్వంసం చేశారన్నారు. వ్యవస్థలను నిర్వీర్యం చేయడంతో అభివృద్ధి ఆగిపోయిందని.. ఆర్థికపరమైన ఇబ్బందులు పెరిగాయని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా గత పాలకులు పాలించారని.. 22ఏ అధికరణను దుర్వినియోగం చేశారన్నారు. మౌలిక వసతులైన విద్యుత్, సాగునీరు, రహదారులు లాంటి రంగాల్లో అభివృద్ధి కుంటుపడిందని గవర్నర్ తెలిపారు. 2024లో రాష్టాన్ని పునర్నిర్మాణం చేసే బాధ్యతను ప్రజలు కూటమికి అప్పజెప్పారని.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో ప్రభుత్వ పాలన అద్భుతంగా సాగుతోందని వెల్లడించారు. 19 నెలల కాలంలోనే రాష్టాన్ని పునర్నిర్మించి గాడిలో పెట్టిందన్నారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ సహా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు రీస్టార్ట్ అయ్యాయని తెలిపారు. తొలి 9 నెలల కాలంలో దిద్దుబాటు చర్యలు, పాలసీలు, వ్యవస్థల పునరుద్ధరణ వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పారు. ఏడు శ్వేతపత్రాలను విడుదల చేసి పారదర్శకమైన పాలనను కూటమి ప్రభుత్వం చేపడుతోందని వివరించారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంతో పాలన సాగిస్తోందన్నారు. పది సూత్రాలను నిర్దేశిరచుకుని.. ప్రజలకు సుపరిపాలన అందించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అభివృద్ధిని, సంక్షేమాన్ని సమతూకంగా చేసుకుని ప్రభుత్వ పాలన సాగుతోందని అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. జీరో పావర్టీ లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని గవర్నర్ వెల్లడించారు. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్మెంట్ సిస్టమ్ ద్వారా ప్రతీ కుటుంబానికి అవసరమైన ప్రయోజనాలను అందిస్తున్నామన్నారు. త్వరలో ఫ్యామిలీ కార్డును అందించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. పీ4 ద్వారా పేద, ధనిక వర్గాల మధ్య తారతమ్యాలను తగ్గించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎవరూ ఆకలితో ఉండకూడదనే సూత్రంతో 113 నియోజకవర్గాల్లో 205 అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసిందని చెప్పారు. త్వరలో మిగిలిన నియోజకవర్గాల్లోనూ గ్రామీణ అన్నా క్యాంటీన్లను ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని గవర్నర్ నజీర్ వెల్లడించారు. అందరికీ ఇల్లు.. అనే లక్ష్యంతో గృహ నిర్మాణ పథకాన్ని ప్రభుత్వం చేపడుతోందన్నారు గవర్నర్. ఎస్సీ వర్గీకరణ ద్వారా అన్ని వర్గాలకూ న్యాయం జరిగేలా చేసిందన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పుకొచ్చారు. బీసీల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం.. వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఎంఎస్ఎంఈల ద్వారా బీసీ వర్గాలను బలోపేతం చేసేందుకు కార్యాచరణ చేపట్టిందన్నారు. మైనారిటీలకు భద్రత, వారికి అభివృద్ధిలో భాగస్వామ్యం, విద్య, ఆర్థిక సహకారంతో మేలు చేకూరుస్తోందని తెలిపారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ స్పష్టం చేశారు.రాష్ట్రం ఐటీ, క్వాంటమ్ కంప్యూటింగ్ లాంటి రంగాల్లో దూసుకెళ్తోందని గవర్నర్ పేర్కొన్నారు. ప్రముఖ పరిశ్రమల భాగస్వామ్యంతో రాష్ట్రానికి అంతర్జాతీయ గుర్తింపు వస్తోందన్నారు. అంతర్జాతీయ సంస్థలు.. ఏపీని పెట్టుబడులు, నాలెడ్జ్ ఎకానమీకి గమ్యస్థానంగా ఎంచుకున్నాయని తెలిపారు. టెక్నాలజీని అందిపుచ్చుకోవటం ద్వారా యువతకు భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచేలా ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తోందని గవర్నర్ వివరించారు. ప్రజలకు వైద్య ఖర్చులు తగ్గించేలా.. సంజీవని కార్యక్రమం ద్వారా ప్రజల ఆరోగ్య భద్రతను బలోపేతం చేస్తోందన్నారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా రాష్ట్రంలో ప్రజలందరికీ ఉచిత ఆరోగ్య బీమా కల్పించేందుకు కృషి చేస్తోందని గవర్నర్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రతీ వ్యక్తికి రూ.2.5 లక్షల వరకూ సమగ్ర ఆరోగ్య బీమా కల్పించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అందుబాటులోకి తెస్తోందన్నారు. 1.43 కోట్ల పేద కుటుంబాలకు రూ.25 లక్షల వరకు నగదురహిత వైద్యం అందుబాటులోకి తీసుకువస్తోందని అన్నారు. క్యాన్సర్ సహా ఇతర ఖరీదైన చికిత్సలకు ఎలాంటి పరిమితి లేకుండా ప్రభుత్వం ఈ బృహత్ పథకాన్ని చేపడుతోందని చెప్పారు గవర్నర్. వృద్ధుల సంఖ్య పెరగడం వివిధ దేశాలకు సవాల్‌గా మారిందని.. దీనిపై సరైన విధానాన్ని రూపొందించాలని సభను కోరుతున్నట్లు గవర్నర్ తెలిపారు. అక్రమ మద్యం తయారీ నుంచి విముక్తి కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని.. గంజాయి నిర్మూలనలో పురోగతి సాధించిందన్నారు. యువతకు నైపుణ్య శిక్షణ అందించి మెరుగైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. 'వీబీ జీ రామ్ జీ' పథకం ద్వారా ఉపాధి రోజులను 100 నుంచి 125 రోజులకు పెంచారన్నారు. అభివృద్ధి వ్యూహంలో మహిళలే కేంద్ర బిందువులని.. ఆర్థిక భాగస్వాములు, స్వయం పేరుతో డ్వాక్రా మహిళలు రూపొందించిన ఉత్పత్తులకు బ్రాండింగ్ చేస్తోందన్నారు. ఏడాదికి లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా ప్రభుత్వం తీర్చిదిద్దుతోందని.. వచ్చే ఏడాది 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చాలనే లక్ష్యాన్ని నిర్దేశిరచుకుందని తెలిపారు. అంగన్ వాడీలను బలోపేతం చేసి.. గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు. మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి ద్వారా మహిళలకు న్యాయ సహకారం కూడా అందిస్తోందని గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు.

## అమెరికాకు తలొగ్గిన భారత ప్రభుత్వం

అనుగుణంగా బడ్జెట్ ఏమాత్రం ప్రతిబింబించలేదన్నారు. ప్రపంచమంతా ఏఐ యుగంలోకి వెళ్తోందని చెబుతున్నారు. దీనివల్ల భారతీయ ఐటీ కంపెనీలు నష్టపోయే ప్రమాదం ఉంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల ఉద్యోగాలకు ప్రమాదం ఉంది. మన దేశానికి ప్రతిభావంతులైన యువతరం పెద్ద ఆస్తి. ఏఐకి ఇంధనమే డేటా.. డేటా లేకుండా ఏఐ ఏమీ చేయలేదు. అమెరికా సూపర్ పవర్‌గా కొనసాగాలంటే భారత్ డేటానే కీలకం. గతంలో అధిక జనాభాను సమస్యగా భావించేవారు.. కానీ జనాభా మనకు అతిపెద్ద ఆస్తి. కానీ మన డేటాను రక్షించుకునేందుకు ఇండియా చర్యలు తీసుకోలేదు. అమెరికా కంపెనీల కోసం ట్యాక్స్ హాలిడే ప్రకటించిందని రాహుల్ గాంధీ అన్నారు.మన దేశం ఏ దేశాల నుంచి చమురు కొనుగోలు చేయాలో అమెరికా చెబుతోంది. వాళ్లు చెప్పినట్లు చేయకపోతే 50 శాతం టారిఫ్‌లు వేస్తామని బెదిరిస్తున్నారు. అమెరికా డిమాండ్లకు తలొగ్గి కీలక వ్యవసాయ ఉత్పత్తులకు భారత్ ద్వారాలు తెరిచింది. గతంలో భారత ఉత్పత్తులపై ఒకప్పుడు కేవలం 3 శాతం పన్ను ఉండేది. ఇప్పుడు అది 18 శాతానికి చేరింది. అమెరికా దిగుమతులను 46 బిలియన్ డాలర్ల నుంచి 100 బిలియన్ డాలర్లకు పెంచేశారు. భారత్‌కు ఈ ఒప్పందం ఎలాంటి భరోసా ఇవ్వడం లేదు. డాలర్‌ను రక్షించుకునేందుకు ఈ ఒప్పందం దోహదపడుతోందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ఎప్‌స్టీన్ ఫైల్లో ప్రముఖ పారిశ్రామికవేత్త అనీల్ అంబానీ పేరు వచ్చినా.. ఎందుకు జైలులో పెట్టలేదని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వ్యాపారవేత్త అనీల్ అంబానీ ఎందుకు జైలులో లేదని నేను అడగాలనుకుంటున్నాను? దీనికి కారణం ఆయన పేరు ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఉంది. అతన్ని (అనీల్ అంబానీ) ఎప్‌స్టీన్‌కు పరిచయం చేసిన హర్‌దీప్ పూరిని కూడా నేను ఒకటి అడగాలనుకుంటున్నాను. అతన్ని ఎవరు పరిచయం చేశారో నాకు తెలుసు. హర్దీప్ పూరికి అతన్ని ఎవరు పరిచేశారో తెలుసు' అని అన్నారు. పరోక్షంగా రాహుల్ మోడీనుద్దేశించి వ్యాఖ్యానించారు. బ్జడెట్‌పై ప్రసంగం సందర్భంగా రాహుల్ గాంధీ ఎప్‌స్టీన్ ÷ల్స్ గురించి ప్రస్తావన తీసుకురాగా.. స్పీకర్ స్థానంలో ఉన్న జగదాంబికా పాల్ అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా అదానీ, అనిల్ అంబానీ, హర్దీప్‌సింగ్ పూరీ పేర్లను ప్రస్తావించడంపై రవిశంకర్ ప్రసాద్ పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. దీంతో రాహుల్ గాంధీ వ్యాఖ్యలను రికార్డులను తొలగించాలని స్పీకర్ ఆదేశించారు. బ్జడెట్ గురించి మాత్రమే మాట్లాడాలని స్పీకర్ సూచించారు. పలుమార్లు రాహుల్ గాంధీ మాట్లాడేందుకు ప్రయత్నించగా.. అధికారపక్ష సభ్యుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అమెరికాకు తలొగ్గి డేటాను, వ్యవసాయాన్ని, ఇంధన రంగాన్ని అమ్మకానికి పెట్టారంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యానించి తన ప్రసంగాన్ని ముగించారు.

## 'డిజిటల్ అరెస్ట్' పేరుతో రూ.1.07 కోట్ల మోసం..

# ఢిల్లీ ముఠాను పట్టుకున్న హైదరాబాద్ పోలీసులు

- మోసానికి సహకరించిన ఢిల్లీకి చెందిన ముగ్గురు సభ్యుల అరెస్ట్
- ముంబై పోలీసులమంటూ బెదిరించి డబ్బులు కాజేసిన సైబర్ నేరగాళ్లు
- అమాయకుల బ్యాంకు ఖాతాలను వాడుకొని మోసాలకు పాల్పడుతున్న ముఠా
- అపరిచితులకు బ్యాంకు ఖాతాలు ఇవ్వొద్దని పోలీసుల హెచ్చరిక



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 11:**
డిజిటల్ అరెస్ట్ పేరుతో నగరానికి చెందిన ఒక వ్యక్తిని భయపెట్టి రూ.1.07 కోట్లు కాజేసిన సైబర్ మోసంలో కీలకపాత్ర పోషించిన ముగ్గురు సభ్యులను అరెస్ట్ చేసినట్లు హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ డీసీపీ వి. అరవింద్ బాబు తెలిపారు. నిందితులు ఢిల్లీకి చెందినవారని, వీరు మోసగాళ్లకు బ్యాంకు ఖాతాలను సరఫరా చేస్తూ ఈ నేరానికి సహకరించారని ఆయన వెల్లడించారు. ఇటీవల నగరానికి చెందిన బాధితుడికి ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు తాము ముంబై క్రైమ్ బ్రాంచ్ అధికారులమని పరిచయం చేసుకున్నారు. అతని ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌పై మనీ లాండరింగ్ కేసు నమోదైందని, వెంటనే అరెస్ట్ చేస్తామని బెదిరించారు. విచారణ పేరుతో "డిజిటల్ అరెస్ట్" చేసి, పలు దఫాలుగా రూ.1.07 కోట్లను వేర్వేరు బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేయించుకున్నారు. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు, డబ్బు బదిలీ అయిన ఖాతాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. మొదట దీపక్, ప్రశాంత్ కుమార్ అనే ఇద్దరు ఖాతాదారులను అరెస్ట్ చేశారు. వారిచ్చిన సమాచారంతో, ఈ మోసానికి బ్యాంకు ఖాతాలను సరఫరా చేస్తున్న ప్రధాన సూత్రధారులు గుర్దీప్ సింగ్, హర్‌ప్రీత్ సింగ్, కుమార్ మోహిత్‌లను ఢిల్లీలో అరెస్ట్ చేశారు. ఈ ముఠా ఢిల్లీ, జైపూర్ వంటి నగరాల్లోని హోటళ్లలో ఉంటూ, డబ్బు అవసరం ఉన్నవారికి కమీషన్ ఆశ చూపి వారి బ్యాంకు ఖాతాలను సేకరించి మోసాలకు వాడుతున్నట్లు తేలింది. వీరికి గుజరాత్, కేరళ, మహారాష్ట్ర వంటి ఇతర రాష్ట్రాల్లో జరిగిన సైబర్ నేరాలతోనూ సంబంధాలున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ సందర్భంగా డీసీపీ అరవింద్ బాబు మాట్లాడుతూ, "అపరిచితులకు కమీషన్ ఆశతో బ్యాంకు ఖాతాలు ఇస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. వ్యక్తిగత వివరాలు, ఓటీపీ, ఆధార్ వంటివి ఎవరితోనూ పంచుకోవద్దు" అని ప్రజలను హెచ్చరించారు.

## అక్రిడిటేషన్ పాలసీపై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 11:**
తెలంగాణ మీడియా అక్రిడిటేషన్ పాలసీపై వివరణ ఇవ్వాలంటూ ప్రభుత్వానికి మంగళవారం హైకోర్టు నోటీసులు జారీ చేసింది.


HIGH COURT FOR THE STATE OF TELANGANA

MAIN CASE No: W.P.No.3871 of 2026

PROCEEDING SHEET

| Sl. No. | Date | ORDER | OFFICE NOTE |
|---|---|---|---|
| 1. | 10.02.2026 | HCJ (AKrS,J) & GMM,J<br>Mr. Mohd. Masiuddin, learned counsel appears for the petitioner.<br>As prayed by Mr. G.Veeraswamy, learned Government Pleader for General Administration Department appearing for respondent Nos.1 to 3, three weeks' time is granted to file counter affidavit.<br>List the matter on 12.03.2026.<br>HCJ (AKrS,J)<br>GMM,J<br>KL | |

అక్రిడిటేషన్ కమిటీ, నిబంధనలు, అర్హతలకు సంబంధించి ప్రభుత్వ జీవోను సవాలు చేస్తూ హైటెక్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. డిజిటల్, కేబుల్ ఛానళ్లకు అక్రిడిటేషన్‌ల జారీకి నిర్ణయించిన అర్హతలు రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం అక్రిడిటేషన్‌ల జారీ ప్రక్రియ మొదలైందని, జీవో అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరగా.. ఏ ప్రాతిపదికన మార్గదర్శకాలు జారీ చేసిందో తెలుసుకోకుండా స్టే ఇవ్వలేమని ధర్మాసనం పేర్కొంది. 3 వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని సీఎస్, సాధారణ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి, సమాచారశాఖ కమిషనర్, మీడియా అకాడమీ ఛైర్మన్‌లకు ఆదేశాలు జారీ చేస్తూ విచారణను మార్చి 12కు వాయిదా వేసింది.

## రూ.700 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 11:**
కొండాపూర్‌లో రూ.700 కోట్ల విలువైన భూమిని హైడ్రా కాపాడింది. శేరిలింగం పల్లి మున్సిపల్ కార్యాలయం- మదీనగూడ మార్గంలో హైడ్రా ఆపరేషన్ చేపట్టింది. స్థానిక జంగమోని కుంటకు సంబంధించిన 4 ఎకరాల భూమిని కబ్జాదారులు ఆక్రమించారు. మట్టిపోసి ప్లాట్లుగా చేసి అమ్మకానికి సిద్ధమయ్యారు. దీంతో వారిపై రెవెన్యూ అధికారులు కేసులు పెట్టారు. ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా అధికారులు కుంట చుట్టూ ఫెన్సింగ్ ప్రక్రియ చేపట్టారు.


## ట్రాఫిక్ చలాన్ల కోసం బ్యాంక్ అకౌంట్ లింక్ రవాణా శాఖ క్లారిటీ




**తెలంగాణ వెలుతురు ఫిబ్రవరి 11:**
వెహికల్ రిజిస్ట్రేషన్ సమయంలో చలాన్ల కోసం బ్యాంక్ ఖాతా వివరాలు సేకరిస్తున్నారనే ప్రచారంలో నిజం లేదని రవాణా శాఖ స్పష్టం చేసింది. చలాన్ల కోసం రిజిస్ట్రేషన్ నంబర్లను లేదా ఓనర్ల బ్యాంక్ ఖాతాలను లింక్ చేసి, డబ్బులు ఆటోమేటిక్గా కట్ అయ్యేలా చేసే విధానం ఏదీ ప్రస్తుతం అమలులో లేదని వివరణ ఇచ్చింది. అలాంటి విధానాన్ని అమలు చేయాలని ఆదేశాలు జారీ చేయలేదని పేర్కొంది.

# మహారాష్ట్రలో భూకంపం

**మహారాష్ట్ర వెలుతురు ఫిబ్రవరి 11, 2026:**



మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలోని ముఖేడ్ తాలూకాలో ఇవాళ భూకంపం సంభవించింది. దాదాపు 8 గ్రామాలు రిక్టర్ స్కేలుపై 3 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు సమాచారం. ఆకస్మిక ప్రకంపనలు ప్రజల్లో భయాన్ని రేకెత్తించాయి. దీంతో చాలా మంది ఇళ్ల నుండి బయటకు పరుగులు తీశారు. ఇప్పటివరకు ఎటువంటి ప్రాణనష్టం జరగనట్లు తెలుస్తోంది. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## నిజామాబాద్ పట్టణంలోని సన్ఫవర్ హైస్కూల్లో ఓటు హక్కును వినియోగించుకున్న టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్




**నిజామాబాద్ వెలుతురు ఫిబ్రవరి 11:**
నిజామాబాద్ పట్టణంలోని సన్ఫవర్ హైస్కూల్లో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరబోతోంది అని విశ్వాసం వ్యక్తం చేశారు. నా పుట్టిన గడ్డపై రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవడం గర్వంగా ఉంది అన్నారు. రాజ్యాంగం కల్పించిన వరం ఓటు హక్కు అని పేర్కొంటూ, ప్రతి ఒక్కరు తప్పకుండా ఓటు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఓటింగ్ శాతం పెరిగితే ప్రజలకు సేవ చేసే, క్వాలిటీ ఉన్న నాయకులు ఎన్నికవుతారని తెలిపారు. నిత్యం ప్రజల్లో ఉండే నాయకుడే గెలవాలని తన ఆకాంక్ష అని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ మతం పేరుతో ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. నిజామాబాద్ ప్రజలు అభివృద్ధికి పట్టం కడతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రత్యేక కార్యదర్శిగా జయేశ్ రంజన్ బాధ్యతలు

**హైదరాబాద్,ఫిబ్రవరి11( వెలుతురు):**
గ్రేటర్ హైదరాబాద్, మల్కాజ్ గిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లకు ప్రత్యేక అధికారిగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ బాధ్యతలు స్వీకరించారు. మల్కాజ్‌గిరి జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎస్.పంకజ, హైదరాబాద్ ఈడీగా స్రామాట్ అశోక్, సైబరాబాద్ ఈడీగా ఎం.సంతోష్, లోక్‌భవన్ జాయింట్ సెక్రటరీగా కె.శశి కిరణాచారిలను రాష్ట్ర సర్కార్ నియమించింది.





కొల్లాపూర్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్న పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**కొల్లాపూర్ వెలుతురు ఫిబ్రవరి 11:**

## ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి అడ్లూరి..



**కరీంనగర్ వెలుతురు ఫిబ్రవరి 11:**
రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా తన ఓటు హక్కును కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వినియోగించుకున్నారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మూడో డివిజన్ లో మంత్రి లక్ష్మణ్ కుమార్ ఓటరుగా ఉండగా తన ఓటు హక్కును రెయిన్ బో ఇంగ్లీష్ మీడియం స్కూల్ పోలింగ్ కేంద్రం లో మంత్రి ఓటు హక్కు వినియోగించుకున్నారు.



# సంపాదకీయం.. స్పీకర్ సమవర్తిగా ఉండాల్సిందే !

స్పీకర్ సమర్థతపైనే చట్టసభల్లో సమస్యలపై చర్చ సాగుతుంది. స్పీకర్ నిజాయితీగా, నిష్పక్షపాతంగా ఉంటే చట్టసభల్లో అర్థవంతమైన చర్చకు అవకాశం ఉంటుంది. అసెంబ్లీ అయినా పార్లమెంట్ అయినా ఇదే వర్తిస్తుంది. గతంలో కాంగ్రెస్ హయాలో అయినా, ఎన్‌డిఎ హయాంలో అయినా చర్చలు ఫలవంతంగా సాగేవి. ప్రతిపక్షాలు ఎక్కడ ఏ సమస్యలు లేవనెత్తుతాయా అని ప్రభుత్వాలు ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేసేవి. నీలం సంజీవరెడ్డి, బలరా÷– జాకఢ్, శివరాజ్ పాటిల్, పిఎ సంగ్మా ఇలా ఎందరో స్పీకర్లు సభాధ్యక్షస్థానానికి వన్నె తెచ్చారు. సమస్యలపై చర్చలకు అవకాశం ఇచ్చారు. ఇక్కడ చర్చలంటే విపక్షం నుంచే అన్నది వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే గత 12 ఏళ్లుగా అంటే..మోడీ అధికారం చేపట్టిన తరవాత చట్టసభల్లో అర్థవంతమైన చర్చలకు ఆస్కారం లేకుండా పోయింది. అర్థవంతం కాదు కదా అసలు చర్చలకే ఆస్కారం కనిపించడం లేదు. విపక్షం నుంచి ఎవరైనా లేస్తే..స్పీకర్ మైక్ కట్ చేయడం అలవాటు చేసుకున్నారు. అలాంటప్పుడు ప్రజలు ఏమనుకుంటున్నారో ఎలా తెలుస్తుంది. నిజానికి ప్రభుత్వమే చర్చలను ఆహ్వానించాలి. తమ పాలనా విధానాలపై ప్రజల్లో ఎలాంటి ప్రభావం ఉందో అన్నది తెలుసు కోవాలి. అయితే మోడీ ప్రభుత్వం సమస్యలపై చర్చలను కోరుకోవడం లేదు. చర్చ జరిగితే సమాధానం ఇవ్వడం, ఇరుకున పడడం ప్రభుత్వానికి ఇష్టం లేదన్నది సుస్పష్టం. ఇకపోతే ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఏదేని సమస్యపై లేచి నిలబడితే మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదు. కనీసం విపక్షనేతకు గౌరవం ఇవ్వాలన్న ఆలోచన కూడా లేకుండా లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా వ్యవహరిస్తున్నారు. సమావేశాలను ప్రత్యక్షం గా వీక్షించే వారికి ఇది స్పష్టంగా కనిపిస్తుంది. ఒకవేళ రాహుల్ విపక్ష నేతగా సరిగా మాట్లాడకపోతే దానికి సమాధానం ఇవ్వడానికి






ప్రభుత్వానికి అవకాశం ఉంటుంది. కానీ అసలు మైక్ ఇచ్చీ ఇవ్వనట్లుగా స్పీకర్ వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాల్సి వచ్చింది. ఇది కూడా మంచిదే. ఎలాగూ బలం ఉంది. స్పీకర పదవికి వచ్చిన ధోకా లేదు. కనీసంఈ సందర్భంగా అయినా పార్లమెంట్‌లో చర్చ సాగితే మంచిదే. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్ష ఎంపీలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు మంగళవారంనాడు నోటీసులు ఇచ్చారు. నోటీసును లోక్‌సభ సెక్రటరీకి అందజేశారు. ఇండియా కూటమికి చెందిన 118 మంది ఎంపీలు అవిశ్వాస తీర్మానం నోటీసుపై సంతకాలు చేశారు. సభలో మాట్లాడేందుకు విపక్ష నేతలకు స్పీకర్ అవకాశం ఇవ్వడం లేదంటూ ఈ నోటీసు ఇచ్చారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ, డీఎంకే పార్టీలు దీనికి మద్దతు పలుకగా, తృణమూల్ కాంగ్రెస్ ఇంతవరకూ సంతకం చేయలేదు. ఈ ప్రక్రియను సమీక్షించనున్నట్టు టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ తెలిపారు. అవిశ్వాస తీర్మానంపై రాహుల్ గాంధీ సంతకం చేయలేదని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో స్పీకర్ తొలగింపు పిటిషన్‌పై ప్రతిపక్ష నేత సంతకం చేయడం సరైంది కాదని, రాహుల్ గాంధీ సంతకం చేయకపోవడానికి అదే కారణమని పేర్కొన్నాయి. కాగా, అవిశ్వాస తీర్మానం పరంగా లోక్‌సభలో బలాబలాలను చూసినప్పుడు లోక్‌సభలో అధికార పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఉంది. 293 మందితో మెజారిటీ సభ్యుల బలం వారికి ఉండగా, విపక్షాలకు 214 మంది సభ్యుల బలం ఉంది. బలాల సంఖ్య ఎలా ఉన్నా విషయం మాత్రం ప్రజలకు కూడా తెలుస్తుంది. పార్లమెంట్ సమావేశాలు ఎన్ని రోజులు జరిగినా మొక్కుబడిగా మమ అనిపిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చ సాగడం లేదు. దేశంలో అవినీతి, అక్రమాలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అనేక సమస్యలు ఉన్నాయి. రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశాలను చర్చకు అవకాశం ఉంటుంది. కానీ విపక్షాలకు అలాంటి అవకాశం రావడం లేదు. కేవలం ప్రధాని పడికట్టు పదాలతో ఇచ్చే ఉపన్యాసమే ప్రధాన వార్తగా చలామణి అవుతుంది. వికసిత భారత్, ఆత్మనిర్భర భారత్ వంటి పడికట్టు పదాలు తప్ప దేశం పురోగతికి సంబంధించి న అంశాలపై చర్చలకు ఆస్కారం కలగడం లేదు. మాజీ ఆర్మీచీఫ్ నరవాణె అముద్రిత పుస్తకంలోంచి కొన్ని పదాలను ఉటంకిస్తూ రాహుల్ మాట్లాడాలనుకున్న అవకాశం దక్కలేదు. ఒకవేళ అముద్రిత పుస్తకం ప్రస్తావన వద్దని చెప్పడం వేరు. కానీ అసలు మాట్లాడనీయక పోవడం సరికాదు. వాజ్‌పేయ్, పివి నరసింహారావు, రాజీవ్ గాంధీ, మన్మోహన్ సింగ్ ప్రధానులుగా ఉన్న సమయాల్లోనూ పార్లమెంటులో అర్థవంతమైన చర్చలు సాగేవి. కానీ ప్రస్తుతం చర్చలకు ఆస్కారం లేకపోవడంతో విపక్ష ఎంపిలు పోడియం వద్ద ఆందోళన చేయడం, సభనుంచి బయటకు రావడం రివాజుగా మారింది. ఇకపోతే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ విషయంలో ఎందుకనో విపక్షం వైపు చూడడం మానేశారు. విపక్ష సభ్యుల ప్రస్తావనలకు స్పందించడం లేదు. ఇది ఆయన ఆత్మ పరిశీలన చేసుకోవాలి. అంతేకాదు...తన వైఖరిని మార్చుకుని ప్రజలకోసం పార్లమెంట్ అన్నది గుర్తించాలి. ఇకపోతే అవిశ్వాస తీర్మానంపై చర్చ పూర్తయ్యేంత వరకూ సభకు దూరంగా ఉండాలని ఓంబిర్లా నిర్ణయం తీసుకున్నారు. స్పీకర్‌ను తొలగించాలంటూ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు లోక్‌సభ సెక్రటరీకి కాంగ్రెస్ నోటీసు ఇచ్చిన నేపథ్యంలో ఓం బిర్లా ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో రాహుల్ గాంధీకి స్పీకర్ అవకాశం ఇవ్వలేదని, నిలదీసిన 8 మంది ఎంపీలపై సస్పెన్స్ వేటువేశారని విపక్షాలు తప్పుపడు తున్నాయి. విపక్షానికి చెందిన మహిళా ఎంపీలు దాడికి ప్రయత్నిస్తారనే సమాచారంతో ప్రధాని ప్రసంగం లేదని సభాపతి స్థానం నుంచి ఓం బిర్లా ప్రకటించడం, మహిళా ఎంపీలపై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసిన బీజేపీ ఎంపీపై స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఈ క్రమంలో 118 మంది సభ్యుల సంతకాలతో మంగళవారం ఉదయం లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు విపక్షాలు అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేశాయి. కాగా, దీనికిముందు అధికార పార్టీకి తలొగ్గి తమపై నిరాధారమైన ఆరోపణలు చేశారంటూ ఓం బిర్లాకు రాసిన లేఖలో కాంగ్రెస్ మహిళా ఎంపీలు నిరసన తెలిపారు. ఇవన్నీ ఎలా ఉన్నా పార్లమెంటులో చర్చలు జరగాలి. అర్థవంతమైన చర్చలకు ఆస్కారం ఉండాలి. స్పీకర్ అలాంటి అవకాశం కల్పించాలి. గతంలో పనిచేసిన స్పకీర్లు అనుసరించిన తీరును నడవాలి. అప్పుడే పార్లమెంట్ సమావేశాలకు అర్థం ఉంటుంది. అధికార బిజెపి కూడా ప్రజాస్వామ్యబద్దంగా పనిచేయడానికి సిద్దంగా ఉండాలి. గత పదేళ్లతో పోలిస్తే 2024 ఎన్నికల్లో బిజెపి బలం గణనీయంగా పడిపోయింది. ఇప్పుడు ఎన్‌డిఎ పక్షాల మద్దతుతో కొనసాగుతున్నామని గుర్తించాలి. ఇంకా మభ్య పెట్టే పనులతో ప్రజల్లో మరింత పలచన కాకుండా చూసుకుంటే మంచిది.

## మూసీ ప్రాజెక్టులో కీలక అడుగు

**- భూసేకరణకు ప్రభుత్వం నోటిఫికేషన్**



**హైదరాబాద్,ఫిబ్రవరి11( వెలుతురు):**

మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మూసీ అభివృద్ధికి భూసేకరణ పక్రియను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రారంభించింది. ఈ మేరకు మూసీ రివర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఓఖీఆఅఒ) బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. దీని ప్రకారం ఫేజ్ ఏ1లో హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 9.2 కిలోమీటర్లు, ఫేజ్ ఏ2లో ఉస్మాన్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 11.8 కిలోమీటర్ల పరిధిలో అధికారులు భూసేకరణ చర్యలు చేపట్టనున్నారు .హైదరాబాద్, గోల్కొండ మండలం, రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పరిధిలో భూముల సేకరణ కోసం నోటిఫికేషన్ జారీ చేశారు. సుమారు 50 ఎకరాలకు పైగా భూమి సేకరించేందుకు పక్రియ ప్రారంభమైంది. భూ యజమానులకు మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం అందించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఆయా యజమానులు తమ హక్కుల పత్రాలు పట్టాలు, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు నిర్దేశిత సమయంలో సమర్పించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఏమైనా అభ్యంతరాలంటే నిర్ణీత సమయంలో తెలియజేయాలని అధికారులు సూచించారు. సర్వే నంబర్లు, గ్రామాల వారీగా పూర్తి జాబితాను కూడా ప్రకటించారు. నిబంధనల ప్రకారం.. ఈ భూసేకరణ పక్రియను అధికారులు చేపట్టనున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాల పరిధిలో మూసి అభివృద్ధి పనులు దశలవారీగా కొనసాగనున్నాయి. మొత్తం గండిపేట నుంచి గౌరెల్లి వరకు సుమారు 55 కిలోమీటర్ల పరిధిలో, 14 మండలాలు, 46 గ్రామాల్లో మూసీ అభివృద్ధి జరగనుంది.

## వందేమాతర గీతం ఇక తప్పనిసరి

**- జగనణమన కంటే ముందే వందేమాతరం**

**- ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి11( వెలుతురు):**

అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు, పాఠశాలల్లో ఇక నుంచి జాతీయ గీతం జనగణమన కంటే ముందుగా జాతీయ గేయం వందేమాతరం ఆలపించడాన్ని కేంద్రం తప్పనిసరి చేసింది. ఈ మేరకు బుధవారం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కొత్త నిబంధలను అమల్లోకి తెచ్చింది. వందేమాతరం ఆలపిస్తున్న సమయంలో అందరూ లేచి నిలబడాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. అంతేకాకుండా అన్ని పౌరపురస్కారాలు ఇచ్చే సమయంలో, రాష్ట్రపతి హాజరయ్యే అన్ని కార్యక్రమాల్లో వందేమాతరం ఆలపించాలని తెలిపింది. అయితే సినిమా హాళ్లలో దీనిని ప్రదర్శించాల్సిన అవసరం లేదని నిబంధనల్లో పేర్కొంది. జాతీయ గీతం, గేయం పాడుతుండగా.. అంతరాయం కలిగించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు. కొత్త నిబంధనల కింద బాధ్యులకు గరిష్ఠంగా మూడేళ్ల జైలుశిక్ష విధించనున్నారు. ఇదిలా ఉంటే.. బంకించంద్ర ఛటర్జీ తొలుత 1875లో వందేమాతరాన్ని రచించారు. తర్వాత తన ఆనంద్‌మఠ్ నవలలో దీన్ని భాగం చేశారు. ప్రస్తుతం కేందప్రభుత్వం 'వందేమాతరం' 150వ వార్షికోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో తాజా ఉత్తర్వులు వచ్చాయి. అందులో ఆరు చరణాలను పాడాలని కేంద్రం పేర్కొంది. వాటిని 3 నిమిషాల 10 సెకన్లలో ఆలపించాలి. స్వాతంత్య్ర పోరాట సమయంలో ముస్లింలీగ్ అభ్యంతరాల మేరకు.. ఆరు భాగాల్లోంచి ఎలాంటి మతపరమైన ప్రస్తావనా లేని తొలి రెండింటిని మాత్రమే కాంగ్రెస్ స్వీకరించింది. స్వాతంత్య్రానంతరం నెహ్రూ ప్రభుత్వం వివాదంలేని తొలి రెండు భాగాలతో.. వందేమాతరాన్ని జాతీయ గేయంగా ప్రకటించింది.

## టాయ్‌లెట్ పేపర్ కన్నా నీచంగా వాడేసారు

**- అనవసర యుద్ధాల్లోకి మమ్మలను లాగారు**

**- అఫ్ఘాన్ వ్యతిరేక యుద్ధంలో పాల్గొనడంతో తీరని నష్టం**

**- అమెరికా తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించి పాక్ రక్షణ మంత్రి**

**ఇస్లామాబాద్,ఫిబ్రవరి11( వెలుతురు):**

ఒక దేశానికి ఇంత కంటే అవమానం ఏముంటుందీ.. ప్రతి దానికీ అడుక్కోవటం మొదలైతే ఇంత కన్నా విలువ ఎవరిస్తారు.. పక్క దేశంపై ఏడుపులు, పెడబొబ్బలు.. దాడులు.. కుట్రలు, విధ్వంసంతో నిత్యం హింసతో బతికే దేశానికి ఇంత కంటే గౌరవం ఎవరిస్తారు.. ఇవన్నీ మన పక్కనే ఉన్న పాకిస్తాన్ దేశం గురించే.. పాకిస్తాన్ దేశాన్ని టాయిలెట్ పేపర్ కంటే నీచంగా.. నీచాతి నీచంగా చూస్తున్నారని స్వయానా రక్షణమంత్రి వాపోయారు. స్వయంగా పాక్ పార్లమెంట్‌లో ఏడుస్తూ చెప్పిన మాటలు.. పాకిస్తాన్ దేశం గౌరవం అమెరికా దగ్గర ఎలా ఉంది అంటే.. టాయిలెట్ పేపర్.. టిష్యూ పేపర్ కంటే నీచంగా ఉందంటూ ఆయన మాట్లాడిన మాటలు ఇప్పుడు వైరల్ అయ్యాయి. పాకిస్తాన్ రక్షణ శాఖ మంత్రి ఆసిఫ్ ఖవాజా ఆ దేశ పార్లమెంట్ సాక్షిగా షాకింగ్ కామెంట్స్ చేశారు. అమెరికా తన సొంత ప్రయోజనాల కోసం పాకిస్తాన్‌ను టాయిలెట్ పేపర్ కంటే దారుణంగా వాడుకుని వదిలేసిందని వాపోయారు. అమెరికాతో సత్సంబంధాలు పాకిస్తాన్‌ను బలహీనపరిచి అస్థిరంగా మార్చిందని



సంచలన వ్యాఖ్యలు చేశారు. 1999 తర్వాత అమెరికాతో కలిసి పనిచేయాలని పాకిస్తాన్ తీసుకున్న నిర్ణయం దేశానికి తీవ్ర నష్టాన్ని కలిగించిందని అన్నారు. పాకిస్తాన్ ఎప్పుడూ తమకు సంబంధం లేని యుద్ధాల్లోకి లాగబడిం దని ఆయన బహిరంగంగా అంగీకరించారు. అమెరికా తన రాజకీయ ప్రాధాన్యాలు, అవసరాలు, వ్యూహాత్మక ప్రయోజనాల కోసం తమ దేశాన్ని వాడుకొందని అన్నారు. తర్వాత తమను టాయిలెట్ పేపర్ కంటే ఘోరంగా తీసిపారేసిందన్నారు. అఫ్గానిస్థాన్ విషయంలో 1999 తర్వాత అమెరికాతో చేతులు కలపడం తాము చేసిన పెద్ద తప్పిదమని అన్నారు. దీనివల్ల దేశం చాలా నష్టపోయిందని.. దాని పర్యవసానాలను ఇప్పటికీ అనుభవిస్తోందని వాపోయారు. 1999లో అప్పటి పాక్ సైన్యాధిపతి జనరల్ పర్వేజ్ ముషారఫ్ నేతృత్వంలోని సైన్యం.. ప్రధాన మంత్రి నవాజ్ షరీఫ్ ప్రభుత్వాన్ని కూల్చేసి అధికారాన్ని చేజిక్కించుకుందని ఆసిఫ్ ఖవాజా అన్నారు. 2001 తర్వాత అమెరికా మద్దతుతో ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి తాలిబన్లకు వ్యతిరేకంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. అయితే, తాలిబన్లు తిరిగి తమపై హింసకు పాల్పడ్డారన్నారు. తాము ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పుడు అగ్రరాజ్యం తమకు ఎటువంటి సహాయం చేయలేదని ఆరోపించారు. ఆఫ్ఘాన్‌పై అమెరికా చేసిన యుద్దానికి పాక్ మద్దతు ఇవ్వడం ద్వారా తాలిబన్లకు పాకిస్తాన్ వ్యతిరేకంగా మారిందని ఒప్పుకున్నారు. అమెరికా చివరికి ఈ ప్రాంతం నుండి వైదొలగడంతో పాకిస్తాన్ దీర్ఘకాలిక హింస, తీవ్రవాదం, ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటోందని అన్నారు. అమెరికాను సంతృప్తి పరచడానికే పాక్ మాజీ సైనిక పాలకులు జియా–ఉల్–హక్, పర్వేజ్ ముషారఫ్ ఆఫ్ఘనిస్తాన్ యుద్ధంలో చేరారని పేర్కొన్నారు. మనం ఎదుర్కొన్న నష్టాలను ఎప్పటికీ భర్తీ చేయలేమని.. పాకిస్తాన్ చేసిన తప్పులను తిరిగి మార్చలేనివి అని అన్నారు. ఇటీవల అమెరికాతో పాక్ చెట్టాపట్టాలేసుకుని తిరుగుతోంది. ఈ క్రమంలో అమెరికాకు వ్యతిరేకంగా పాక్ రక్షణ మంత్రి ఆసిఫ్ ఖవాజా బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశంగా మారింది.

## ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో కుచ్చుటోపీ


**- 500 మంది నుంచి 270 కోట్లు వసూళ్లు**

**- ఎనిమిదేళ్లయినా అతీగతీ లేని ప్రాజెక్టు**

**- ఫిర్యాదుతో పోలీసుల కేసు నమోదు**

**హైదరాబాద్,ఫిబ్రవరి11( వెలుతురు):**

ఊదరగొట్టే ప్రకటనలు ఇస్తారు. అతి తక్కువ ధరకే ప్లాట్స్ ఇస్తామంటూ ఊరిస్తారు. తీరా చూస్తే.. డబ్బులు కట్టించుకుని ఏళ్లకు ఏళ్లు.. వారి చుట్టూ తిప్పించుకుంటారు. డబ్బులు చేతిలో పడ్డాక.. ఉసూరమనిపిస్తారు. అంతా రియల్ మాయాజాలం. ఆ రియల్ మాయకు అమాయకులైన జనం మోసపోతున్నారు. హైదరాబాద్‌లో ఇలాంటి రియల్ మోసాలు చాలా జరుగుతున్నాయి. తాజాగా అలాంటి చీటింగ్ గ్యాంగ్ ఒకటి వెలుగులోకి వచ్చింది. కూకట్‌పల్లిలో వైట్ వాటర్ పేరుతో ప్లాట్స్ అమ్ముతున్నామని ప్రీలాంచ్ ఆఫర్ పేరుతో మోసం చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దాదాపు 500 మంది నుంచి 270 కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వచ్చాయి. పదేళ్ల నుంచి ప్రాజెక్టు పేరు చెప్పి డబ్బులు వసూలు చేశారని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వైట్ వాటర్ కన్స్టక్షన్ యజమాని అజయ్‌తో పాటు పలువురుపై కేసుల నమోదు చేసి సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈ కేసు మూసాపేట పవర్ నగర్ కాలనీకి



చెందిన భోగాడి సుజాత ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదు చేశారు పోలీసులు. ఐతే ఈ కేసులో ఇప్పటి వరకు ఎవరినీ అరెస్ట్ చేయలేదు. వైట్ వాటర్స్ యాజమాన్యానికి ఎ÷–లాట్ కొనుగోలు కోసం ఫిర్యాదుదారు సుజాత సుమారు 80 లక్షల రూపాయలు చెల్లించారు. కానీ ఆమె తీసుకున్న ఎ÷–లాట్‌ను బ్యాంకులో తనఖా పెట్టినట్లు ఆమెకు తెలిసింది. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. మరోవైపు వైట్ వాటర్స్ యాజమాన్యం.. ఎ÷–లాట్ల కొనుగోలుదారులకు ఎ÷–లాట్లను స్వాధీనం చేయకుండా ఆలస్యం చేస్తున్నారు. ఇప్పటికే డబ్బు చెల్లించి పదేళ్లు గడిచిపోయిందని బాధితులు చెబుతున్నారు. పైగా ధరలు పెంచడం, ఒకే ప్లాట్‌ను పలుమార్లు అమ్మారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీంతో వైట్ వాటర్స్ యాజమాన్యంపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. నిజానికి ఈ వైట్ వాటర్స్ ప్రాజెక్టు వెంచర్‌ను 2018లో ప్రారంభించారు. కానీ ఇప్పటివరకు కేవలం టవర్స్‌లో నిర్మాణం కొంతమేర పూర్తయింది. అ, ఆ టవర్ల బేస్‌మెంట్లు మాత్రమే పూర్తి చేశారు. ఇ, ఈ టవర్ల నిర్మాణం ఇంకా ప్రారంభం కాలేదు. నమోదు గడువు ఇప్పటికే రెండుసార్లు పొడిగించగా.. ఈ ఏడాది జూన్‌లో అది కూడా ముగియనుందని కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు. గతంలో డిసెంబర్ 2024, డిసెంబర్ 2025లో ఎ÷–లాట్లు హ్యాండ్ ఓవర్ చేస్తామని చెప్పి మోసం చేసినట్లు బాధితులు చెబుతున్నారు. వైట్ వాటర్స్ యజమాని అజయ్‌పై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుకున్నారు. ముందస్తుగా డబ్బులు చెల్లిస్తే అతి తక్కువ ధరకే ఎ÷–లాట్ ఇస్తామంటూ అందరిని నమ్మించాడు అజయ్. దీంతో ప్రీ లాంచ్ ఆఫర్ పేరుతో వచ్చిన దీనిని ఆకర్షితులై చాలా మంది పెట్టుబడులు పెట్టారు. ఇప్పటివరకు 270 కోట్ల రూపాయలకు వసూలు చేసినట్లు అధికారులు గుర్తించారు. ఇక్షచి పోలీసులకి ఇప్పటివరకు వందమంది కాంటాక్ట్ అయ్యారు. మరోవైపు పోలీస్ కేసు నుంచి తప్పించుకునేందుకు అజయ్ కొత్త నాటకానికి తెర తీసినట్టు బాధితులు చెబుతున్నారు. తమకు డబ్బులు ఇస్తామని చెప్పి నమ్మించి.. కొందరి చేత కేసులు విత్ డ్రా చేయించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

## మక్తల్ లో బిజెపి వార్డు అభ్యర్థి మహాదేవప్ప ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరం

**- ఆత్మహత్యను బలహీన వర్గాలకు చెందిన మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ కు ఆపాదించడం సరికాదు**

**- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్**



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 11:** నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణ ఆరవ వార్డు బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న మహాదేవ ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమని,కానీ ఆ ఆత్మహత్యను బలహీన వర్గాలకు చెందిన మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ కు ఆపాదించడం తగదని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్ పేర్కొన్నారు.మంత్రి వాకిటి శ్రీహరి సొంత నియోజకవర్గంలో ఆత్మహత్య చేసుకుంటే ఆయన వేధింపుల వల్లే ఆత్మహత్య చేసుకున్నాడు అని అనడం మహబూబు నగర్ ఎంపీ డీ.కే అరుణకు తగదన్నారు.ఒక బీసీ బిడ్డ మంత్రి అయితే ఓర్వలేక ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## నేషనల్ కరాటేలో బంగారు పతకాలు సాధించిన నాచారం ఛాంపియన్స్



**నాచారం వెలుతురు ఫిబ్రవరి 11:** జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మెమోరియల్ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ పోటీలు గుంటూరు జిల్లా, మంగళగిరి నియోజకవర్గంలోని తాడేపల్లి, ఐ ర్ ఏ కన్వెన్షన్ లో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ పోటీలకు దేశంలోని నలుమూలల నుండి క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర, ఉప్పల్ నియోజకవర్గ, నాచారం డివిజన్ నుండి బి.రాము స్పారింగ్ విభాగంలో మరియు బి.ఆదర్శిని కటాస్ లో పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి బంగారు పథకం సాధించారు. వీరిరువురిని తెలంగాణ చీఫ్ ఎగ్జామినర్ రాపోల్ సుదర్శన్ మరియు మాస్టర్. రాజశేఖర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందిస్తూ వారికి బంగారు పథకాలు అందజేశారు. ఈ సందర్భంగా రాపోల్ సుదర్శన్ మాట్లాడుతూ, బి.రాము గౌడ్ మరియు ఆదర్శిని నేషనల్ కరాటేలో బంగారు పథకాలు సాధించి తెలంగాణ రాష్ట్ర కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టడమే కాకుండా నేటితరం యువతకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. వీరు భవిష్యత్తులో మరిన్ని పథకాలు సాధించి ఓలంపిక్స్ స్థాయికి ఎదగాలని దీవించారు.

## 2 కోట్ల 60 లక్షల నిధులతో హిమాయత్ నగర్ డివిజన్ లో అభివృద్ధి పనులు..

**- పనులను ప్రారంభించిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్..**





**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 11:** హిమాయత్ నగర్ డివిజన్ లో 2 కోట్ల 60 లక్షలతో 10 చోట్లలో నూతన సీసీ రోడ్డు పనులను ఖైరతాబాద్ శాసనసభ్యులు దానం నాగేందర్ హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ప్రారంభించారు. హిమాయత్ నగర్ డివిజన్ స్ట్రీట్ నెంబర్ 2, 15 లో రెండు చోట్ల, జనార్దన్ బాద, బి జె ఆర్ కాలేజ్ లానే, విట్టల్ వాడి, షంషీర్ బాగ్, అవంతి నగర్, చంద్ర నగర్ బస్తీలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి రామన్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు ఎం ఏ నయీం అశోక్, ఎత్తి రాజ్, యాదగిరి, ప్రభాకర్, రాజేంద్రప్రసాద్, జిల్లా శివ, తాజ్ ఖాన్, సైదు, మన్మోహన్, శ్రీనాథ్, సర్ఫరాజ్, కృష్ణ, అజర్, హమీద్, ఓం ప్రకాష్, పాషా, డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అఖిల్ అహ్మద్, మజీద్, మన్సూర్, సోహెల్, మాధవి, ముజఫర్, బిందియా, అనూష, పూర్ణిమ, మహేష్, జాకీ జైస్వాల్, సాయి, కొండయ్య, పురుషోత్తం, శేఖర్, సందీప్, జగదీష్,జాహిద్, బస్తి మరియు కాలనీ అధ్యక్షులు, నివాసులు తదితరులు పాల్గొన్నారు.

## మాదాపూర్ ఎస్సైని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ఏసీబీ

**- మాదాపూర్ ఎస్సై వినయ్ ని అదుపులోకి తీసుకున్న ఏసీబీ**

**- రూ. 50 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు**

**- నగదును సీజ్ చేసిన అధికారులు**




**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 11:** హైదరాబాద్ లో మరో అవినీతి పోలీసు అధికారిని ఏసీబీ అధికారు లు పట్టుకున్నారు. మాదాపూర్ ఎస్సై వినయ్ ఈరోజు రూ. 50 వేలు లంచం తీసుకుంటూ అడ్డంగా బుక్ అయ్యారు. వివరాల్లోకి వెళితే, ఓ కేసు విషయంలో సహకారం అందిస్తానంటూ ఫిర్యాదుదారుడి నుంచి వినయ్ రూ. 50 వేలు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఫిర్యాదుదారుడి నుంచి లంచం డబ్బులు తీసుకుంటున్న తరుణంలో ఏసీబీ అధికారులు ఎంట్రీ ఇచ్చారు. ఎస్సైని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. నగదును సీజ్ చేశారు. ఎస్సై వినయ్ ని అదుపులోకి తీసుకున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కృష్ణానగర్‌లో వైభవంగా చండీయాగం-భారీగా తరలివచ్చిన భక్తజనం అన్నదానం ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి





**హెచ్ బి కాలనీ, ఫిబ్రవరి 11:** మీర్పేట్ హెచ్‌బి కాలనీ డివిజన్ పరిధిలోని కృష్ణానగర్ శ్రీశ్రీశ్రీ మైసమ్మ, పోచమ్మ, నాగ దేవతల ఆలయంలో చండీయాగం ఘనంగా, వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ మహాయాగంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు జెరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

యాగశాలలో వేదమంత్రాల నడుమ జరిగిన కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించింది. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి అమ్మవారి ఆశీస్సులు అందజేశారు.కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సుఖేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సాయన్న, అధ్యక్షుడు రామచంద్రమూర్తి, కార్యదర్శి పల్లె శ్రీనివాస్ రెడ్డి, సలహాదారులు మల్లారెడ్డి, అంజయ్య గౌడ్, రాజయ్య, బాలయ్య గౌడ్, చారి, కిష్టారెడ్డి, ఎల్లయ్య గౌడ్, జయమ్మ, సుజాత, కృష్ణవేణి, అనిత, నాగలక్ష్మి పాల్గొన్నారు.అలాగే మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, సత్యనారాయణ యాదవ్, మహేష్ యాదవ్, మస్ల మణి, ధనరాజ్ గౌడ్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రాంప్రదీప్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గంథం నాగేశ్వరరావు, కాసం మహిపాల్ రెడ్డి, నెమురి మహేష్, వంజరి ప్రవీణ్ కరిపే, బోదాసు లక్ష్మీనారాయణ, మధు ముదిరాజ్, మల్లేష్ గౌడ్, దేవేందర్ కుమార్, నవీన్, కుమార్, హరినాథ్ రెడ్డి, దామెర కుమార్, నగేష్, శేఖర్ గౌడ్, దండెం నరేందర్ తదితరులు హాజరయ్యారు.

## మంచాల గ్రామంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో రావుల ఆనంద్ కు 3 లక్షల రూపాయల ఎల్ఓసి అందజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**- ఎల్ ఓసి పేద ప్రజలకు ఒకవరం లాంటిది**

**- మంచాల మండలం ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు ఎడ్మ నరేందర్ రెడ్డి**



**మంచాల వెలుతురు ఫిబ్రవరి 11:** మంచాల మండలం మంచాలగ్రామంలో రావులబాషయ్య కుమారుడు రావులఆనంద్ అనారో గ్యం కారణంగా ప్రవేట్ హాస్పిటల్ లో అడ్మిట్ అయ్యి వైద్యంచేయించు కుంటున్నాడు ఆపరేషన్ కు డాక్టర్లుఆనంద్ కు ఆపరేషన్ చేయాలి3లక్షలు ఖర్చుఅవుతాయిఅని చెప్పడంతోడబ్బులు లేక దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆనంద్ తండ్రి రావులభాషయ్య స్థానిక కాంగ్రెస్ పార్టీనాయకులకు చె ప్పడంతో వెంటనే స్పందించిన మంచాలమండలం ఎంపీటీసీలఫోరంమాజీ అధ్యక్షుడు మంచాల గ్రామ సర్పంచ్ ఏర్పుల మానస వినయ్ ఉపసర్పంచ్ పందుల లింగంగౌడ్ కలిసి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఎమ్మెల్యే గారి సహకారంతో రావులఆనంద్ ఆ పరేషన్ కోసం3లక్షల రూపాయలఎల్ఓసి చేయించడం జరిగింది ఎల్ ఓసి పత్రాన్నికాంగ్రెస్ పార్టీ నాయకులు ఆనంద్ తండ్రి రావులబాషయ్యకు అందజేశారుఆపరేషన్ తర్వాత ఖర్చులు కూడా భరిస్తామని నాయకులు అన్నారు ఈసందర్భంగా మంచాల మండలం ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు ఎడ్మనరేందర్ రెడ్డి మాట్లాడుతూ పేదప్రజలకోసం కాంగ్రెస్ పార్టీఎల్లప్పుడూ అండగా ఉంటుంది ఆరోగ్యరీత్యాపేద ప్రజలుడబ్బులులేక వైద్యంచేయించుకోలేని స్థితిలోఉన్నపేద ప్రజల కు ఎల్ఓసి సిఎంరిలీఫ్ ఫండ్ వరంలాంటివిఅని అన్నారు ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మం చాల గ్రామశాఖ అధ్యక్షుడు రావులశ్రీనివాస్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులుగ్యార జంగయ్య సాయిలు దూసరికల్పన కుమార్ మాజీ ఎంపీటీసీ రావులమల్లయ్యనారెడ్డి హరికిషన్ రెడ్డి ఏరు కొండ రాములు ఎలమోనియాదయ్య ఆవరమేష్ తలారి బాలరాజు యువనాయకులు మొగిలి మహేష్ మహమ్మద్ హుసేన్ గడ్డంమహేష్ యువజన కాంగ్రెస్ పార్టీనాయకుడు రావుల ఆనంద్ పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో మున్సిపల్ పోలింగ్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు)ఫిబ్రవరి 11** కామారెడ్డి జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద నాలుగు మున్సిపాలిటీలలో జరుగుతున్న పోలింగ్ కేంద్రాలను, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర లు సందర్శించి, పరిశీలించారు.జిల్లాలో ఉదయం నుంచే ప్రారంభమైన



మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కామారెడ్డి జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద మున్సిపాలిటీల పరిధిలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ బుధవారం ఉదయం 7 గంటలకు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైంది ,పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ,జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు.మహిళలు, వృద్ధులు, యువత ఉత్సాహంగా పోలింగ్ లో పాల్గొంటున్నారని వారు పేర్కొన్నారు.పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, ర్యాంపులు, వీల్‌చైర్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించామని , పోలింగ్ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహిస్తూ, పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ,పారదర్శకంగా కొనసాగుతోందని, పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 5 .00 గంటల వరకు కొనసాగిందని, అర్హులైన ప్రతి ఓటరు తమ సమీప పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు హక్కును వినియోగించుకున్నారు. పిలుపునిచ్చారు.బాన్సువాడ లో 19 వార్డులు, 39 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రశాంత వాతావరణం లో పోలింగ్ ప్రక్రియ సజావుగా ప్రశాంతంగా కొనసాగుతున్నదని తెలిపారు.సమస్యాత్మక కేంద్రాలలో గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.ఈ సందర్భంగా ఎల్లారెడ్డి, బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూములను, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ లలో వార్డులు, పోలింగ్ బూతుల వారీగా నిర్దేశిత క్రమ సంఖ్యలో బ్యాలెట్ బాక్స్ లను అమర్చాలని అధికారులకు సూచించారు. కౌంటింగ్ కేంద్రాలలో అవసరమైన టేబుల్స్ ఏర్పాటు చేయాలని, ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా లెక్కింపు ప్రక్రియను జాగ్రత్తగా చేపట్టాలని ఆదేశించారు.

## ఏపీపీఎస్సీ గ్రూప్-1 అక్రమలాలపై సిట్

**అమరావతి,ఫిబ్రవరి11( వెలుతురు):** ఏపీపీఎస్సీ గ్రూప్-1 మూల్యాంకనంలో అక్రమాలు నిగ్గు తేల్చేందుకు సిట్ ఏర్పాటు చేయాలని ఏపీ హైకోర్టు ఆదేశించింది. అదనపు డీజీ స్థాయి అధికారి సిట్‌కు నేతృత్వం వహించాలని, మార్చి 16వ తేదీలోపు దర్యాప్తు పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని ఉన్నత న్యాయస్థానం నిర్దేశిరచింది. కేసు దర్యాప్తులో రాష్ట్రం వెలుపలి ఫోరెన్సిక్ నిపుణుల సాయం తీసుకో వాలని సూచించింది. ఎంపికైన అభ్యర్థుల జవాబపత్రాలు భద్రంగా ఉన్నాయో, లేదో నిర్ధారించాలని స్పష్టం చేసింది. జవాబు పత్రాలు తారుమారు చేశారా? అనే అంశాన్నీ ఫోరెన్సిక్ నిపుణులతో నిర్ధారించాలని ఆదేశించింది.

## ఆరుట్ల గ్రామంలో తెలంగాణ పబ్లిక్ పాఠశాలను సందర్శించిన గ్రామ సర్పంచ్ మానిపాటి శోభాకుమార్, ఉపసర్పంచ్ నూకంరాజు ముదిరాజ్





**మంచాల వెలుతురు ఫిబ్రవరి 11:** మంచాల మండలం ఆరుట్ల గ్రామం లోని తెలంగాణ పబ్లిక్ పాఠశాలను సందర్శించిన గ్రామ స ర్పంచ్ మానిపాటి శోభాకుమార్ ఉపసర్పంచ్ నూకంరాజు ముదిరాజ్ వార్డుసభ్యులు విద్యార్థుల కు విద్యాబోధన ఎలా చేస్తున్నారు అని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్న గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్ మధ్యాహ్నం భోజన కార్మికుల సమస్యలు తెలుసుకుని విద్యార్థులకు ఎలాంటి భోజనం పెడుతున్నారు అనిఅడిగి తెలుసుకున్నారు అనంతరం తెలంగాణపబ్లిక్ పాఠ శాల నిర్మాణాలను పరిశీలించారు సందర్భంగా గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్ ఉప సర్పంచ్ నూకం రాజుముదిరాజ్ మాట్లాడుతూ తె లంగాణ రాష్ట్రంలోని మొట్టమొదటి తెలంగా ణ పబ్లిక్ పాఠశాల నిర్మించడంచాలాసంతోషకరం అని అన్నారు ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి విద్యాబోధన అందించి ఆరుట్ల గ్రామ తెలంగాణ పబ్లిక్ పాఠశాలకు మంచి గుర్తింపు తేవా లి అన్నారు ఈకార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి చిలుకల వెంకటేష్ వార్డుసభ్యులు కొండిగారి శ్రావణ్ పున్నంరాము మాడుగుల బాలమని కృష్ణగౌడ్ మొగ్రిపద్మ ఐలయ్య మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్ లాలగారి మణెమ్మ తెలంగాణ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

## వర్షపు నీటి ముంపుపై ఎమ్మెల్యే గాంధీ ఆదేశాలు.. అధికారులతో స్థల పరిశీలన



**కూకట్ పల్లి, ఫిబ్రవరి 11 వెలుతురు :** ఆల్విన్ కాలనీ పరిధిలోని శంసిగూడా శిల్పబృందావనం వద్ద వర్షపు నీటి ముంపు సమస్యపై ఎమ్మెల్యే ఆరికపుడి గాంధీ ఆదేశాలతో అధికారులు స్థల పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జిల్లా గణేష్ నేత సమస్య తీవ్రతను అధికారులకు వివరించారు. శిల్పబృందావనం కల్వర్టు నిర్మాణ పనుల నేపథ్యంలో ఆశానగర్, నాగమ్మ కాలనీ, అయోధ్యనగర్ ప్రాంతాల్లో వర్షపు నీరు సరిగా వెళ్లక కాలనీలు ముంపుకు గురవుతున్నాయని స్థానికులు ఎమ్మెల్యే గాంధీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఆయన ఆదేశాల మేరకు డీఈ మోనిక, ఏఈ యుగేందర్ రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి తదితర అధికారులు సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా గణేష్ నేత మాట్లాడుతూ ఎమ్మెల్యే గాంధీ ఆదేశాలతో శిల్పబృందావనం కాంపౌండ్ వాల్ ఆనుకుని ఉన్న నాగమ్మ కాలనీ ప్రాంతంలో అధికారులతో కలిసి సమస్యను వివరిస్తూ స్థలాన్ని పరిశీలించాం. అధికారులు సానుకూలంగా స్పందించి, పనులను వేగవంతం చేసి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు” అని తెలిపారు. కాలనీవాసులు కూడా తమ ఇబ్బందులను అధికారులకు వివరించి, త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## 13న ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ లో వాహనాల వేలం

**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 11:** మలక్ పేట ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు వివిధ సంఘటనలో ప్రమేయం ఉండి స్వాధీన పర్చుకున్న, తిరిగి పొందని ఐదు ద్విచక్ర వాహనాలను శు క్రవారం బహిరంగ వేలం వేస్తున్నట్లు మలక్పేట ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎ. నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్ జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి అదేశాల మేరకు బహిరంగ వేలం కార్యక్రమాన్ని నల్గొండ చౌరస్తాలో సోయల్ హోటల్ ఎదురుగా ఉన్న మలక్పేట ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలంలో హోండా యాక్టివా స్కూటీ, మూడు స్కూటర్లు, ఒక సైకిల్ను వేలం వేస్తున్నట్లు తెలిపారు. బహిరంగ వేలంలో పాల్గొనే ఆసక్తి కలిగిన వారు మరిన్ని వివరాలకు 8712659641 ఫోన్ చేసి సంప్రదించ వచ్చునని ఆయన పేర్కొన్నారు.

# భవన నిర్మాణ కార్మిక సంఘం జాతీయ కమిటీ సభ్యుడిగా ఎన్నికైన గొరిగె సోములు.




**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 11:** భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయు అనుబంధం)జాతీయ కమిటీ సభ్యుడిగా రావన్నపేట పట్టణానికి చెందిన గొరిగె సోములు ఎన్నిక కావడం జరిగింది. రాజస్థాన్ రాష్ట్రం సికర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 7-9వరకు జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం అఖిల భారత మహాసభల్లో గొరిగే సోములును తెలంగాణ రాష్ట్రం నుండి ఎన్నుకోవడం జరిగింది. ప్రస్తుతం సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శిగా, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యత నిర్వహిస్తూ జిల్లా వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా సోములు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం అవలంబించే కార్మిక వ్యతిరేక విధానాలపై నిర్మాణరంగం కార్మికుల్ని ఏకం చేసి మరింత ముందుకు పోతానని నమ్మకంతో బాధ్యత అప్పగించిన జాతీయ కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పెండింగ్లో ఉన్న భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. జాతీయ కమిటీకి ఎన్నికైన గొరిగే సోములకు సిఐటియు మండల నాయకులు బొడ్డుపల్లి వెంకటేశం,నకిరేకంటి రాము,వంగాల మారయ్య, అప్పం సురేందర్, పల్లె సత్యం తదితరులు అభినందనలు తెలిపారు.

# ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ గా శ్వేత ప్రియాంక



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 11:** రామన్నపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ గా సివిల్ సర్జన్ ఎంబిబిఎస్, ఎమ్ ఎస్, ఓ బిజీ, ఉస్మానియా గోల్డ్ మెడలిస్ట్, డాక్టర్ శ్వేతా ప్రియాంక మంగళవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ,వైద్యులు వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. అందుబాటులో ఉన్న వైద్యులతో అన్ని రకాల వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రత్యేక శ్రద్ధతో గర్భిణీ స్త్రీలకు వైద్య పరీక్షలు నిర్వహించి ప్రస్తుతి సేవలను,మెరుగుపరుస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు, వైద్య సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాలతో సన్మానించారు.

# పట్టుదల ఫలితం - సిఎంఏ లో అర్వపల్లి అఖిల నాగ రమ్య ఘన విజయం



**ఖమ్మం, వెలుతురు ఫిబ్రవరి 11:** ఖమ్మం నగరానికి చెందిన అర్వపల్లి అఖిల నాగ రమ్య గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజ్‌లో సిఎంఏ (కాస్ట్ అండ్ మానేజ్మెంట్ అకౌంటెంట్) కోర్సును పూర్తి స్థాయిలో విజయవంతంగా ఉత్తీర్ణతతో సాధించారు. నిరంతర శ్రమ, క్రమశిక్షణతో కూడిన చదువు ఆమెను ఈ ఉన్నత విజయానికి చేర్చిందని ఉపాధ్యాయులు ప్రశంసించారు.అఖిల నాగ రమ్య 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మామిళ్ళ గూడెం లోని మాంటిస్సోరి హైస్కూల్ లో విద్యనభ్యసించి, టెన్త్‌లో 9.5 జి.పి.ఎ సాధించారు. సాహితి జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్‌లలో కాలేజ్ టాపర్‌గా నిలిచి తన ప్రతిభను చాటుకున్నారు.ఆమె తల్లిదండ్రులు అర్వపల్లి నాగేష్, శ్రీలక్ష్మి స్థానికంగా చిన్న కిరాణా వ్యాపారం నిర్వహిస్తూ కుమార్తె చదువుకు అన్ని విధాలుగా వారి సంపూర్ణ సహకారం అందించారు. చెల్లెలు యువ నాగశ్రీ విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, స్థానికులు, అలాగే ఆమె చిన్ననాటి స్నేహితురాలు షేక్ తబస్సుమ్ అఖిల నాగ రమ్యకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

# హెచ్ ఐవీ పై అవగాహనలో భాగస్వాములవుతాం



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) ఫిబ్రవరి 11**
కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో వై ఆర్ జీ కేర్ లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో మంగళవారం హెచ్ ఐవీపై అవగాహన , నివారణపై అడ్వకసీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో లింక్ వర్కర్ డీఆర్పీ సుధాకర్ మాట్లాడుతూ.. హెచ్ ఐ వీ, సుఖ వ్యాధులు , టీబీ నివారణ విషయంలో తమ సంస్థ తరపున అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఆయా వ్యాధులపై సందేహాల కోసం 1097 కు ఫోన్ చేయాలని తెలిపారు. గ్రామంలో ఆయా వ్యాధుల నివారణకై గోడ రాతలతో ప్రచారం చేయటానికి పాలకవర్గ సభ్యులు తమ విరాళంతో సహకరించాలని కోరారు. గ్రామ సర్పంచ్ భీమాయల లక్ష్మీ రాజు,ఉప సర్పంచ్ స్వప్న లక్ష్మీ నారాయణ, పంచాయతీ కార్యదర్శి రాజేందర్లు మాట్లాడుతూ ... గ్రామంలో హెచ్ఐవి నివారణలో తమ వంతు భాగస్వామ్యం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన మీన్లూ డా. నీరంజాన్ , లింక్ వర్కర్ స్కీం సూపర్వైజర్ జ్యోతి, లింక్ వర్కర్ వరలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖలో 19992004 మధ్య నియమితులైన

# విద్యుత్ ఉద్యోగులందరికీ పెన్షన్ కల్పించాలి

**- పెన్షన్ లేక జీవించడం కష్టసాధ్యం**

**- మీర్జా షకీల్ బేగ్, అధ్యక్షులు, తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్, భువనగిరి డివిజన్**



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 11:** తెలంగాణ రాష్ట్ర విద్యుత్ శాఖలో 1999 నుండి 2004 మధ్యకాలంలో ఉద్యోగం పొందిన విద్యుత్ ఉద్యోగులందరికీ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలులో ఉన్న విధంగా పెన్షన్ సౌకర్యం కల్పించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ భువనగిరి డివిజన్ అధ్యక్షులు మీర్జా షకీల్ బేగ్ రాష్ట్రప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. వీరిలో ముఖ్యంగా పెద్ద సంఖ్యలో విలేజ్ ఎలక్ట్రిసిటీ వర్కర్లు ఉన్నారని ఆయన తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ గుర్తింపు లేకుండానే 1520 సంవత్సరాల పాటు ప్రమాదకర పరిస్థితుల్లో విద్యుత్ పనులు నిర్వహిస్తూ, గుంటలు తవ్వుతూ, విద్యుత్ స్తంభాలు నాటుతూ, ప్రాణాలకు తెగించి మారుమూల పల్లెటూర్లకు వెలుగులు తీసుకువచ్చిన కార్మికులే ఈ విలేజ్ ఎలక్ట్రిసిటీ వర్కర్లు. ప్రజాసేవే లక్ష్యంగా తక్కువ వేతనంతో సంవత్సరాల పాటు పనిచేసిన వీరిని 2002 ప్రాంతంలో అధికారికంగా ఉద్యోగాల్లోకి తీసుకున్నారని ఆయన పేర్కొన్నారు. అయితే అప్పటికే చాలామంది 4045 ఏళ్ల వయస్సులో ఉద్యోగంలో చేరడం వల్ల తగిన సర్వీసు కాలం లేక పెన్షన్ హక్కు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మీర్జా షకీల్ బేగ్ మాట్లాడుతూ,"పెన్షన్ అనేది దయ కాదు, రాజ్యాంగ హక్కు,అని స్పష్టం చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21ల ప్రకారం మరియు సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం పెన్షన్ అనేది ఉద్యోగి చేసిన సేవలకు ఆలస్యంగా చెల్లించే వేతనం (డిఫరెడ్ వేజెస్ ) అని గుర్తుచేశారు. 1999 తరువాత విద్యుత్ శాఖలో పెన్షన్ విధానం రద్దు చేయడం, అదే పనులు చేసిన ఉద్యోగులను కేవలం తేదీ కారణంగా పెన్షన్ నుంచి దూరం చేయడం స్పష్టమైన వివక్షాత్మక విధానం అని ఆయన విమర్శించారు. రిటైర్మెంట్ అనంతర దయనీయ పరిస్థితి 2021 నుండి రిటైర్ అవుతున్న ఈ ఉద్యోగులకు నెలవారీ పెన్షన్ లేకపోవడం ఈపీఎఫ్ ద్వారా కేవలం సుమారు రూ.2000 మాత్రమే అందడం వైద్య భద్రత లేకపోవడం వృద్ధాప్యంలో ఆదుకునే ఆర్థిక భరోసా లేకపోవడం వల్ల జీవితాంతం ప్రజల కోసం పనిచేసిన ఉద్యోగులు రిటైర్మెంట్ అనంతరం రోజువారీ ఖర్చులు, మందులు, వైద్య చికిత్స, కుటుంబ అవసరాలు కూడా తీర్చుకోలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెన్షన్ లేకపోవడం వల్ల రిటైర్ అయిన ఉద్యోగులు తమ కుటుంబాలపై,ఆధారపడాల్సిన దుస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే సుమారు 400 మంది ఉద్యోగులు రిటైర్ కాగా, రాబోయే కాలంలో దాదాపు 2500 మంది ఉద్యోగులు రిటైర్ కావాల్సి ఉందని, వేలాది కుటుంబాల భవిష్యత్తు ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వానికి డిమాండ్లు రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృష్టితో స్పందించి:1999 నుండి 2004 వరకు నియమితులైన విద్యుత్ ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానం లేదా ప్రత్యేక పెన్షన్ స్కీమ్ అమలు చేయాలి. ఇప్పటికే రిటైర్ అయిన ఉద్యోగులకు కనీస సామాజిక భద్రత కల్పించాలి.రిటైర్డ్ ఉద్యోగులకు వైద్య సదుపాయాలు / ఆరోగ్య బీమా అందించాలి. గ్రామాలకు వెలుగులు నింపిన కార్మికుల జీవితాల్లో కూడా వెలుగులు నింపడం ప్రభుత్వ ధర్మం, సామాజిక న్యాయం, రాజ్యాంగ బాధ్యత అని మీర్జా షకీల్ బేగ్ స్పష్టం చేశారు.

# అధికారంలో ఎవరుంటే వారితో దోస్తీ




**హైదరాబాద్, ఫిబ్రవరి 11 ( న్యూస్ పల్స్)**
తెలంగాణ రాజకీయాల్లో మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ పార్టీది ఒక ప్రత్యేకమైన శైలి. ఇటీవల అక్బరుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. "రెడ్డి అయినా, రావు అయినా తమ దగ్గరకు రావాల్సిందే" అని ఆయన అన్నారు. అయితే, ఈ వ్యాఖ్యల వెనుక ఉన్న రాజకీయ చతురతను, గత కొన్ని దశాబ్దాల ఎంఐఎం ప్రస్థానాన్ని పరిశీలిస్తే, ఇది కేవలం ఒక పార్టీ ఆధిపత్యం మాత్రమే కాదు.., అధికార పార్టీలు, ఎంఐఎం మధ్య ఉన్న 'పరస్పర ప్రయోజనాల' బంధమని స్పష్టమవుతుంది.ఎంఐఎం పార్టీ పుట్టినప్పటి నుంచి అనుసరిస్తున్న ఏకైక సూత్రం "అధికారంలో ఎవరుంటే వారితో దోస్తీ" చేయడం. ఇది సిద్ధాంతాల కంటే ఎక్కువగా ప్రయోజనాల మీద ఆధారపడి ఉంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ హయాం నుంచి మొదలుకొని, నేటి తెలంగాణ వరకు ఈ ధోరణి కొనసాగుతూనే ఉంది.గతంలో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కొంత దూరం ఉన్నప్పటికీ, ఆ తర్వాత వచ్చిన చంద్రబాబు హయాంలోనూ, ఆపై వై.ఎస్. రాజశేఖర రెడ్డి హయాంలోనూ ఎంఐఎం అత్యంత కీలక పాత్ర పోషించింది. కిరణ్ కుమార్ రెడ్డి హయాంలో పాతబస్తీలో జరిగిన కొన్ని పరిణామాల వల్ల ఎంఐఎం కాంగ్రెస్‌కు దూరమైంది. కానీ, రాష్ట్ర విభజన తర్వాత బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే, కేసీఆర్‌తో ఫ్రెండ్లీ బంధాన్ని కొనసాగించింది. ఇప్పుడు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్‌తోనూ అదే తరహా అనుబంధాన్ని కొనసాగిస్తోంది.అక్బరుద్దీన్ ఓవైసీ అన్నట్లుగా పార్టీలే తమ దగ్గరకు వస్తాయా? లేక వీరే వెళ్తారా? అనేది ఒక నాణేనికి ఉన్న రెండు పార్శ్వాల వంటిది. కాంగ్రెస్ లేదా బీఆర్ఎస్ వంటి పార్టీలకు ముస్లిం ఓటు బ్యాంకు కీలకం. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 30-40 నియోజకవర్గాల్లో ముస్లిం ఓటర్లు గెలుపోటములను ప్రభావితం చేసే స్థాయిలో ఉన్నారు. ఎంఐఎంతో దోస్తీ చేయడం వల్ల మైనారిటీల్లో ఒక 'పాజిటివ్ మెసేజ్' వెళ్తుందని, తద్వారా ఆయా వర్గాల ఓట్లు తమకే పడతాయని అధికార పార్టీలు భావిస్తాయి. ఎంఐఎం బలం కేవలం పాతబస్తీలోని ఏడు అసెంబ్లీ స్థానాలకే పరిమితం. పాతబస్తీలో తమ పట్టును నిలుపుకోవాలన్నా, తమ నియోజకవర్గాలకు నిధులు కావాలన్నా, లేదా తమ మద్దతుదారుల వ్యాపార సామ్రాజ్యాలకు రక్షణ ఉండాలన్నా అధికారంలో ఉన్న పార్టీతో సత్సంబంధాలు ఎంఐఎంకు అత్యవసరం.జూబ్లీహిల్స్ బైపోల్ ప్రస్తావన తెస్తూ అక్బరుద్దీన్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ఆసక్తికరమైనవి. అయితే మంత్రి శ్రీధర్ బాబు కౌంటర్ ఇచ్చినట్లుగా, ప్రతి నియోజకవర్గంలోనూ సమీకరణాలు వేరుగా ఉంటాయి. జూబ్లీహిల్స్ వంటి చోట్ల ఎంఐఎంకు గణనీయమైన ఓట్లు ఉన్నప్పటికీ, గెలుపు అనేది అభ్యర్థి వ్యక్తిగత బలం, అధికార పార్టీ మేనిఫెస్టోపై కూడా ఆధారపడి ఉంటుంది. ఇక్కడ ఎంఐఎం మద్దతు 'అదనపు బలం' కావొచ్చు కానీ, అదే 'ఏకైక బలం' అని చెప్పలేం.నిజానికి ఎంఐఎం ఎప్పుడూ 'కింగ్ మేకర్' కావాలని కోరుకోదు. ఎందుకంటే కింగ్ మేకర్ కావాలంటే ప్రభుత్వాలు పడిపోయే స్థితిలో ఉండాలి. కానీ తెలంగాణలో మెజారిటీ ప్రభుత్వాలు ఉన్నా ఎంఐఎం వారితో స్నేహం చేస్తుంది. అంటే వారు 'కింగ్ తో ఉండే పార్టీ'గా ఉండటానికే ఇష్టపడతారు. దీనివల్ల ప్రభుత్వ నిర్ణయాల్లో తమ మాట చెల్లుబాటు అవుతుంది. పోలీస్ యంత్రాంగం, పరిపాలనలో పాతబస్తీపై తమ గుత్తాధిపత్యం కొనసాగుతుంది. విపక్షంలో ఉండి పోరాటాలు చేసే శ్రమ తప్పుతుంది.అక్బరుద్దీన్ చేసిన వ్యాఖ్యలు తమ కార్యకర్తల్లో ఉత్సాహం నింపడానికి, తమ ప్రాధాన్యతను తగ్గకుండా చూసుకోవడానికి చేసిన 'మైండ్ గేమ్'గా విశ్లేషకులు భావిస్తున్నారు. రెడ్డి అయినా, రావు అయినా చివరకు రాజకీయ ప్రయోజనాల కోసం ఒకరిపై ఒకరు ఆధారపడక తప్పని పరిస్థితి తెలంగాణలో ఉంది. ఎంఐఎంకు అధికారం కావాలి, అధికార పార్టీకి ముస్లిం ఓట్లు కావాలి. ఈ సమీకరణం ఉన్నంత కాలం "ఎవరు ఎవరి దగ్గరకు వెళ్లారు" అనే చర్చ కంటే, "ఎవరు ఎవరిని ఎంత ఉపయోగించుకున్నారు" అనేదే అసలైన రాజకీయం. అక్బరుద్దీన్ వ్యాఖ్యలు కేవలం పైన కనిపించే కోణం మాత్రమే.. లోపల ఉన్నది మాత్రం పక్కా రాజకీయ అవసరాల బంధం.

# మున్సిపల్ ఎన్నికల్లో స్వల్ప ఉద్రిక్తతలు

**- పలుచోట్ల పరస్పర ఘర్షణలు**

**- దొంగ ఓట్ల ఆరోపణలతో పోలీసుల జోక్యం**




**హైదరాబాద్, ఫిబ్రవరి11( వెలుతురు):**
తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ బుధవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైంది. సాయంత్రం 5 గంటల వరకు జరగనుంది. పోలింగ్ కొనసాగుతున్న వేళ పలు జిల్లాల్లో స్వల్ప ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. మహబూబాబాద్, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కార్యకర్తల మధ్య ఘర్షణలు, నినాదాలు, దొంగ ఓట్ల యత్నాలు వంటి ఘటనలు వెలుగుచూశాయి. పోలీసులు వేగంగా స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. మహబూబాబాద్ పట్టణంలోని 32, 33 పోలింగ్ బూత్‌ల వద్ద స్వల్ప ఘర్షణలు జరిగాయి. 14వ వార్డులో పోటీలో ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఇరువర్గాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ఘర్షణకు దిగాయి. కాంగ్రెస్ కార్యకర్తలపై బీఆర్ఎస్ కార్యకర్తలు దాడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనతో పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్తత పెరిగింది. సమాచారం అందుకున్న వెంటనే భారీగా పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చేందుకు 14వ వార్డులో భారీగా పోలీసులను మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోందని అధికారులు తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో బుధవారం ఉదయం 9 గంటల వరకు 14 శాతం పోలింగ్ నమోదైంది. నగరంలోని కోటగల్లీ 25వ డివిజన్‌లో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీజేపీ, కాంగ్రెస్ నేతలు పరస్పరం నినాదాలు చేసుకోవడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితిని గమనించిన పోలీసులు.. వెంటనే అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. పెద్ద ఘటనలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించారు. బోధన్ పట్టణంలో ఎంఐఎం, బీఆర్ఎస్ కార్యకర్తలు పరస్పరం నినాదాలు చేస్తూ ఉద్రిక్త వాతావరణం సృష్టించారు. పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. నిజామాబాద్ జిల్లాలోని రాకాసిపేట్ పోలింగ్ కేంద్రంలో ఇద్దరు వ్యక్తులు దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నించిన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండటంతో వారిని అడ్డుకుని కేసు నమోదు చేశారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీలోని 15వ వార్డులోనూ స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలింగ్ కేంద్రానికి వెళ్తున్న ఓటర్లను ప్రలోభ పెడుతున్నారంటూ బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది.బీజేపీ, బీఆర్ఎస్ ఇరువర్గాల మధ్య బాహాబాహీ చోటుచేసు కోవడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని అధికారులు తెలిపారు.సంగారెడ్డి జిల్లాలోని 28వ వార్డు పోలింగ్ కేంద్రంలో ఓ వ్యక్తి దొంగ ఓటు వేయడానికి ప్రయత్నించాడు. అప్పటికే మరో పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన సదరు వ్యక్తి.. 28వ వార్డులో మరోసారి ఓటు వేసేందుకు వచ్చినట్లు గుర్తించారు. అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పోలింగ్ అధికారులు వెంటనే చర్యలు తీసుకున్నారు. ఆ వ్యక్తి చేతి వేలికి సిరా గుర్తువేసి పోలింగ్ కేంద్రం నుంచి పంపించారు. చట్టపరంగా ఆ వ్యక్తిపై తదుపరి చర్యలు తీసుకుంటామని ఎన్నికల అధికారులు తెలిపారు.

## వికారాబాద్ లో భద్రత కట్టుదిట్టం

**వికారాబాద్ (వెలుతురు) ఫిబ్రవరి 11**
వికారాబాద్ మునిసిపల్ పరిధిలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పట్టణ సీఐ రఘుకుమార్ తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ రఘుకుమార్ మాట్లాడుతూ ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలని కోరారు. ఎక్కడైనా చిన్న సమస్య తలెత్తినా వెంటనే 100కు డయల్ చేయాలని లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకుని మంచి వ్యక్తికి ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. వికారాబాద్ మునిసిపల్ పరిధిలో కొన్ని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్న నేపథ్యంలో అక్కడ పారామిలిటరీ దళాలను మోహరించామని తెలిపారు. ఎక్కడా చిన్న సమస్య కూడా తలెత్తకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈ ఎన్నికల సందర్భంగా దాదాపు 200 మంది పోలీసు సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారని సీఐ రఘుకుమార్ వెల్లడించారు.

# జనరల్ వార్తలు

## మున్సిపోల్స్‌లో రేవంత్ రెడ్డి అధికార దుర్వినియోగం

**● ఎక్స్ వేదికగా కెటిఆర్ తీవ్ర ఆరోపణలు**



**హైదరాబాద్,ఫిబ్రవరి11 వెలుతురు:** మున్సిపల్ ఎన్నికల వేళ అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. ఈ క్రమంలో గులాబీ పార్టీ శ్రేణులను ఉద్దేశిస్తూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామరావు ఆసక్తికర ట్వీట్ చేశారు. అలానే అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ రేవంత్ రెడ్డి పై కేటీఆర్ ఫైర్ అయ్యారు.మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్ని అరాచకాలు చేసినా వీరోచితంగా పోరాడిన గులాబీ సైనికులందరికీ పేరుపేరునా హృదయపూర్వక అభినందనలు. ఆదిలాబాద్ నుంచి ఆలంపూర్ వరకూ పురపాలక సమరంలో మీరు కనబరిచిన పోరాట స్ఫూర్తి బీఆర్ఎస్‌కు కొండంత బలాన్నిచ్చింది. పార్టీలో ఆకాశమంత ఆత్మవిశ్వాసాన్ని నింపింది. రెండేళ్ల పాలనలో ఘోరమైన పరిపాలనా వైఫల్యాలను మూటగట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్.. ఓటమి భయంతోనే ఈ ఎన్నికల్లో ఇంతటి దౌర్జన్య కాండకు దిగారు. కాంగ్రెస్ పార్టీకి పంచాయతీ ఎన్నికల్లో మొదలైన పరాభవం, పట్టణాల్లోనూ తప్పదనే ఆందోళనతోనే అడుగడుగునా రేవంత్ రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు' అని కేటీఆర్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అక్రమంగా లూటీ చేసిన వేలకోట్ల ప్రజాధనంతో ప్రజాతీర్పునే మార్చాలన్న ఈ కుట్రలను తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. పోలీసు శాఖను అడ్డంపెట్టుకుని బీఆర్ఎస్ శ్రేణులపై సాగించిన వేధింపుల పర్వానికి, దాడులకు రేవంత్ రెడ్డి భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ప్రజలకిచ్చిన హామీలను, మొత్తంగా పరిపాలనను గాలికి వదిలేసి రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టిన పాపం రేవంత్ రెడ్డిని ప్రతినిత్యం వెంటాడుతూనే ఉంటుంది' అంటూ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## మూడు కార్పోరేషన్లుగా హైదరాబాద్

**- జలమండలి పరిధి విస్తరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు**

**- జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్**



**హైదరాబాద్,ఫిబ్రవరి11 వెలుతురు:** జలమండలి పరిధిని విస్తరిస్తూ తెలంగాణ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సీఎంసీ), మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసీ)గా విభజించింది. ఈ క్రమంలోనే మూడు కార్పొరేషన్లకు కమిషనర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్ కొనసాగుతుండగా.. సైబరాబాద్‌కు శ్రీజన, మల్కాజ్‌గిరి వినయ్ కృష్ణారెడ్డిలను రాష్ట్ర సర్కార్ నియమించింది. కాగా.. ఓఆర్ఆర్ పరిధిలో నీటి సరఫరా, సివరేజ్ నిర్వహణను జీహెచ్ఎంసీ నుంచి జలమండలికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నీటి సరఫరా, మురుగు వ్యవస్థలతో పాటు సంబంధిత మౌలిక వసతుల అభివృద్ధిని కూడా జలమండలి చేపట్టనుంది. నీటి సరఫరా, మురుగు వ్యవస్థలతో పాటు సంబంధిత మౌలిక వసతుల అభివృద్ధి కూడా చేపట్టనుంది. మల్కాజ్‌గిరి జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎస్.పంకజ, హైదరాబాద్ ఈడీగా సామ్రాట్ అశోక్, సైబరాబాద్ ఈడీగా ఎం.సంతోష్, లోక్‌భవన్ జాయింట్ సెక్రటరీగా కె.శశి కిరణాచారిలను రాష్ట్ర సర్కార్ నియమించింది. అలాగే.. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ జోన్‌లతో కలిపి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసింది. ఎల్‌బీ నగర్, ఉప్పల్, మల్కాజిగిరి జోన్ ప్రాంతాలతో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయగా.. సికింద్రాబాద్, ఖైరతాబాద్, గోల్కొండ, చార్మినార్, రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్‌లతో జీహెచ్ఎంసీని విభజించింది. ప్రస్తుతం 1450 చదరపు కిలోమీటర్ల మేర మంచినీటి సరఫరాతో పాటు 650 చ.కి.మీ.ల మేర సివరేజ్ నిర్వహణ చేస్తున్న జలమండలి.. ఇక నుంచి 2,053 చ.కి.మీ. మేర మంచినీటి సరఫరాతో పాటూ సివరేజ్ నిర్వహణ చూడనుంది. కొత్తగా అవసరమైన ప్రాంతాల్లో సీవరేజ్ ట్రీట్మెంట్ ఎ÷-లాంట్లు నిర్మించేందుకు జలమండలి చర్యలు తీసుకోనుంది. జీహెచ్ఎంసీని మొత్తం 6 జోన్లు, 30 సర్కిళ్లు, 150 వార్డులుగా ప్రభుత్వం విభజించింది. శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, సికింద్రాబాద్‌లను జోన్లుగా నిర్ణయించింది. ఆయా జోన్ల పరిధిలో సర్కిళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. శంషాబాద్ జోన్: ఆదిభట్ల, బడంగ్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్. చార్మినార్ జోన్: సంతోష్ నగర్, యాకత్‌పురా, మలక్‌పేట, చార్మినార్, మూసారాంబాగ్. ఖైరతాబాద్ జోన్: ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, బోరబండ, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట. రాజేంద్రనగర్ జోన్: రాజేంద్రనగర్, అత్తాపూర్, బహదూర్‌పుర, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట, జంగమ్మెట్, గోల్కొండ జోన్: గోషామహల్, కార్వాన్, గోల్కొండ, మెహిదీపట్నం, మాసాబ్ ట్యాంక్. సికింద్రాబాద్ జోన్: కవాడిగూడ, ముషీరాబాద్, అంబర్‌పేట్, తార్నాక, మెట్టుగూడ

## ముగిసిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్

**- సాయంత్రం క్యూలో ఉన్న వారికి ఓటింగ్ అవకాశం,**

**- చెదురుమొదురు ఘటనలు మినహా ప్రశాంతం**




**హైదరాబాద్, ఫిబ్రవరి11 వెలుతురు:** చెదురుమొదురు ఘటనలు మినహా తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ముగిసింది. సాయంత్రం 5 గంటల లోపు క్యూలో నిలుచున్న వారికి మాత్రమే అధికారులు ఓటు వేసే అవకాశం ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు పోలింగ్ పూర్తయింది. రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడా చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈ నెల 13న ఓట్లు లెక్కింపు ఉంటుందని, 16న కార్పొరేషన్ల మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపాలిటీల చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుందని అధికారులు తెలిపారు. తుది ఓటింగ్ శాతం రాత్రికి వెల్లడి కానుంది. ఎన్నికల బరిలో ఉన్నవారి అదృష్టం ఈనెల 13న తేలబోతుంది. ఈ నెల 13న ఉదయం 8 గంటలకు 136 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. 16న కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక ఉంటుంది.:ఉదయం 7 గంటలకే ప్రారంభమైన ఓటింగ్ పక్రియ, సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. అక్కడక్కడా స్వల్ప ఉద్రిక్తతలు మినహా రాష్ట్రవ్యాప్తంగా ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే సాయంత్రం 5 గంటల సమయానికి క్యూలైన్లలో వేచి ఉన్న ఓటర్లందరికీ అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. రద్దీ ఎక్కువగా ఉన్న చోట టోకెన్లు జారీ చేసి ఓటింగ్ నిర్వహిస్తున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను సీల్ చేస్తారు. పోలీసుల భారీ భద్రత నడుమ వీటిని నిర్దేశించిన స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. మధ్యాహ్నం 3 గంటల సమయానికే దాదాపు 62శాతం పైగా పోలింగ్ నమోదైంది. మున్సిపాలిటీల్లో ఓటింగ్ శాతం కార్పొరేషన్ల కంటే మెరుగ్గా ఉన్నట్లు ప్రాథమిక గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఎన్నికలను ప్రధాన పార్టీలన్నీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి.

## రాహుల్ ఆరోపణలను తిప్పికొట్టిన కేంద్రమంత్రి

**- రాహుల్‌వి బాధ్యతారహిత ఆరోపణలన్న హర్దీప్ పురి**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి11( వెలుతురు):** కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన 'ఎప్‌స్టీన్' ఆరోపణలను కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ పురీ తీవ్రంగా ఖండించారు. ఇంటర్నేషనల్ పీస్ ఇనిస్టిట్యూట్ బృందంలో భాగంగా తాను ఎప్‌స్టీన్‌ను కలిశానని చెప్పారు. ఐపీఐలో మా బాస్‌కు ఎప్‌స్టీన్ తెలుసు. కొన్ని సందర్భాల్లో మాత్రమే సమావేశమయ్యాను. కచ్చితంగా చెప్పాలంటే మూడునాలుగు సార్లు. ఒక్కసారి మాత్రమే ఈమెయిల్ చేసుకున్నాం. అతడిపై వచ్చిన ఆరోపణలకు మా మధ్య జరిగిన సంభాషణకు ఎలాంటి సంబంధం లేదని వెల్లడించారు. ఇదంతా అసత్య ప్రచారమంటూ రాహుల్ వ్యాఖ్యలపై మండిపడ్డారు. అప్పుడు అదానీ, అనిల్ అంబానీ, హర్దీప్ సింగ్ పేర్లను ప్రస్తావించారు. ఈ రోజు విపక్షనేత పార్లమెంట్‌లో కొన్ని విషయాలు మాట్లాడారు. ఆయనకు నిరాధార ఆరోపణలు చేయడం అలవాటు. మన రాజకీయ వ్యవస్థలో రెండురకాల నేతలు ఉంటారు. బాధ్యతాయుతం గా వ్యవహరిస్తూ.. సామాజిక సేవకే జీవితాన్ని అంకితం చేస్తుంటారు. మరికొందరు అప్పుడప్పుడు దేశానికి వస్తారు. వారికి పార్లమెంట్‌లో తగిన సమాధానం ఇచ్చినప్పుడు వినకుండా సభ నుంచి వాకౌట్ చేస్తుంటారని రాహుల్ తీరును విమర్శించారు. అమెరికా ప్రభుత్వం ఇటీవల 30 లక్షల 'ఎప్‌స్టీన్' పేజీలను బయటపెట్టింది. వీటితోపాటు 2,000 వీడియోలు, 1,80,000 ఫొటోలనూ విడుదల చేసింది. ప్రజాసంఘాలు, రాజకీయంగా వచ్చిన ఒత్తిడి కారణంగా రూపొందించిన ఎప్‌స్టీన్ ఫల్స్ ట్రాన్స్‌పరెన్సీ యాక్ట్ కింద వీటిని విడుదల చేసింది. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖులతో సంబంధాలు నెరిపిన ఎప్‌స్టీన్ 2019లో న్యూయార్క్ జైల్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మైనర్ బాలికలను అక్రమరవాణా చేశాడన్న ఆరోపణలపై విచారణ ఎదుర్కొన్నాడు. అతడి మాజీ గర్ల్‌ఫ్రెండ్ గిస్లైన్ మ్యాక్స్‌వెల్‌కు 2021లో 20 ఏళ్ల జైలు శిక్షపడింది.

## సైబరాబాద్‌లో ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికలు

**- ఎన్నికల తీరును పరిశీలించిన కమిషనర్ రమేశ్**




**హైదరాబాద్,ఫిబ్రవరి11( వెలుతురు):** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిశాయి. మున్సిపల్ ఎన్నికలు నేపథ్యంలో బందోబస్తు, తీరును సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. సీపీ ముందుగా కుత్బుల్లాపూర్ జోన్ లోని మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధి లోని ఎల్లంపేట మున్సిపాలిటీలోని రావెల్ కోల్ జెడ్పీహెచ్ స్కూల్, ఎల్లంపేట జెడ్పీహెచ్ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రాల్లో పర్యటించారు. అనంతరం జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధి లోని అలియాబాద్ మున్సిపాలిటీలో ఉన్న లాల్ గడి మలక్ పేట్ జెడ్పీహెచ్ స్కూల్, అలియాబాద్ ఎంపీపీఎస్ పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. అదేవిధంగా శేరిలింగంపల్లి జోన్ లోని పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఇంద్రేశం, ఇస్నాపూర్ మున్సిపాలిటీల లోని ఇంద్రేశం ఎంపీయుపీ స్కూల్, ఇస్నాపూర్ జెడ్పీహెచ్ స్కూల్, చిట్కూల్ ఎంపీపీ స్కూల్ లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో మాట్లాడి, భద్రతా పరంగా ఎలాంటి లోపాలు తలెత్తకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఎన్నికలు పూర్తిగా ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. ప్రజలు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అలాగే విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని తెలిపారు. సైబరాబాద్ సీపీ వెంట డాక్టర్ ఎం. రమేష్, ఐపీఎస్., శేరిలింగంపల్లి డిసిపి సీ.హెచ్. శ్రీనివాస్, ఐపీఎస్., కుత్బుల్లాపూర్ ఇన్ ఛార్జ్ డిసిపి సాయి మనోహర్, ఎస్బీ డిసిపి సుధీంద్ర, క్రైమ్స్ డిసిపి ముత్యం రెడ్డి, డబ్ల్యు అండ్ ఎస్ డబ్ల్యూ డిసిపి సృజన కరణం, పీడీ సెల్ ఏడీసీపీ సత్యనారాయణ, కుత్బుల్లాపూర్ ఏడీసీపీ పురుషోత్తం, శేరిలింగంపల్లి ఏడీసీపీ ఉదయ్ రెడ్డి, కుత్బుల్లాపూర్ ఏసీపీ బాల గంగి రెడ్డి, మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్ కుమార్, మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## 24 అజెండా అంశాలకు కేబినేట్ ఆమోదం

**- నీటి పారుదలశాఖలో 7,189 నిర్వహణ పనులకు అనుమతి**

**- గాజువాక పరిధిలో వెయ్యి చదరపు గజాల వరకూ క్రమబద్ధీకరణ**



**అమరావతి,ఫిబ్రవరి11( వెలుతురు):** ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గం సమావేశమై.. 24 అజెండా అంశాలపై చర్చించి ఆమోదం తెలిపింది. నీటి పారుదలశాఖలో 7,189 నిర్వహణ పనులకు పరిపాలనా ఆమోదం లభించింది. భూముల బదిలీకి సంబంధించి చట్ట సవరణ ముసాయిదా బిల్లుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. గాజువాక రెవెన్యూ గ్రామ పరిధిలో వెయ్యి చదరపు గజాల వరకూ క్రమబద్ధీకరణ దరఖాస్తుల గడువును మరో ఆరు నెలలు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పరచుకున్న ఆక్రమణల క్రమబద్ధీకరణ దరఖాస్తుల గడువును 30-06-2026 వరకు పొడిగించేందుకు క్యాబినెట్ ఆమోదించింది. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కీసరపల్లి గ్రామంలోని సర్వే నం.29/8లోని 3.84 ఎకరాల భూమిని కస్టమ్స్ (ప్రివెంటివ్) కమిషనరేట్ కార్యాలయం, నివాస గృహాల నిర్మాణం' కోసం ఉపయోగించేందుకు అనుగుణంగా గతంలో ఇచ్చిన జీవోలో మార్పు చేస్తూ కేబినేట్ నిర్ణయం తీసుకుంది. ఏలూరు జిల్లా అగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామంలో 45.60 ఎకరాల ప్రభుత్వ భూమిని కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ స్థాపన కోసం కేటాయించే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. నంద్యాల జిల్లాలో 1500 ఎకరాల భూమిని 250 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్ట్ కోసం కేటాయించనున్నారు. ఎకరాకు ఏటా రూ.31,000 లీజ్ చెల్లించే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదించింది. ఆంధ్ర ప్రదేశ్ ఏఐ లివింగ్ ల్యాబ్స్ ప్రారంభానికి, తిరుపతిలో డిజాస్టర్ రికవరీ సెంటర్ ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఇకపోతే అసెంబ్లీకి సంబంధించిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పాలనలో క్రమశిక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం, రాష్ట్ర అభివృద్ధిపై సీఎం స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. కేబినెట్ భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులు, అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మంత్రుల పనితీరు, ప్రవర్తనపై ఆయన స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. మంత్రులందరూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తప్పనిసరిగా అసెంబ్లీలో ఉండాలని, మధ్యాహ్నం 2 గంటల తర్వాత తమ పేషీల్లో ఉండి ఎమ్మెల్యేల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అసెంబ్లీలో 'ఆవు కథలు' చెప్పవద్దని, సమాధానాలు క్లుప్తంగా, అర్థమయ్యేలా ఉండాలని మంత్రులకు చెప్పారు. మాట్లాడే ప్రతి మాట బాధ్యతగా ఉండాలని హెచ్చరించారు.

## థాయి స్కూల్‌లో నరమేధం

**- దుండగుడి కాల్పుల్లో 34మంది హతం**

**- మృతుల్లో 22మంది చిన్నారులు**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి11( వెలుతురు):** దక్షిణ థాయిలాండ్ లో ఘోరం జరిగింది. బుధవారం మధ్యాహ్నం సోంగ్ఖా హ్యాట్ హెయ్ జిల్లాలోని ఓ పాఠశాలలో ఓ సాయుధుడు కాల్పులకు తెగబడ్డాడు. నిందితుడు జరిపిన కాల్పుల్లో 22మంది చిన్నారులు సహా 34మంది మరణించారు. చాలా మందిని అతను బందీలుగా చేసుకున్నాడు. పాఠశాలలో కాల్పుల మోత వినపడగానే రోడ్డుపై జనాలు ఒక్కసారిగా పరుగులు పెట్టారు. దీనికి సంబంధించిన ఓ వీడియో ఇంటర్నెట్ లో వైరల్ అవుతోంది. సంఘటన గురించి సమాచారం అందిన వెంటనే స్థానిక పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అనేక మంది ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల లోపల చిక్కుకున్నారని పోలీసులు తెలిపారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు హాట్ యాయ్ పోలీసులు పాఠశాలను చుట్టుముట్టారు. సాయుధుడితో చర్చలు జరిపేందుకు ప్రయత్నిస్తున్నారు. కాల్పులు జరిపిన వ్యక్తికి 18 ఏళ్ల వయసు ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. పాఠశాల లోపల ఉన్న బందీలను సురక్షితంగా విడిపించేందుకు భద్రతా దళాలు ప్రస్తుతం ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. అయితే తరవాత అతను ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం.

## గ్రేటర్ హైదరాబాద్ విభజన సరైనదే

**- స్వాగతించిన ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్**



**హైదరాబాద్, ఫిబ్రవరి11( వెలుతురు):** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ని తెలంగాణ ప్రభుత్వం మూడు వేర్వేరు కార్పొరేషన్లుగా విభజించింది. హైదరాబాద్‌ను మూడు డివిజన్లుగా మారుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. 'గ్రేటర్ హైదరాబాద్ ను మూడు కార్పొరేషన్లుగా విభజించడం ద్వారా నగరానికి మంచి జరగబోతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా.. ఇది ఆయన సొంతంగా తీసుకున్న నిర్ణయం కాదు. పబ్లిక్ డొమైన్‌లో పెట్టి, విపక్షాల అభిప్రాయం తీసుకున్న తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. తెలంగాణ సర్కార్ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ప్రాంతీయ కార్యాలయంలో నేరుగా సమస్యలు పరిష్కారం అవుతాయి. బీఆర్ఎస్ రాజకీయం కోసం మాట్లాడుతున్నారు. వాళ్లు అధికారంలో ఉన్న రోజుల్లో ఏమీ పట్టించుకోలేదు. రాజకీయాల కోసం ప్రతిపక్షాల విమర్శలు పట్టించుకోవాల్సిన అవసరం లేదు. వేగవంతమైన అభివృద్ధికి ఈ నిర్ణయం గొప్ప ఊతమిస్తుంది. సీఎం తీసుకున్న ఈ నిర్ణయం చరిత్రాత్మక నిర్ణయం.. దీన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నా' అని అన్నారు.

## కొంచెం సేపు ఆగిపోయిన పోలింగ్

**మహబూబ్ నగర్ ఫిబ్రవరి11( వెలుతురు):** మహబూబ్‌నగర్ 45వ డివిజన్ 5వ బూత్‌లో దాదాపు 20 నిమిషాల పాటు పోలింగ్ నిలిచిపోయింది. బ్యాలెట్ పేపర్‌పై అభ్యర్థులకు కేటాయించిన గుర్తులు తారుమారు అవడంతో పోలింగ్ నిలిచిపోయింది... అభ్యర్థులు పోలింగ్ కేంద్రం వద్ద ఆందోళనకు దిగారు. అధికారులు రంగంలోకి దిగి అభ్యర్థులతో చర్చించి, సమన్వయంతో ఓటింగ్ ప్రక్రియను పునఃప్రారంభించారు.

## ఎలాంటి పొరపాట్లు, లోపాలు లేకుండా ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ

**రంగారెడ్డి జిల్లా ఫిబ్రవరి11 వెలుతురు:** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా జరుగుతోందని, ఎలాంటి పొరపాట్లు, లోపాలు లేకుండా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు.మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం, జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, రంగారెడ్డి జిల్లాలోని 6 మునిసిపాలిటీలలో ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా, చేవెళ్ల మండలంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ నిర్వహణ మరియు ఏర్పాట్లను పరిశీలించిన తర్వాత, సిబ్బందికి తగిన సూచనలు చేశారు. పోలింగ్ కేంద్ర ప్రాంగణంలో పోటీ చేస్తున్న వార్డు సభ్యుల జాబితాను ఆయన పరిశీలించారు. సంబంధిత రిటర్నింగ్ అధికారులను ఎప్పటికప్పుడు నిర్ణీత ఫార్మాట్‌లో సంబంధిత పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ శాతాన్ని నమోదు చేయాలని ఆయన ఆదేశించారు. ఓటరు జాబితాలోని ఓటర్ల క్రమ సంఖ్యను తనిఖీ చేయడం ద్వారా ఓటింగ్ ప్రక్రియను నిర్వహించాలని



ఆయన ప్రిసైడింగ్ అధికారులను ఆదేశించారు. ఎలాంటి చిన్న తప్పులు లేకుండా పోలింగ్ ప్రక్రియ సజావుగా జరగాలని ఆయన కోరారు. సాయంత్రం 5 గంటల ముందు పోలింగ్ కేంద్ర ప్రాంగణంలో ఓటు వేయడానికి క్యూలో ఉన్న వారందరికీ తమ ఓట్లను సద్వినియోగం చేసుకునే అవకాశం కల్పించాలని ఆయన కోరారు. పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఎన్నికల అధికారులను సాయంత్రం 5 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ పోలింగ్ స్టేషన్ గేటు లోపలికి ఎవరినీ అనుమతించకుండా, ఎటువంటి అక్రమాలకు పాల్పడకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.



## వైకాపా కుట్రలపై అప్రమత్తంగా ఉండాలి

**- మతాన్ని రాజకీయంగా వాడుకోవాలనే ఎత్తుగడ**

**- కూటమి నేతలకు పవన్ కళ్యాణ్ హెచ్చరిక**



**అమరావతి,ఫిబ్రవరి11 వెలుతురు:** వైకాపా కుట్రల పట్ల తెదేపా, జనసేన, భాజపా సభ్యులు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. అసెంబ్లీ వాయిదా పడిన అనంతరం కమిటీ హాల్‌లో సీఎం చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశం అయ్యింది. అసెంబ్లీ కమ్యూనిటీ హాల్లో జరిగిన ఈ సమావేశానికి మూడు పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడారు. వైకాపా విధ్వంస కుట్రలను ఈ సందర్భంగా పవన్ లేవనెత్తారు. మతాన్ని రాజకీయంగా వాడుకోవాలని వైకాపా చూస్తోందన్నారు. సభలో ఎంతసేపు మాట్లాడామనే దానికంటే.. కంటెంట్ ఎంత మాట్లాడామనేదే ముఖ్యమని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. దావోస్‌లో సీఎం, తాను కలిసే ప్రతి సంస్థపై ముందస్తుగా కసరత్తు చేశామని చెప్పారు. 7 నిమిషాల్లో ప్రతి అంశాన్ని సీఎం వివరించి సమావేశాలను ముగించేవారన్నారు. తక్కువ సమయంలో ఎక్కువమంది పారిశ్రామికవేత్తలను సీఎం కలవగలిగారని చెప్పారు. ఆయన స్ఫూర్తితో సభ్యులు కూడా సభలో ఎక్కువ విషయం చెప్పగలగాలన్నారు. వైసీపీ.. హిందూ మతాన్ని రాజకీయంగా వాడుకోవాలని చూస్తోందని పవన్ కల్యాణ్ ఆరోపించారు. దక్షిణ భారతదేశంలో ప్రతి ఒక్కరూ మతాన్ని గౌరవిస్తారని తెలిపారు. అవైసీపీ నేతలు చేసే విధ్వంస కుట్రలను సమావేశంలో డిప్యూటీ సీఎం లేవనెత్తారు. మన ప్రభుత్వంపై జగన్ అండ్ కో చేసే కుట్రలపై మూడు పార్టీల సభ్యులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని పవన్ దిశానిర్దేశం చేశారు. ఏపీ అసెంబ్లీలో సభ్యులు ఎంతసేపు మాట్లాడామనే దానికంటే ఏం మాట్లాడమనేది ముఖ్యమని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. దావోస్ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు పలువురు పారిశ్రామికవేత్తలను కలిశారని ప్రస్తావించారు. ఆయన కలిసే ప్రతీ సంస్థ గురించి ముందస్తు సమాచారం సేకరించి ముఖ్యమైన అంశాల గురించి మాట్లాడేవారని గుర్తుచేశారు. దావోస్ పర్యటనలో పలువురు పారిశ్రామిక వేత్తలతో జరిగిన భేటీలో ఆ సంస్థకు మన ప్రభుత్వ పరంగా కావాల్సినవి ఏమిటి? మనకు ఉన్న వనరులేమిటనే విషయంపై సూటిగా చెప్పి.. ప్రతి సమావేశాన్ని నిమిషాల వ్యవధిలో చంద్రబాబు ముగించారని ప్రస్తావించారు. దీంతో తక్కువ సమయంలో ఎక్కువమంది పారిశ్రామిక వేత్తలను కలిసేందుకు వీలైందని చెప్పుకొచ్చారు. అసెంబ్లీలో సభ్యులు కూడా ముఖ్యమంత్రి స్ఫూర్తితో.. తక్కువ సమయంలో కీలక అంశాల గురించి ప్రస్తావించాలని మంత్రి పయ్యావుల కేశవ్ మార్గనిర్దేశర చేశారు.

## ఎమ్మెల్యే భార్య స్టోర్‌లో చోరీ

**- స్టోర్ ఉద్యోగి పనే అని గుర్తించిన పోలీసులు**



**హైదరాబాద్,ఫిబ్రవరి11( వెలుతురు):** నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి సతీమణి అనుశ్రీ రెడ్డి నిర్వహిస్తున్న డిజైనర్ స్టోర్‌లో జరిగిన చోరీ కేసును బంజారాహిల్స్ పోలీసులు ఛేదించారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లోని ఎన్‌బీటీ నగర్‌లో ఓ డిజైనర్ స్టోర్‌ను అనుశ్రీ రెడ్డి నిర్వహిస్తున్నారు. ఈనెల 6న ఆ స్టోర్‌లో ఓ చోరీ జరిగింది. ఈ స్టోర్‌లో హౌస్‌కీపింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న అమినుల్ హక్(38) ఈ చోరీకి పాల్పడ్డాడని పోలీసులు గుర్తించారు. అస్సాంకు చెందిన ఈ నిందితుడు కొన్ని నెలలుగా స్టోర్‌లో నమ్మకంగా పనిచేస్తున్నాడు. ఈ నెల 6న రాత్రివేళ పక్కా ప్రణాళికతో స్టోర్‌లోకి ప్రవేశించిన నిందితుడు.. సీసీటీవీ కెమెరాలకు చిక్కకుండా కిటికీ గుండా లోపలికి వెళ్లాడు. అక్కడ స్క్రూడ్రైవర్ సాయంతో లాకర్ తెరిచి రూ.2.43 లక్షల నగదును చోరీ చేశాడు. దోచుకెళ్లిన ఆ సొమ్మును తన ఇంట్లోని డస్ట్‌బిన్‌లో దాచాడు. మరుసటి రోజుఉదయాన్నే డ్యూటీకి వచ్చిన అమినుల్ హక్.. స్టోర్‌లో దొంగలు పడ్డారంటూ హడావుడి చేశాడు. సీసీటీవీ కెమెరాల్లో స్పష్టమైన ఆధారాలు లేకపోవడంతో పోలీసులు, క్లూస్ టీమ్ రంగంలోకి దిగింది. కిటికీ వద్ద లభించిన బూట్ల ముద్రలు కీలక ఆధారంగా నిలిచాయి. ఆ షూస్ ముద్రలు పూర్తిగా మ్యాచ్ కావడంతో అమినుల్ హక్ గుట్టు రట్టయ్యింది. విచారణలో చోరీ చేసినట్లు అమినుల్ హక్ అంగీకరించాడు. నిందితుడిని అరెస్ట్ చేసిన బంజారాహిల్స్ పోలీసులు.. అతడి నుంచి రూ.2.30 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.

## ఎన్‌స్టీన్ ఫైళ్లో అనిల్, హార్దీప్ పురీల పేర్లు

**- కేంద్రం చర్యలకు వెనకాడుతోంది**

**- మీడియాతో రాహుల్ విమర్శలు**


**న్యూఢిల్లీ, ఫిబ్రవరి11( వెలుతురు):**



రాహుల్ పార్లమెంటు వెలుపుల విలేకరులతో మాట్లాడుతూ.. 'హర్దీప్ పూరీ, అనీల అంబానీల పేర్లతో ఉన్న ఎప్‌స్టీన్ ఫైళ్లు న్యాయశాఖ వద్ద ఉన్నాయి. అదానీపై కొనసాగుతున్న కేసులో ఇప్పటికే సమన్లు జారీ చేయబడ్డాయి. దీనిపై గత 18 నెలలుగా భారత ప్రభుత్వం మాత్రం స్పందించలేదు. ఈ విషయంపై ప్రధానిపై ప్రత్యక్ష ఒత్తిడి ఉంది. ఇక్కడ ప్రధాన విషయం ఏమిటంటే డేటా పరంగా చూసినా..ఇప్పటివరకు రైతులు, ఇంధన భద్రత, రక్షణ పరంగా కూడా ఏ ప్రధానమంత్రి కూడా ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఇలా చేయలేదు అని అన్నారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం కింద కీలకమైన జాతీయ ప్రయోజనాలను ప్రధాని మోడీ వదులుకున్నారని రాహుల్‌గాంధీ విమర్శించారు. ఆర్థిక సర్వేపై మాట్లాడుతూ..ప్రపంచ క్రమం అమెరికా ఆధిపత్యంలో ఉన్న ఏకధ్రువ వ్యవస్థ నుండి చైనా, రష్యాలు సవాలు చేసే బహుళ ధ్రువ వ్యవస్థ దిశగా పయనిస్తోందని అన్నారు. ఇంధనం, ఆర్థికరంగాలను ఈ ఒప్పందం దెబ్బతీస్తోందని అన్నారు. డాలర్ ఆధిపత్యం ఒత్తిడిలో ఉందని, ప్రపంచం అస్థిరత మరియు సంఘర్షణలోకి వెళుతోందని అన్నారు. కృత్రిమ మేథస్సు (ఎఐ) అంతర్జాతీయంగా పోటీకీ కేంద్ర బిందువుగా మారిందని అన్నారు. భారతదేశ సాఫ్ట్‌వేర్‌రంగాన్ని ఎఐ దెబ్బతీస్తోందని, ఇన్ఫోసిస్ మరియు ఇతర కంపెనీల్లో పెద్ద సంఖ్యలో ఇంజనీర్లను భర్తీ చేస్తోందని హెచ్చరించారు. భారతదేశ బలం, దాని 140 కోట్ల ప్రజలు ఉత్పత్తి చేసే డేటాలో ఉందని అన్నారు. అమెరికన్ వస్తువులు తమకు అనుకూలమైన నిబంధనలతో దేశీయ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నాయని అన్నారు. భారతదేశ అమెరికా ఎగుమతులు 46 బిలియన్ డాలర్ల నుండి 146 బిలియన్ డాలర్లకు పెరగడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే అమెరికా నుండి తగిన నిబద్ధత ఎందుకు లేదని ప్రశ్నించారు. గతంలో తాను హర్యానా, గురుగావ్‌లోని పరిశ్రమలను సందర్శించానని, టారిఫ్‌ల మార్పులు పరిశ్రమలను తీవ్రంగా దెబ్బతీయనున్నాయని వాటి యజమానులు ఆవేదన వ్యక్తం చేశారని అన్నారు.

# అసెంబ్లీలో సబ్జక్టుపై అవగాహనతో రావాలి

- **ఆవు కథలు చెప్పి తప్పించుకోరాదు**
- **ప్రతిరోజూ అటెండెన్స్ ఉండాల్సిందే**
- **ఎమ్మెల్యేలకు సిఎం చంద్రబాబు సూచన**



**అమరావతి,ఫిబ్రవరి11 వెలుతురు:** వ్యక్తిగత కక్షల ప్రస్తావనకు అసెంబ్లీని వేదికగా చేసుకోవద్దని కూటమి ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు సూచించారు. సమస్యలను చర్చించి సిద్దంగా ఉండాలన్నారు. సబ్జక్ట్‌పై ప్రిపేర్ రావాలని అన్నారు. ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 నెలలుగా కూటమి నేతల ఐక్యత కొనసాగుతోందని చెప్పారు. కింది స్థాయిలోనూ ఇదే పరిస్థితి ఉండాలన్నారు. జిల్లా స్థాయిలో 3 పార్టీల నేతలు సమావేశాలు పెట్టుకుంటూ ఐక్యత పెంచుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేల పనితీరుపై అసెంబ్లీ సమావేశాల సమయంలో మాట్లాడతా. 40 మందిని వ్యక్తిగతంగా పిలిపించుకుని మాట్లాడతా. ఆవు కథలు చెప్పడం మాని స్జబెక్ట్ ప్రిపేర్ అయి సభకు రావాలి. ఎవరేం మాట్లాడుతున్నారో నేనూ నోట్ చేసుకుంటా అని అన్నారు. అసెంబ్లీ జరుగుతున్నప్పుడు ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రతి ఒక్కరూ ఉండాలి. నేను కూడా రోజూ ఉదయం 11 గంటల నుంచి సెషన్ అయ్యే వరకూ అసెంబ్లీలో ఉంటా. సభలో మాట్లాడేది 5 కోట్ల మంది ప్రజలకు జవాబుదారీ అని గుర్తుపెట్టుకోవాలని చంద్రబాబు అన్నారు. అక్కడ ఏం మాట్లాడినా వారి కోసమేనని గ్రహించాలి. అనుకున్న విషయాన్ని 3 నుంచి 7 నిమిషాల్లో మాట్లాడాలి. కూటమి ప్రభుత్వంతో ప్రజలకు జరుగుతున్న లబ్దిని ఎప్పటికప్పుడు చెప్పాలి. రూ.లక్ష కోట్లకు పైగా హైవే పనులు, రూ.90వేల కోట్లకు పైగా రైల్వే పనులు జరుగుతున్నాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ రూ.450 కోట్ల నష్టంలో ఉంది. నష్టాలను అధిగమించి రూ.54 కోట్ల లాభాల్లోకి రావడం శుభపరిణామం. కేంద్ర ప్రాయోజికత కార్యక్రమాలను రాష్ట్రం అందిపుచ్చుకోవాలి. అన్ని మతాలను గౌరవించాలి.. భక్తుల సెంటిమెంట్‌ను దెబ్బతీయకూడదు. జగన్‌కు మతాలపై గౌరవం లేనందునే వైకాపా హయాంలో రామతీర్థం సహా అనేక ఆలయాలపై దాడులు జరిగాయి. తిరుమల శ్రీవారి లడ్డూతో పాటు ఎక్కడ వీలైతే అక్కడ కల్తీకి పాల్పడ్డారు' అని చంద్రబాబు అన్నారు.

# మార్చి 7 వరకు అసెంబ్లీ సమావేశాలు

- **14న బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న మంత్రి కేశవ్**
- **15,16. సెలవులు..17, 18వ తేదీల్లో బడ్జెట్‌పై చర్చ**
- **24, 25, 26 తేదీల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రీడాపోటీలు**
- **బిఎసి సమావేశంలో సమావేశాల నిర్వహణపై నిర్ణయం**



**అమరావతి,ఫిబ్రవరి11 వెలుతురు:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి 7 వరకు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. 14 ఆర్థిక మంత్రి బడ్జెట్ సమర్పిస్తారు. అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై బిజినెస్ అడ్వైజరీ కమిటీ కీలక నిర్ణయాలు తీసుకుంది.మార్చి 7వ తేదీ వరకు సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రతిరోజూ ఉదయం గం.9:00 నుంచి మధ్యాహ్నం గం.1:30 వరకు ఈ సమావేశాలు జరగనున్నాయి. ఈనెల 14న బడ్జెట్ సమావేశం నిర్వహించనుంది. 15, 16న సెలవులు కాబట్టి 17, 18వ తేదీల్లో బడ్జెట్‌పై చర్చ, 18న రాష్ట్ర పద్దుపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వివరణ ఉంటుంది. 19వ తేదీ నుంచి 8 పనిదినాలు, డిమాండ్ల గ్రాంట్లపై అసెంబ్లీ బీఏసీ చర్చించనుంది ఈ నెల 28న శనివారం నాడు కూడా అసెంబ్లీ కార్యకలాపాలు యథావిధిగా కొనసాగనున్నాయి. మార్చి 1, 2, 3వ తేదీల్లో అసెంబ్లీకి సెలవు దినాలుగా నిర్ణయించింది. మార్చి 6, 7న బడ్జెట్‌పై మరోసారి చర్చించనున్నారు. ఆ తర్వాత అవసరం మేరకు అసెంబ్లీ సమావేశాలను పొడిగించాలా? వద్దా? అనే విషయమై అసెంబ్లీ బీఏసీ నిర్ణయించనుంది. అసెంబ్లీ సమావేశాల్లో రోజూ జీరో అవర్ నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన నిర్వహించిన బీఏసీ సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. 17 రోజులపాటు అసెంబ్లీ కార్యకలాపాలు నిర్వహించనున్నారు. 15 ఆదివారం కాగా.. మహా శివరాత్రి తర్వాత రోజు 16న సెలవు ప్రకటించారు. ఫిబ్రవరి 24, 25, 26 తేదీల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రీడాపోటీలు నిర్వహించనున్నారు. మార్చి 1, 2, 3 తేదీల్లో అసెంబ్లీకి సెలవు ప్రకటించారు. మార్చి 6న అమరావతిలోనే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సమావేశాలు జరగనున్నాయి. ఉదయం 10 గంటలకు ప్రశ్నోత్తరాలు ముగించాలని.. రోజూ జీరో అవర్ నిర్వహించాలని బీఏసీ భేటీలో నిర్ణయించారు. డిమాండ్ ఫర్ గ్రాంట్స్‌పై 8 రోజుల పాటు చర్చ జరగనుంది. ఆరు ఆర్డినెన్స్‌లకు సభ ఆమోదం తెలపనుంది.

సమావేశాల సందర్భంగా పలు కీలక చర్చలు, బిల్లుల ఆమోదం జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రభుత్వ విధానాలు, ఆర్థిక ప్రణాళికలపై ప్రతిపక్షం నుంచి తీవ్ర చర్చలు జరిగే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. బ్జడెట్ సమావేశాల మధ్యలో ఎమ్మెల్యేల కోసం ప్రత్యేక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 24, 25, 26 తేదీల్లో ఎమ్మెల్యేలకు ఆటల పోటీలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా సభ్యుల మధ్య స్నేహపూర్వక వాతావరణం పెంపొందించడమే లక్ష్యంగా ఉన్నట్లు సమాచారం. ఈసారి అసెంబ్లీ సమావేశాలు రాజకీయంగా, పరిపాలనా పరంగా కీలకంగా మారనున్నాయి.

# మహాశివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

**- 43 శైవక్షేత్రాలకు 2,243 స్పెషల్ సర్వీసులు**


**- శ్రీశైలం, వేములవాడ, ఏడుపాయల తదితర క్షేత్రాలకు**




**హైదరాబాద్, ఫిబ్రవరి11( వెలుతురు):** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ ఆర్టీసీ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. శివరాత్రి సందర్భంగా వివిధ శైవక్షేత్రాలకు వెళ్లే భక్తులకు రవాణాపరంగా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆర్టీసీ అన్ని ఏర్పాట్లు చేసింది. భక్తుల సౌకర్యార్థం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 43 శైవక్షేత్రాలకు 2,243 స్పెషల్ బస్సులను నడపాలని నిర్ణయించింది. ఈ నెల 15న మహా శివరాత్రి పండుగ ఉండటంతో.. ఈనెల 14 నుంచి 16 వరకు ఈ ప్రత్యేక బస్సులను నడపనున్నారు. ప్రధానంగా శ్రీశైలానికి 781, వేములవాడకు 416, ఏడుపాయలకు 249, కీసరగుట్టకు 326, వేలాలకు 127, కాళేశ్వరానికి 71 స్పెషల్ సర్వీసులు నడవనున్నాయి. అదేవిధంగా కొమురవెల్లి, అలంపూర్, ఉమామహేశ్వరం, పాలకుర్తి, రామప్ప, తదితర ఆలయాలకు 273 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్, ఐఎస్ సదన్, కేపీహెచ్‌బీ, బీహెచ్‌ఈఎల్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో షామియానాలు, చైర్‌లు, తాగునీటితోపాటు పబ్లిక్ అడ్రస్ సిస్టంను సంస్థ ఏర్పాటు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం శివరాత్రికి నడిచే స్పెషల్ బస్సుల్లో టికెట్ ధరలను సంస్థ సవరించింది. ప్రత్యేక బస్సుల్లో 1.5 టైమ్స్ వరకు టికెట్ ధరలను సవరించింది. రెగ్యులర్ సర్వీస్ టికెట్ చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదు. ఈ నెల 14 నుంచి 16వ తేది వరకు (మూడు రోజులు) నడిచే ప్రత్యేక బస్సులకు మాత్రమే సవరణ టికెట్ ఛార్జీలు అమల్లో ఉంటాయి. ఏడుపాయలకు తిరిగే స్పెషల్ బస్సుల్లో 15వ తేదీ నుంచి 17 తేదీ వరకు (మూడు రోజులు) సవరణ చార్జీలు వర్తిస్తాయి. ప్రయాణికులకు సమాచార నిమిత్తం స్పెషల్ సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్ ప్లే బోర్డులను సంస్థ ఏర్పాటు చేస్తుంది. శివరాత్రి ఆపరేషన్స్‌పై ఉన్నతాధికారులతో సంస్థ వీసీ, ఎండీ శ్రీ వై నాగిరెడ్డి ఇప్పటికే సమీక్ష నిర్వహించారు. శివరాత్రి పండుగకు శైవక్షేత్రాలకు వెళ్లే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. గత శివరాత్రి కంటే ఈసారి 208 బస్సులను అదనంగా సంస్థ నడుపుతోంది. భక్తుల రద్దీకి అనుగుణంగా మరిన్ని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీచేసింది. మహాశివరాత్రి స్పెషల్ బస్సుల్లో (పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో) రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం.. మహిళలకు యథావిధిగా ఉచిత రవాణా సదుపాయం అమల్లో ఉంటుంది. తమ ప్రయాణ సమయంలో మహిళలు విధిగా జీరో టికెట్లను తీసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించామని, టికెట్ల బుకింగ్ ను లిలిలి.బిణబసబిఞశిబీబ.తిని వెబ్‌సైట్లో బుక్ చేసుకోవచ్చని, మహా శివరాత్రి స్పెషల్ బస్సులకు సంబంధించిన సమాచారం కోసం టీజీఎస్‌ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-234500332లలో సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

# స్మార్ట్ డిజిటల్ లాజిస్టిక్ కేంద్రాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి11( వెలుతురు):** తెలంగాణలో కొత్తగా 12 లాజిస్టిక్ పార్కులు ఏర్పాటు చేసేందుకు రేవంత్ సర్కార్ ప్రణాళికలు రచిస్తోంది. రోడ్డు, రైలు, విమాన మార్గాలతో వీటిని కనెక్ట్ చేయనున్నారు. ఈ మేరకు సర్కార్ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తోంది. కొన్ని ప్రాంతాల్లో డ్రై పోర్టులు, గిడ్డంగులుగా ఏర్పాటు చేసి స్మార్ట్ డిజిటల్ లాజిస్టిక్ కేంద్రాలుగా అభివృద్ధి చేయనున్నారు.తెలంగాణను అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు రేవంత్ సర్కార్ 'తెలంగాణ రైజింగ్ 2047' నినాదంతో ముందుకెళ్తోంది. అందులో భాగంగా.. రాష్ట్రాన్ని దేశంలోనే ప్రధాన లాజిస్టిక్ హబ్‌గా మార్చే దిశగా భారీ ప్రణాళికలు రచిస్తోంది. అందులో భాగంగా.. తెలంగాణ లాజిస్టిక్ పాలసీ 2.0 సమగ్ర మాస్టర్‌ప్లాన్ రూపొందుతోంది. 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్యంతో.. రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని ప్రయత్నిస్తోంది. ఈ మేరకు



రాష్ట్రవ్యాప్తంగా 12 కొత్త లాజిస్టిక్ పార్కులు , అవసరమైన చోట్ల డ్రై పోర్టులు, అత్యాధునిక గిడ్డంగులను నిర్మించేందుకు రెడీ అవుతున్నారు.ప్రధానంగా పరిశ్రమలను ఆకర్షించడం, ఎగుమతులను ప్రోత్సహించడం, రవాణా ఖర్చులను తగ్గించడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తుంది. రోడ్డు, ట్రైన్, విమాన విమాన మార్గాలను కనెక్ట్ చేస్తూ ఒక పకడ్బందీ సరఫరా వ్యవస్థను నిర్మించనున్నారు. వ్యవసాయాధారిత పరిశ్రమలకు, పారిశ్రామిక క్లస్టర్లకు, ఈ-కామర్స్ సంస్థలకు ఈ మాస్టర్‌ప్లాన్ బ్యాక్‌బోన్‌గా నిలవనుంది. పర్యావరణహిత విధానాలు, ఆటోమేషన్ ద్వారా లాజిస్టిక్ రంగాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దనున్నారు. ఇప్పటికే మనోహరాబాద్ సమీపంలో మెగా మల్టీమోడల్ లాజిస్టిక్ పార్క్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే హైదరాబాద్ శివారులోని మంగళపల్లి, బాటసింగారం తరహాలో మరిన్ని పార్కులను విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు, రీజినల్ రింగు రోడ్డు మధ్య ఉన్న ప్రాంతాన్ని పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ' (ప్యూర్) జోన్‌గా ప్రభుత్వం గుర్తించింది. ఇక్కడ తయారీ యూనిట్లు, ఎంఎస్‌ఎంఈ క్లస్టర్లు, లాజిస్టిక్ హబ్‌లను ఏర్పాటు చేయటం ద్వారా గ్రామీణ, పట్టణ ఆర్థిక వ్యవస్థలను వేగంగా కనెక్ట్ చేయనున్నారు. దీనివల్ల భారీస్థాయిలో ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా.. సరుకు రవాణాకు అత్యంత అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుంది. అలాగే, ఫ్యూచర్ సిటీ నుంచి బందరు పోర్టు వరకు ప్రతిపాదించిన 297 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే, రైల్వే లైన్, ఈ డ్రై పోర్టులను కనెక్ట్ చేస్తూ రాష్ట్ర ఎగుమతులను ప్రోత్సహించనున్నారు.ఎయిర్ కార్గో రంగాన్ని కూడా మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇప్పటికే శంషాబాద్ విమానాశ్రయం ఔషధాలు, ఎలక్ట్రానిక్స్ వంటి విలువైన సరుకు రవాణాలో దేశంలోనే ప్రముఖ కేంద్రంగా ఉంది. ఈ ఎయిర్ కార్గో సేవలను రోడ్డు, రైలు మార్గాలతో సమన్వయం చేయడం ద్వారా 'మల్టీ-మోడల్ కనెక్టివిటీ'ని సాధించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ సమగ్ర లాజిస్టిక్ విధానం అమల్లోకి వస్తే.. తెలంగాణ పారిశ్రామిక రంగంలో అగ్రగామిగా నిలవటం ఖాయం.

## ఎన్నికల అధికారుల తీరుపై ఎంపి ఆగ్రహం

**నిజామాబాద్, ఫిబ్రవరి11 ( వెలుతురు):**
నిజామాబాద్‌లో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ హల్‌చల్ చేశారు. హరిచరణ్ మార్వాడీ స్కూల్ పోలింగ్ కేంద్రంలో పోలీసులు, ఎన్నికల సిబ్బందిపై అర్వింద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ అభ్యర్థిని పోలీసులు బయటకు పంపేశారని, ఎన్నికల సిబ్బంది తమకు సహకరించడం లేదని ఎంపీకి కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. వెంటనే పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎంపీ.. పోలీసులకు వార్నింగ్ ఇచ్చారు. సంగతి చూస్తాను అని పోలీసులను ఉద్దేశించి హెచ్చరించారు. ఈ విషయంపై జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం పంపిన ఎంపీ అర్వింద్.. బీజేపీ అభ్యర్థిని బయటకు పంపిన అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓటర్లు భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## భూపాలపల్లిలో లక్ష రూపాయాలు సీజ్



**జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి11 ( వెలుతురు):**
మున్సిపల్ ఎన్నికల వేళ జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పోలింగ్ కేంద్రం సమీపంలో రూ.లక్ష రూపాయలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 22వ వార్డులోని పోలింగ్ కేంద్రం సమీపంలోని ఒక బండ కింద డబ్బులు దాచి, ఓటర్లకు పంచుతున్నారని కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకుల చేతిలో ఉన్న డబ్బును పోలీసులు సీజ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు ఈ డబ్బులను పంచుతున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. బీఆర్ఎస్ అభ్యర్థి బుర్రా సదానందాన్ని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, కాంగ్రెస్ ఆరోపణలను బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. పట్టుబడిన సొమ్ముతో తమకెలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కావాలనే రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. నగామలో మున్సిపల్ ఎన్నికలో నిర్వహణలో ప్రభుత్వం విఫలమైందని ఓటర్లు ఆరోపిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద సరైన ఏర్పాట్లు చేయలేదని వాపోతున్నారు. వృద్ధుల కోసం వీల్ చైర్ కూడా ఏర్పాటు చేయకపోవడంతో వారిని చేతులపైనే మోసుకెళ్లాల్సి వస్తుంది.

## పోలీసుల తీరుపై జగ్గారెడ్డి ఆగ్రహం

**సంగారెడ్డి, ఫిబ్రవరి11 ( వెలుతురు):**



పట్టణంలోని 34వ వార్డు పోలింగ్ కేంద్రం వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలింగ్ కేంద్రం వద్ద విధుల్లో ఉన్న సీఐ.. 34 వార్డు కాంగ్రెస్ అభ్యర్థి గల్ల పట్టుకున్నారని ఆరోపిస్తూ సీనియర్ నేత జగ్గారెడ్డి పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకున్నారు. పోలింగ్ ఆపేస్తామంటూ బూత్‌లోకి దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులు, జగ్గారెడ్డికి మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. బీఆర్ఎస్ అభ్యర్థి రిగ్గింగ్‌కు సీఐ సహకరిస్తున్నారని జగ్గారెడ్డి మండిపడ్డారు. సీఐని సస్పెండ్ చేయకపోతే ఎన్నికలు బహిష్కరిస్తామని హెచ్చరించారు.

## ముంబయి మేయర్‌గా రితూ తావ్డే

### - ఏకగ్రీవంగా ఎన్నికైన బిజెపి కార్పోరేటర్



**ముంబై, ఫిబ్రవరి11 ( వెలుతురు):**
ముంబయి మేయర్‌గా మహాయుతికి చెందిన రితూ తావ్డే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత 25 ఏళ్లలో భాజపాకు ఈ పదవి దక్కడం ఇదే తొలిసారి. స్థానికంగా భాజపా సీనియర్ నేత అయిన రితూ .. ఘట్కోపర్ వెస్ట్ నుంచి మూడుసార్లు కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ విద్యా కమిటీ అధ్యక్షురాలిగా పనిచేసిన అనుభవం కూడా ఆమెకు ఉంది. వార్డు స్థాయిలో రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ఆమె.. బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ లో పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. కాగా, 227 సీట్ల బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 89 సీట్లు భాజపా గెలుచుకోగా శిందే సేన 29 స్థానాల్లో విజయం సాధించింది.

## అధికార దుర్వినయోగం...ఉల్లంఘనలు

### - మున్సిపోల్స్‌పై హరీష్ రావు విమర్శలు



**హైదరాబాద్, ఫిబ్రవరి11 ( వెలుతురు):**
మున్సిపల్ ఎన్నికల్లో.. ముఖ్యమంత్రి మొదలు మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు అడుగడుగునా అధికార దుర్వినియోగానికి, ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు పాల్పడటం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. నామినేషన్ల దాఖలు మొదలు పోలింగ్ వరకూ కాంగ్రెస్ అనేక అరాచకాలకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆక్షేపించారు. బీఆర్ఎస్ అభ్యర్థులను బెదిరించడం, వారిపై భౌతిక దాడులకు తెగబడటం హేయమైన రాజకీయ సంస్కృతికి నిదర్శనమని విమర్శించారు. చట్టాన్ని లెక్కచేయకుండా అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తిన కొందరు పోలీసుల తీరు గర్హనీయమని ఖండించారు. ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ ఇలాంటి నీచ రాజకీయాలకు తెగబడటం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని అన్నారు. కాంగ్రెస్ కుట్రలు, కుతంత్రాలు, డబ్బు సంచులు, దుష్ట పన్నాగాలు ప్రజల తీర్పును ఏమాత్రం ప్రభావితం చేయలేవని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. అధికార పార్టీ అకృత్యాలకు అదరకుండా, బెదరకుండా బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం చివరి వరకు కృషి చేసిన పార్టీ శ్రేణులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్‌పై విశ్వాసంతో ఓటు వేసిన ప్రతి ఓటరుకు ధన్యవాదాలు చెప్పారు.

## ఓటు వేసిన మాజీమంత్రి జగదీశ్ రెడ్డి

### - ఫోన్ ట్యాపింగ్‌పై పొంగులేటి వ్యాఖ్యలపై ఆగ్రహం



**సూర్యాపేట, ఫిబ్రవరి11 ( వెలుతురు):**
తన ఫోన్‌ను బీఆర్ఎస్ నాయకులు ట్యాపింగ్ చేస్తున్నారని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించడం సిగ్గుచేటని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం సూర్యాపేటలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా తన ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అధికారంలో ఉన్నది వారేనని అయినా హోం మంత్రి చేతకానితనమే దీనికి నిదర్శనమా అని ప్రశ్నించారు. ప్రభుత్వంలో ఉండి కూడా ఫోన్లు ట్యాప్ అవుతున్నాయని అనడం హాస్యాస్పదమని జగదీష్ రెడ్డి ఎద్దేవా చేశారు. మా ఫోన్లు ట్యాప్ అవుతున్నాయని మంత్రి పొంగులేటి అనడం అంటే తమది దద్దమ్మ ప్రభుత్వం అని వారు ఒప్పుకున్నట్లేనని, రాష్ట్రంలో పోలీసింగ్ లేదని, ప్రభుత్వం చేతగాని స్థితిలో ఉందని వారి మాటల్లోనే తేటతెల్లమవుతోందని విమర్శించారు. హోం మంత్రిగా ఉన్న వ్యక్తి విఫలమయ్యారని మంత్రులే పరోక్షంగా ఒప్పుకుంటున్నారని ఆయన ధ్వజమెత్తారు. పోలీసులను కాంగ్రెస్ కార్యకర్తలుగా మార్చేశారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థకు స్వేచ్ఛ లేకుండా పోయిందని జగదీష్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులను కాంగ్రెస్ కార్యకర్తల్లా వాడుకుంటూ బీఆర్ఎస్ నాయకులపై దాడులు చేయిస్తున్నారని, ÷ఖఆర్ఎస్ ఫోన్ల ట్యాపింగ్ చేస్తోందనేదనేది కేవలం అపోహ మాత్రమేనని, నిజానికి మంత్రుల ఫోన్లను కూడా ఈ ప్రభుత్వం ట్యాప్ చేస్తోందని మేము మొదటి నుంచీ చెబుతూనే ఉన్నామన్నారు. నిజంగా ట్యాపింగ్ జరుగుతుంటే, అది ఎవరో తేల్చే ధైర్యం ఈ ప్రభుత్వానికి ఉందా అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల్లో లబ్ది పొందేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని జగదీష్ రెడ్డి ఆరోపించారు. ఎన్నికల సమయంలో సహకరించాలని ఉద్యోగులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించడం వారి బలహీనతకు నిదర్శనమన్నారు. ప్రజల్లో ఆదరణ లేక ఇప్పుడు ఉద్యోగుల వద్దకు కాళ్ల బేరానికి వెళు_న్నారని, ఎవరు ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని దాడులు చేసినా రాబోయేది మళ్లీ కేసీఆర్ రాజ్యమే అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## కానిస్టేబుల్‌ను నిలదీసిని బిఆర్ఎస్, బిజెపి

### - ఎల్లారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే జాజుల ఆందోళన




**కామారెడ్డి, ఫిబ్రవరి11 ( వెలుతురు):**
మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా పలు ప్రాంతాల్లో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. అధికార పార్టీకి అనుకూలంగా, ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు. బాన్సువాడ మున్సిపాలిటీలో ఓ కానిస్టేబుల్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ఓటర్లను ప్రలోభపెట్టారు. బాన్సువాడ మున్సిపాలిటీ 9వ వార్డులో బందోబస్తు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్.. కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని ఓటర్లకు చెబుతుండగా అక్కడే ఉన్న బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు నిలదీశారు. దాంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అధికార పార్టీ ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు పోలీసులు వత్తాసు పలుకుతున్నారని ఆరోపిస్తూ ఎల్లారెడ్డి పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆందోళన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఎన్నిక సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి పోలీసులు వత్తాసు పలుకుతున్నారని జాజాల సురేందర్ ఆరోపించారు. డీఎస్పీ, సీఐ, ఎస్సై మూకుమ్మడిగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేకు మద్దతు తెలుపుతున్నారని, ఎన్నికల ప్రక్రియను అపహస్యం చేస్తున్నారని మండిపడ్డారు. కాగా, బీఆర్ఎస్ నిరసనను పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళన చేస్తున్న జాజాల సురేందర్, ఇతర బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి ఇతర ప్రాంతాలకు తరలించారు.

## మీనాక్షి తెలంగాణ ఇన్ ఛార్జిగా ఉన్నారా

**హైదరాబాద్, ఫిబ్రవరి11 ( వెలుతురు):**
తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ లో జరుగుతున్న వ్యవహారాలను పట్టించుకోవడం లేదనిపిస్తోంది. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా వివిధ చోట్ల రెబెల్స్ నామినేషన్లు దాఖలు చేసినప్పటికీ ఎలాంటి చర్యలకు ఆమె దిగడం లేదు. పార్టీ పరంగా తీసుకోవాల్సిన నిర్ణయాల విషయంలో మీనాక్షి నటరాజన్ నానుస్తున్నారని అన్నారు. కనీసం మీనాక్షి నటరాజన్ రాష్ట్ర పార్టీలో జరుగుతున్న పరిణామాలను హైకమాండ్ కు అసలు చెబుతున్నారా? లేదా? అన్న అనుమానం కూడా ఉంది. ఆమె ఏదో ఇన్ ఛార్జిగా ఉన్నట్లే ఉంటున్నారు తప్పించి ఎలాంటి కఠిన నిర్ణయాల వంటి జోలికి వెళ్లడం లేదు. దీనిని అలుసుగా తీసుకుని కాంగ్రెస్ నేతలు కొందరు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయిమీనాక్షి నటరాజన్ రాహుల్ గాంధీ కోటరీలో వ్యక్తి అంటారు. ఆయన ఆలోచనలకు అనుగుణంగా నడుచుకుంటారనే ఆమెను తెలంగాణ వ్యవహారాల ఇన్ ఛార్జిగా నియమించారు. మీనాక్షి నటరాజన్ చాలా సింపుల్ గా ఉంటారు. గతంలో ఇన్ ఛార్జుల మాదిరిగా మీనాక్షి పార్టీ బలోపేతానికి తప్పించి మరే ఆలోచన చేయరు. తెలంగాణకు వస్తే హంగు ఆర్భాటాలను కూడా ప్రదర్శించరు. స్టార్ హోటల్స్ బస చేయరు. అలాగే ఏ స్థాయి నేత ఫోన్ చేసిన వెంటనే రెస్పాండ్ అవుతారు. అలాంటి మీనాక్షి నటరాజన్ గత కొద్ది రోజుల నుంచి తెలంగాణ కాంగ్రెస్ లో జరుగుతున్న పరిణామాలపై ఆమె స్పందించకపోవడం, పార్టీ అగ్ర నాయకత్వానికి కూడా తెలియజేయకపోవడంపైనే ఇప్పుడు గాంధీ భవన్ లో చర్చ జరుగుతుంది.మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి కానీ, పార్టీలో జరుగుతున్న రాజకీయ పరిణామాలకు సంబంధించి అసలు పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళుతున్నారా? లేదా? అన్న అనుమానం కూడా నేతల్లో ఉంది. జీవన్ రెడ్డి వ్యవహారం తీసుకుంటే అది వెంటనే హైకమాండ్ కు చేరవేయాలి. ఆయన దశాబ్దాలుగా పార్టీలో ఉన్న నేత అని మీనాక్షికి తెలుసు. కనీసం ఆయన వద్దకు వెళ్లి మాట్లాడే ప్రయత్నం కూడా మీనాక్షి చేయలేదు. అంటే రాష్ట్ర నాయకత్వం తీసుకున్న నిర్ణయాలను అమలు పర్చేదానికి ఇక ఇన్ ఛార్జి ఎందుకన్న సందేహం సాధారణంగా కార్యకర్తల్లోనూ వ్యక్తమవుతుంది. అప్పుడప్పుడు ఇలా వచ్చి అలా మౌనంగా మీనాక్షి నటరాజన్ వెళ్లిపోతుంటే పార్టీ పరిస్థితి నానాటికీ తీసికట్టులా తయారవుతుందన్న ఆందోళన కాంగ్రెస్ నేతల్లో వ్యక్తమవుతుంది.

## మారిన గుర్తుల క్రమసంఖ్య

### - ఆందోళన వ్యక్తం చేసిన అభ్యర్థులు



**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి11( వెలుతురు):**
మున్సిపల్ ఎన్నికల్లో గందరగోళం నెలకొంది. మహబూబ్‌నగర్‌లోని 45వ డివిజన్‌లో ఓటర్లకు ఇస్తున్న బ్యాలెట్ పేపర్లపై సీరియల్ నంబర్లు, గుర్తులు తారుమారు కావడంపై అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేసారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం అధికార యంత్రాంగం ఇచ్చిన బ్యాలెట్ నమూనా ఒకలా ఉంటే.. పోలింగ్ రోజు మరోలా ఇస్తున్నారని వాపోయారు. ముందుగా ఇచ్చిన నమూనా బ్యాలెట్‌లో ముందు ప్రధాన పార్టీల గుర్తులు.. ఆ తర్వాత జనసేన, ఇతర పార్టీల గుర్తులను ఇచ్చారు. కానీ అనూహ్యంగా పోలింగ్ రోజు ఇచ్చిన బ్యాలెట్‌లో జనసేన పార్టీకి ఒకటో నంబర్ ఇచ్చారు. దీంతో ప్రధాన పార్టీల గుర్తులన్నీ మారిపోయాయి. ఎన్నికలు ప్రారంభమయ్యాక ఇది గమనించిన అభ్యర్థులు ఆందోళన చేపట్టారు. దీంతో 20 నిమిషాల పాటు పోలింగ్ నిలిచిపోయింది.అభ్యర్థుల ఆందోళనతో రంగంలోకి దిగిన అధికారులు అభ్యర్థులతో చర్చించారు. సమన్వయంతో ఓటింగ్ పక్రియను పున:ప్రారంభించారు.

## బైక్‌పై తిరుగుతూ మంత్రి వివేక ప్రచారం



**మంచిర్యాల, ఫిబ్రవరి11( వెలుతురు):**
రాజ్యాంగ విలువను, ఎన్నికల విధానాలను రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ తుంగలో తొక్కారు. పోలింగ్ జరుగుతున్న బుధవారంసైతం మంచిర్యాల జిల్లా చెన్నూర్ మున్సిపాలిటీలో ప్రచారం చేశారనే విమర్శలు వచ్చాయి. చెన్నూర్ 4, 5 బూత్ లలో కాంగ్రెస్ కార్యకర్తలు, అభ్యర్థులతో కలిసి బైక్ పై తిరుగుతూ ప్రచారం చేశారు. దాదాపు మధ్యాహ్నం 12.25 గంటల సమయంలో బైక్ పై తిరుగుతూ ప్రచారం చేస్తూ కెమెరా కంటపడ్డారు. ఇందుకు సంబంధించిన ఫోటోలు నిమిషాల వ్యవధిలోనే సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. నిన్న సైతం ఇదే తరహాలో క్యాతన్ పల్లి, చెన్నూరు మున్సిపాలిటీ ల్లో తిరుగుతా మంత్రి ప్రచారం చేశారు. దీంతో రాజ్యాంగం, ఎన్నికల కమిషన్ అంటే గౌరవం లేదా.. విచ్చల విడిగా ఇలా అధికార దుర్వినియోగం చేయడం ఏంటి.. మంత్రి స్థాయు వ్యక్తి ఇలా చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎంత జరుగుతున్న అడ్డుకోవాల్సిన ఎన్నికల సంఘం, అధికారుల తీరు పై విమర్శలు వెల్లువెత్తాయి.మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలోని ఓ పోలింగ్ కేంద్రం దగ్గర బీఆర్ఎస్ ఏజెంట్ శ్రీనివాస్ గౌడ్‌ను పోలీసులు దౌర్జన్యంగా బయటికి ఈడ్చుకెళ్లారు.

# ఏప్రిల్ లో తెలంగాణ జాగృతి

**హైదరాబాద్, ఫిబ్రవరి11 ( వెలుతురు):**
తెలంగాణ రాజకీయ ముఖచిత్రం మరో కీలక మలుపు తిరగబోతోంది. గత కొంతకాలంగా మౌనంగా ఉంటూనే తన వ్యూహాలకు పదును పెట్టిన మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సరికొత్త రాజకీయ ప్రస్థానానికి శ్రీకారం చుట్టబోతున్నారు. తన స్వచ్ఛంద సంస్థ 'తెలంగాణ జాగృతి'ని పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా మార్చే ప్రక్రియ తుది దశకు చేరుకుంది. వచ్చే ఏప్రిల్ నెలాఖరులో లేదా మే మొదటి వారంలో ఈ నూతన పార్టీ అధికారికంగా ప్రజల ముందుకు రానుంది.కొత్త పార్టీ ఏర్పాటుకు సంబంధించి ఇప్పటికే అన్ని సాంకేతిక, చట్టపరమైన చర్యలను కవిత బృందం పూర్తి చేసింది. గత నెలలోనే కేంద్ర ఎన్నికల సంఘానికి అవసరమైన అన్ని పత్రాలతో కూడిన దరఖాస్తును అందజేశారు. ఈసీఐ నిబంధనల ప్రకారం పార్టీ పేరు నమోదు, ఇతర వివరాల పరిశీలనకు సాధారణంగా రెండు నెలల సమయం పడుతుంది. అన్నీ సవ్యంగా సాగితే, ఉగాది పర్వదినం తర్వాత, ఏప్రిల్ ఆఖరి వారంలో ఒక మంచి ముహూర్తాన్ని చూసుకుని కవిత తన పార్టీ జెండా, ఎజెండాను ప్రకటించనున్నారు.భారత రాష్ట్ర సమితి ) నుంచి సస్పెన్షన్‌కు గురైన తర్వాత కవిత తన రాజకీయ పంథాను పూర్తిగా మార్చుకున్నారు. కేవలం తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడమే కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల నాడిని తెలుసుకునేందుకు జాగృతి జనంబాట పేరుతో పర్యటనలు చేపట్టారు. కేవలం భావోద్వేగాల మీద కాకుండా, ప్రజా సమస్యల ప్రాతిపదికన పార్టీ విధానాలు ఉండాలని ఆమె భావిస్తున్నారు. వివిధ సామాజిక వర్గాల సమస్యలు, ఆర్థిక స్థితిగతులు, రైతాంగ ఇబ్బందులపై అధ్యయనం చేయడానికి




50 కమిటీలను ఏర్పాటు చేశారు. మేధావులు, విద్యార్థులు, కుల వృత్తుల వారితో సమావేశమై పార్టీ ఎజెండా రూపకల్పనలో వారి భాగస్వామ్యాన్ని తీసుకుంటున్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన వారు, అమరవీరుల కుటుంబాలు 'జాగృతి' నీడలోకి రావాలని ఆమె బహిరంగంగానే విజ్ఞప్తి చేశారు.ఈ కొత్త పార్టీ రూపకల్పన వెనుక ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ టీం పని చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. సోషల్ మీడియా మేనేజ్‌మెంట్ నుండి క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ నిర్మాణ వరకు పీకే సలహాలను కవిత తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా, రాబోయే జీహెచ్ఎంసీ ( ఎన్నికలే ఈ పార్టీకి మొదటి పరీక్ష కానున్నాయి. ఒకవేళ ఈసీఐ నుంచి గుర్తింపు సకాలంలో వస్తే, హైదరాబాద్ నగర వ్యాప్తంగా అభ్యర్థులను నిలబెట్టి తన సత్తా చాటాలని కవిత యోచిస్తున్నారు. తద్వారా వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి ప్రధాన రాజకీయ శక్తిగా ఎదగాలన్నది ఆమె మాస్టర్ ప్లాన్."నా రాజకీయ భవిష్యత్తు కోసం పటిష్టమైన కార్యాచరణ సిద్ధం చేసుకున్నాను. తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త చర్చకు ఈ పార్టీ నాంది పలుకుతుంది" అని కవిత ధీమా వ్యక్తం చేస్తున్నారు. 'సామాజిక తెలంగాణ' నినాదంతో, అట్టడుగు వర్గాలకు రాజ్యాధికారమే లక్ష్యంగా పార్టీ ఎజెండా ఉండబోతున్నట్లు సమాచారం. త్వరలోనే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి, గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు కమిటీలను ప్రకటించనున్నారు. అటు అధికార కాంగ్రెస్, ఇటు ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య 'జాగృతి' ఏ మేరకు ప్రభావం చూపుతుందో వేచి చూడాలి.

# నలుగురు మంత్రులకు బెదిరింపు లేఖలు

## - ఒకే తరహాలో ఉన్న లేఖల సారాంశం

## - పోలీసులకు ఫిర్యాదు చేసిన కందుల దుర్గేష్ పిఎస్




**అమరావతి, ఫిబ్రవరి11( వెలుతురు):**
ఆంధ్రప్రదేశ్‌లో కొందరు కీలక మంత్రులకు అజ్ఞాత వ్యక్తుల నుంచి హెచ్చరికలతో కూడిన లేఖలు రావడం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. జాగ్రత్తగా ఉండాలంటూ పంపిన ఈ లేఖలపై భద్రతా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై ఇప్పటికే మంత్రి కందుల దుర్గేష్ పీఎస్.. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, సత్యకుమార్‌లకు కూడా ఇదే తరహా హెచ్చరిక లేఖలు అందాయి. ఒకే విధమైన సందేశంతో పలువురు మంత్రులకు లేఖలు రావడం వెనుక ఎవరు ఉన్నారన్న దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో లేఖపై పోలీసులు విచారణ ప్రారంభించారు. ఈ లేఖల వ్యవహారం అసెంబ్లీ లాబీల్లో విస్తృత చర్చకు దారి తీసింది. హెచ్చరిక లేఖల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై ప్రభుత్వం మరింత జాగ్రత్తలు తీసుకునే అవకాశముందని తెలుస్తోంది. ఘటనపై పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది. కందుల దుర్గేష్ మాట్లాడుతూ? 'మావోయిస్టుల పేరుతో వచ్చిన లేఖ చూసి కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. నాకు చాలా మంది ఫోన్లు చేశారు. నేను పనిచేసేది టూరిజం లాంటి చిన్న శాఖ. దీంట్లో మావోయిస్టులు లేక రాయాల్సినంత పెద్ద హడావిడి ఏముంటుంది. వ్యక్తిగతంగా, శాఖ పరంగా ఎక్కడ ఎలాంటి తప్పులు ఉండవు. ఎవరో ఉద్దేశపూర్వకంగానే ఈ లేఖలు రాసి ఉంటారు. మావోయిస్టులు లేఖలు ఇలా ఉండవు కదా?' అని అన్నారు.

# బోధన్‌లో దొంగ ఓట్లేసేందుకు యత్నం

## - ఇద్దరిని గుర్తించి పట్టుకున్న పోలీసులు

**నిజామాబాద్, ఫిబ్రవరి11( వెలుతురు):**
రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో అక్కడక్కడా కొందరు దొంగ ఓట్లు వేసేందుకు వచ్చి పట్టుబడ్డారు. నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణం రాకసిపేట గోశాలలో దొంగ ఓట్లు వేసేందుకు ఇద్దరు వ్యక్తులు ప్రయత్నించారు. బూత్ నెంబర్ 24, 78 లలో ఇతరుల పేరుతో ఓటు వేసేందుకు ఇద్దరు యువకులు వచ్చారు. తప్పుడు గుర్తింపు పత్రాలతో పోలింగ్ కేంద్రంలోకి రావడంతో అధికారులు గుర్తించి పోలీసులకు అప్పగించారు. దీనితో బోధన్ పట్టణం 21వ వార్డు పరిధిలోని అరీసా సాగర్ నగర్ లో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఒకే చోట బీఆర్ఎస్, ఓఎట రెండు పార్టీల కార్యకర్తలు గుమ్మిగూడారు. ఒక్కసారిగా పరస్పర నినాదాలు చేపట్టారు. దాంతో ఆ ప్రాంతమంతా టెన్షన్ వాతావరణం నెలకొంది. రెండు పార్టీ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. ఒకే చోట బిఆర్ఎస్, ఎంఐఎం కార్యకర్తలు గుమిగూడి పరస్పర నినాదాలు చేశారు. దీనితో ఆందోళనకారులను పోలీసులు చెదరగొట్టారు.

# కరీంనగర్‌లో ఓటేసిన బండి దంపతులు

## - ఫోన్ ట్యాపింగ్‌పై రేవంత్‌కు చిత్తశుద్ధి లేదని వ్యాఖ్య

## - కెసిఆర్‌పై చర్యలకు వెనకాడుతున్నారని విమర్శ



**కరీంనగర్, ఫిబ్రవరి11( వెలుతురు):**
మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా జ్యోతినగర్ ఎస్ఆర్ హైస్కూల్లో కుటుంబ సభ్యులతో కలిసి కేంద్రమంత్రి బండి సంజయ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బండి సంజయ్ మరోసారి విరుచుకుపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ ఎవరు చేస్తున్నారో సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్‌పై రేవంత్ రెడ్డివి ఊకదంపుడు ప్రసంగాలు మాత్రమే అని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌కు రేవంత్ భయపడుతున్నారా? కేసీఆర్ కుటుంబంపై చర్యలు తీసుకోరా? అని మంత్రి ప్రశ్నించారు. అంతేకాకుండా.. రేవంత్ రెడ్డికి రాజకీయాల మీద ఉన్న శ్రద్ధ.. రైతులపై లేదని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. యూరియా పక్కదారి పడుతున్నా ఏమీపట్టడం లేదా అని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ నేతలు బ్లాక్‌లో యూరియా అమ్ముకుంటున్నారని ఆరోపించారు. కేంద్రాన్ని విమర్శించడం తప్ప.. రాష్ట్రం ఏం చేస్తోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతు ద్రోహి అంటూ వ్యాఖ్యానించారు. టీవీల ముందు తప్ప.. రైతుల పట్ల బాధ్యత లేదా అని, యూరియా మీద కనీసం సమీక్ష చేయరా అని నిలదీశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ హయాంలో రైతులు గోసపడారని మంత్రి అన్నారు.

# వేములవాడలో ఓసేసిన ఎన్నారై

**వేములవాడ, ఫిబ్రవరి11( వెలుతురు):**



ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని చెబుతున్న కొందరు గడప దాటని విధానం ఇంకా కొనసాగుతూనే ఉంది. వేములవాడ పురపాలక సంఘం ఎన్నికల్లో మాత్రం ఏకంగా వేల కిలోమీటర్ల ప్రయాణం చేసి అమెరికా నుండి వచ్చి ఒకరు పురపాలక సంఘం ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవడం సర్వత్రా హర్ష వ్యక్తమవుతోంది. అమెరికాలో ఉద్యోగంలో స్థిరపడిన కార్తికేయ తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు వేములవాడకు వచ్చి 28వ వార్డులో తన ఓటు వినియోగించుకున్నారు. యువతకు ఆయన ఓటుకున్న విలువను గురించి తెలియజేసినట్లుగా స్థానికులు తెలిపారు.

# జనారణ్యంలోకి జంతువులు

**అదిలాబాద్, ఫిబ్రవరి11 ( వెలుతురు):**
దట్టమైన వృక్షాలు. ఆకాశాన్ని తాకే విధంగా కొండలు.. గలగల పారే సెలయేర్లు.. అందులో రకరకాల జంతువులు.. ఫలితంగా జీవావరణం అద్భుతంగా ఉండేది. ప్రకృతి సమతుల్యం గొప్పగా అనిపించేది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఎందుకంటే అభివృద్ధి వల్ల చెట్లు నేల కూలిపోయాయి. కొండలు కరిగిపోయాయి. సెలయేర్లు కాలగర్భంలో కలిసిపోయాయి. అడవిని నమ్ముకున్న జంతువులు ఒక్కొక్కటిగా చనిపోతున్నాయి. ఉన్న జంతువులు జనావాసాలాలో పడి కన్నుమూస్తున్నాయి. పెద్దపులి నుంచి మొదలు పెడితే జింకల వరకు ఇదే పరిస్థితి. కొన్ని సందర్భాలలో ఉన్న అడవుల్లో కూడా పులులకు ఆహారం దొరకడం లేదు. ఆహార అన్వేషణలో భాగంగా పులులు ఉన్న ప్రాంతం నుంచి వేరే ప్రాంతానికి వస్తున్నాయి. ఆ సమయంలో ఆహారం లభించక.. ఆవాసం దొరకక నరకం చూస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో యాదాద్రి, జనగామ జిల్లాలలో మహారాష్ట్రలోని పాండవ ఖరా టైగర్ రిజర్వ్



నుంచి ఒక పులి వచ్చింది. ఈ పులి ముందుగా ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల్ ప్రాంతంలోకి ప్రవేశించింది. ఆ తర్వాత 250 కిలోమీటర్ల వరకు ప్రయాణించి యాదాద్రి, జనగామ జిల్లాలలో ప్రవేశించింది. యాదాద్రి జిల్లాలోని కొలనుపాక ప్రాంతం నుంచి లింగాల గణపురం మండలం కుందారం గ్రామం శివారులోకి వచ్చింది. అక్కడ ఓ రైతుకు సంబంధించిన లేక దూడను చంపి తినేసింది. ఈ విషయం అటవీశాఖ అధికారులకు తెలియడంతో వారు పులి పాదముద్రలను పరిశీలించారు. అంతేకాదు ప్రజలకు సూచనలు చేశారు. రాత్రిపూట ఒంటరిగా వెళ్లకూడదని హెచ్చరించారు. వాస్తవానికి ఈ ప్రాంతాల్లో పులి కనిపించక దాదాపు 50 సంవత్సరాలు దాటిపోయింది. గతంలో ఈ ప్రాంతాలలో అడవులు విస్తారంగా ఉండేవి. కానీ, క్రమక్రమంగా అడవులు తగ్గిపోవడంతో పులులు కనుమరుగైపోయాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే పులులకు కూడా సరైన ఆవాసం, ఆహారం లభించకపోవడంతో జనావాసాల్లోకి వస్తున్నాయి. చివరికి ప్రాణాలు కోల్పోతున్నాయి. మహారాష్ట్ర నుంచి వచ్చిన పులి పరిస్థితి కూడా ఇలానే ఉంది. అది ఆహార అన్వేషణ కోసం.. మనుగడ కోసం ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఉపయోగం ఉండడం లేదు.

# శివకుమార్ పట్టాభిషేకానికి ముహూర్తం ఫిక్స్ ?

**బెంగళూరు, ఫిబ్రవరి11( వెలుతురు):**
కర్ణాటక కాంగ్రెస్ రాజకీయాలు ఒక్కసారిగా హీటెక్కాయి. ఇప్పటివరకూ తెర వెనుక సాగిన సీఎం మార్పు చర్చలు ఇప్పుడు బాహాటంగా రోడ్డుపైకి వచ్చాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్థానంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కూర్చోబెట్టాలంటూ ఎమ్మెల్యేలు బహిరంగంగా డిమాండ్ చేయడం కన్నడ రాజకీయాల్లో భూకంపాన్ని సృష్టిస్తోంది. తాజా రాజకీయ ప్రకంపనలకు కేంద్ర బిందువు ఎమ్మెల్యేలు ఇక్బాల్ హుస్సేన్, చెన్నరాజ్ హట్టిహోలి. వీళ్లిద్దరూ డీకేకు కేవలం మద్దతు తెలపడమే కాకుండా, హైకమాండ్ ముందున్న లెక్కలను కూడా బయటపెట్టారు. పార్టీ కోసం రక్తం చిందించిన డీకేకు అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ డిమాండ్ చేశారు. ఇప్పటికే 80 నుండి 90 మంది ఎమ్మెల్యేలు అధిష్టానానికి ఈ మేరకు విజ్ఞప్తి చేసినట్లు ఆయన బహిరంగంగానే వెల్లడించారు. దీనికి మరో ఎమ్మెల్యే చెన్నరాజ్ హట్టిహోలి మరింత బలాన్ని చేకూర్చారు. "80 మంది కాదు, కాంగ్రెస్ నుంచి గెలిచిన మొత్తం 136 మంది ఎమ్మెల్యేలూ డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారు" అని ప్రకటించారు. ఈ వ్యాఖ్యలు ఏదో యాదృచ్ఛికంగా చేసినవి కావని, సిద్ధరామయ్య క్యాంప్‌కు ఒక స్పష్టమైన హెచ్చరిక లాంటివని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. 2023 మేలో ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచీ ఈ సీటుపై గందరగోళం కొనసాగుతూనే ఉంది. ఎన్నికల్లో కాంగ్రెస్ అఖండ విజయం సాధించిన తర్వాత సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య సీఎం పీఠం కోసం పెద్ద యుద్ధమే



జరిగింది. అప్పట్లో ఢిల్లీ పెద్దలు కుదిర్చిన '30 నెలల ఫార్ములా' అంటే రెండున్నరేళ్ల ఒప్పందం ఇప్పుడు డీకే వర్గానికి అస్త్రంగా మారింది. ఆ గడువు ముగియడంతోనే, ఎమ్మెల్యేలు ఇప్పుడు తమ గళాన్ని పెంచారు. సాధారణంగా ఏ పార్టీలోనైనా ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తికి వ్యతిరేకంగా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం క్రమశిక్షణారాహిత్యం కిందకు వస్తుంది. కానీ, డీకే శివకుమార్ అనుచరులు ఇంత ధైర్యంగా మాట్లాడుతున్నారంటే దీని వెనుక బలమైన స్కెచ్ ఉంది. సిద్ధరామయ్య ప్రజాకర్షణ ముందు డీకే వెనుకబడిపోకుండా, ఎమ్మెల్యేల బలం తనకే ఉందని నిరూపించుకోవడం దీని వెనుక ఉద్దేశం. సిద్ధరామయ్య తన 'అహింద' ఓటు బ్యాంకుతో పట్టు బిగిస్తుంటే, డీకే తన 'ఒక్కలిగ' సామాజిక వర్గ ఎమ్మెల్యేలను ఏకం చేస్తున్నారు. సిద్ధరామయ్య చుట్టూ ముదురుతున్న ముడా కేసు దర్యాప్తును ఆసరాగా చేసుకుని, నైతికత పేరుతో పదవిని బదిలీ చేయాలని కోరడం కూడా దీని వెనుక వ్యూహం కావచ్చు. ఎమ్మెల్యేలు బహిరంగంగా ప్రకటనలు చేస్తుంటే అధిష్టానం మౌనంగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. సిద్ధరామయ్యను తప్పిస్తే వెనుకబడిన వర్గాలు ఏమౌతాయి? డీకేకు అవకాశం ఇవ్వకపోతే పార్టీకి ఆర్థిక బలం, ట్రబుల్ షూటింగ్ నెరవేరుతుందా? అనే సంకటంలో ఢిల్లీ పెద్దలు ఉన్నారు. మొత్తానికి ఎమ్మెల్యేల బహిరంగ వ్యాఖ్యలు కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు కేవలం ఊహాగానం కాదు, ఒక కార్యాచరణ అని స్పష్టం చేస్తోంది. డీకే శివకుమార్ వ్యూహాత్మకంగా తన అనుచరుల ద్వారా పావులు కదుపుతున్నారు. త్వరలోనే తనకు పట్టాభిషేకం ఖాయమనే ఆలోచనలో డీకే ఉన్నారు. ఆయన అనుచరుల తాజా వ్యాఖ్యలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. హైకమాండ్ పైన ఒత్తిడి తీసుకురావడం ద్వారా తమ పంచాన్ని నెగ్గించుకోవాలనుకుంటున్నారు. మరి సిద్ధరామయ్య ఈ ఎమ్మెల్యేల అస్త్రం నుండి తన కుర్చీని ఎలా కాపాడుకుంటారో చూడాలి.

# ట్రయాంగిల్ ఫైట్ లో గెలుపు ఎవరిది

**హైదరాబాద్, ఫిబ్రవరి11( వెలుతురు):**
తెలంగాణ మున్సిపల్ ఎన్నికల క్లైమాక్స్ మొదలైంది. పార్టీలు జారీ చేసిన బీ-ఫారాలు ఒకరికి దక్కితే, ఏళ్ల తరబడి పార్టీ కోసం పనిచేసిన తమను విస్మరించారంటూ పలువురు నేతలు స్వతంత్రులుగా జెండా ఎగురవేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6,700 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నప్పటికీ, ఇంకా 12,900 మందికి పైగా అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇందులో మెజారిటీ అభ్యర్థులు ప్రధాన పార్టీలకు చెందిన రెబల్స్ కావడం గమనార్హం. గెలుపు గుర్రాల కంటే, ప్రత్యర్థి గెలుపును అడ్డుకునే ఓట్ల చీలిక వ్యూహంతో వీరు ముందుకు వెళ్తుండటం పార్టీల గెలుపు అవకాశాలను దెబ్బతీసేలా ఉంది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో రెబల్స్ సమస్య అత్యధికంగా కనిపిస్తోంది. ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతో గెలుపు అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని భావించిన ఆశావాహులు టికెట్ ఆశించారు. కానీ ఇటీవల ఇతర పార్టీల నుంచి చేరిన వారికి ప్రాధాన్యత ఇవ్వడంపై పాత క్యాడర్ భగ్గుమంటోంది. ఉదాహరణకు జగిత్యాలలో సీనియర్ నేత జీవన్ రెడ్డి , ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మధ్య టికెట్ల కేటాయింపు వివాదం రచ్చకెక్కింది. ఇలాంటి పరిస్థితులే మెదక్, గద్వాల వంటి చోట్ల కూడా కనిపిస్తున్నాయి. బీ-ఫారాల పంపిణీలో జరిగిన జాప్యం , సమన్వయ లోపం వల్ల కాంగ్రెస్‌లో రెబల్స్ సంఖ్య పెరిగిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీకి ఈ ఎన్నికలు జీవన్మరణ సమస్యగా మారాయి. పార్టీని నమ్ముకుని ఉన్న స్థానిక నేతలు, టికెట్ దక్కని పక్షంలో తమ రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందని భావించి బరిలోకి దిగారు. ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు వ్యతిరేకంగా సొంత పార్టీ వారే భారీగా నామినేషన్లు వేశారు. కొందరు నేతలు ఇతర పార్టీల నుంచి వచ్చిన విమర్శలకు కౌంటర్ ఇవ్వడం కంటే, సొంత పార్టీ అభ్యర్థులనే టార్గెట్ చేయడం అధిష్టానాన్ని ఆందోళనకు గురి చేస్తోంది. క్రమశిక్షణ చర్యల హెచ్చరికలు జారీ చేసినా చాలా మంది వెనక్కి తగ్గకపోవడం గమనార్హం. కేంద్రంలో అధికారంలో ఉండటం, రాష్ట్రంలోనూ పుంజుకుంటున్నామన్న ధీమాతో ఉన్న బీజేపీలోనూ రెబల్స్ బెడద తప్పలేదు. మున్సిపల్




ఎన్నికల కోసం పార్టీ పకడ్బందీగా అభ్యర్థులను ఎంపిక చేసినప్పటికీ, కొన్ని చోట్ల ఆర్ఎస్ఎస్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న వారికి కాకుండా కొత్తగా చేరిన వారికి టికెట్లు ఇచ్చారన్న ఆరోపణలు వస్తున్నాయి. దీంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు రెబల్స్ పై సీరియస్ అయ్యారు. నామినేషన్లు ఉపసంహరించుకోని వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అయినప్పటికీ, నిజామాబాద్, అదిలాబాద్ వంటి ప్రాంతాల్లో బీజేపీ అభ్యర్థులకు రెబల్స్ గట్టి పోటీ ఇస్తున్నారు. ఈ రెబల్స్ ప్రభావం వల్ల బహుముఖ పోటీ నెలకొంది. విజేతను నిర్ణయిం చే మేజారిటీ ఓట్లు ఈ స్వతంత్రుల ఖాతాలోకి వెళ్లే ప్రమాదం ఉంది. కేవలం 100 నుండి 500 ఓట్ల తేడాతో గెలుపోటములు నిర్ణయమయ్యే మున్సిపల్ వార్డుల్లో, ఈ రెబల్స్ చీల్చే 50 ఓట్లు కూడా ఫలితాన్ని తారుమారు చేస్తాయి. దీనివల్ల కొన్ని చోట్ల ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓడిపోయి, స్వతంత్రులు కింగ్ మేకర్లుగా లేదా విజేతలుగా అవతరించే అవకాశం ఉంది. ఈ ఎన్నికలు ప్రధానంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, విపక్ష బీజేపీ మధ్య ముక్కోణపు పోటీని తలపిస్తున్నాయి. ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న మొదటి మున్సిపోల్స్ కావడంతో, కాంగ్రెస్ దీనిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ప్రభుత్వ పథకాలు, ముఖ్యంగా ఆరు గ్యారెంటీలు తమను గెలిపిస్తాయని ఆ పార్టీ నమ్ముతోంది. మెజారిటీ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కైవసం చేసుకోవడం ద్వారా రాష్ట్రంపై తమ పట్టును నిరూపించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహరచన చేశారు. తమ పదేళ్ల అభివృద్ధి పనులే తమకు శ్రీరామరక్ష అని బీఆర్ఎస్ భావిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలను ఎండగడుతూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. ముఖ్యంగా దక్షిణ తెలంగాణలో తమకు బలమైన క్యాడర్ ఉందని, అక్కడ మెరుగైన ఫలితాలు సాధిస్తామని గులాబీ దళం ఆశిస్తోంది. ఉత్తర తెలంగాణపై బీజేపీ గట్టి ఆశలు పెట్టుకుంది. పట్టణ ప్రాంత ఓటు బ్యాంకు సంప్రదాయబద్ధంగా తమకే మద్దతు ఇస్తుందని ఆ పార్టీ నమ్ముతోంది. నిజామాబాద్, కరీంనగర్ వంటి ప్రాంతాల్లో కాంగ్రెస్‌కు గట్టి పోటీ ఇచ్చేందుకు బీజేపీ సిద్ధమైంది. రాజకీయ విశ్లేషకుల అంచనాల ప్రకారం, ఈ ఎన్నికల్లో ప్రాంతాల వారీగా విభిన్నమైన ట్రెండ్ కనిపిస్తోంది. ఉత్తర తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ పోరు సాగనుంది. రామగుండం, నిజామాబాద్ వంటి కార్పొరేషన్లలో బీజేపీ సత్తా చాటాలని చూస్తోంది. ఇక దక్షిణ తెలంగాణలోని మహబూబ్ నగర్, నల్గొండ వంటి ప్రాంతాల్లో బీఆర్ఎస్ బలంగా ఉన్నప్పటికీ, అధికార బలం కాంగ్రెస్‌కు కలిసి వచ్చే అవకాశం ఉంది. మొదటి స్థానంలో నిలిచేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తుండగా, ప్రధాన ప్రతిపక్షం తామే అని నిరూపించుకోవడానికి బీఆర్ఎస్, బీజేపీ మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. మొత్తం 2,996 వార్డుల్లో సుమారు 12,993 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నారు. ఈ ఫలితాలు తెలంగాణ భవిష్యత్తు రాజకీయ దిశను నిర్దేశించనున్నాయి. ఓటర్లు తమ నగరాల, పట్టణాల అభివృద్ధి కోసం ఎవరికి పట్టం కడతారో వేచి చూడాలి.

# ఆస్తి పన్ను బకాయిలుంటే ఆస్తులు సీజ్

**విశాఖపట్టణం, ఫిబ్రవరి11( వెలుతురు):**
విశాఖపట్నంలో ఆస్తి పన్ను బకాయిల వసూళ్లపై జీవీఎంసీ అధికారులు ఫోకస్ పెట్టారు. నగరంలో మొండి బకాయిలను వసూలు చేసేందుకు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఆస్తి పన్ను బకాయి ఉన్నవారికి ముందుగా నోటీసులు ఇస్తున్నారు.. ఒకవేళ వారు స్పందించని పక్షంలో ఆస్తుల దగ్గర బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. అప్పటికి చెల్లించినవారికి ఊహించని షాకిస్తున్నారు.. ఆ ఆస్తుల్ని సీజ్ కూడా చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు కఠినగా వ్యవహరిస్తుండటంతో పెండింగ్ బకాయిలు ఒక్కొక్కటిగా వసూలవుతున్నాయివిశాఖపట్నం జీవీఎంసీ పరిధిలో 6,02,937 ఆస్తి పన్ను అసెస్‌మెంట్‌లు ఉంటే.. ఆ ఆర్థిక సంవత్సరంలో రూ.566.41 కోట్లు పన్ను రావాలి. అయితే ఇప్పటి వరకు రూ.360 కోట్లు మాత్రమే చెల్లించగా.. మిగిలిన మొండి బకాయిల్ని కూడా రాబట్టేందుకు సిద్ధమయ్యారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ మొండి బకాయిలపై ఫోకస్ పెట్టారు.. ఆస్తి పన్ను బకాయి ఉన్నవారికి వరుసగా నోటీసులు జారీ చేస్తున్నారు. జీవీఎంసీ పరిధిలో లక్షా 36వేల 149మంది ఆస్తి పన్ను చెల్లించాల్సిన వారు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి.. వీరందరికి జప్తు నోటీసులు జారీ చేయాలని ఆదేశాలు వెళ్లాయి. వీరిలో లక్షా 10వేల 136మందికి అధికారులు నోటీసులు ఇచ్చారు.. అయితే వీరిలో కూడా కొందరి నుంచి స్పందన రాలేదు. ఈ క్రమంలో వారి ఆస్తుల దగ్గర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఆ నోటీసులు పన్ను బకాయి వివరాలు ఉన్నాయి.. ఒకవేళ అప్పటికి ఆస్తి పన్ను బకాయిలు చెల్లించకపోతే.. వారి ఆస్తులను సీజ్ చేస్తున్నారు అధకారులు. ఇటీవల నగరంలోని ఓ సంస్థ మూడేళ్ల నుంచి రూ.87,74,916 పన్ను చెల్లించడం లేదు.. వారికి జప్తు నోటీసులు ఇచ్చినా స్పందించలేదు. ఈ క్రమంలో అధికారులు ఆ సంస్థ ముందు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. అలాగే మరో సంస్థ ఏకంగా ఐదేళ్ల నుంచి పన్ను చెల్లించడంలేదు..

అక్కడ కూడా హెచ్చరిక బోర్డ్ ఏర్పాటు చేశారు. మరో వ్యక్తి తొమ్మిదేళ్ల నుంచి ఆస్తి పన్ను చెల్లించలేదు.. అక్కడ కూడా బోర్డు పెట్టారు. ఇలా బోర్డు పెట్టినా పన్ను చెల్లించనివారి ఆస్తుల్ని సీజ్ చేస్తున్నారు. ఈ తాజా పరిణామాలతో చాలామంది పన్నులు వసూలు చేస్తుండగా.. కొందరు మాత్రం వేచి చూసే ధోరణిలో ఉన్నారు. ఇదిలా ఉంటే.. విశాఖపట్నం జిల్లా తలసరి ఆదాయంలో నంబర్ వన్‌గా ఉంది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. సీఎం సోమవారం రోజు మంత్రులు, కార్యదర్శులతో అమరావతిలో సమీక్షా సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే. జిల్లా కలెక్టర్లు వర్చువల్‌గా సమావేశంలో పాల్గొన్నారు. ఈ క్రమంలో గత ఏడాది విశాఖపట్నం జిల్లా.. స్థూల ఉత్పత్తిలో రూ.1,44,192 కోట్లతో ప్రథమ స్థానంలో ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26)లో కూడా రూ.1,60,771 కోట్లతో ఫస్ట్ ప్లేస్‌లో నిలబడింది.

https://epaper.velthuru.com


వెలుతురు

cinema



# నిఖిల్ స్వయంభు టీజర్ విడుదల

యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ్ కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'స్వయంభు'. సమ్మర్ కానుకగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. ఈ సినిమా టీజర్‌ను చిత్రబృందం బుధవారం విడుదల చేసింది. పాన్ ఇండియా స్థాయిలో అత్యున్నత సాంకేతిక విలువలతో, 3ఆ ఫార్మాట్‌లో రూపొందిన ఈ టీజర్ ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నిఖిల్ క్రీస్తుశకం 985 నాటి పరాక్రమవంతుడైన యోధుడిగా కనిపిస్తున్నారు. భారీ సెట్టింగ్‌లు, అద్భుతమైన పీరియడ్ వార్ సీక్వెన్స్‌లతో కూడిన ఈ టీజర్, నిఖిల్ మేకోవర్ మరియు ఆయన యుద్ధ విన్యాసాలను అద్భుతంగా ఆవిష్కరించింది. సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాల ఫేమ్ రవి బస్రూర్ సంగీతాన్ని అందిస్తుండగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంథిల్ కుమార్ విజువల్స్ సమకూర్చారు. 'కార్తికేయ-2' విజయం తర్వాత నిఖిల్ నటిస్తున్న ఈ చిత్రంపై టాలీవుడ్‌తో పాటు దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.







## ఇక డాక్టర్ శ్రీలీల.. ఎంబిబిఎస్ పట్టా పుచ్చుకున్న నటి

టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ శ్రీలీల తన జీవితంలో ఒక అద్భుతమైన ఘట్టాన్ని పూర్తిచేసుకుంది. వెండితెరపై నటిగా అలరిస్తున్న ఆమె, ఇప్పుడు అధికారికంగా డాక్టర్ శ్రీలీలగా మారారు. తన మెడికల్ డిగ్రీని విజయవంతంగా పూర్తి చేసిన శ్రీలీల తాజాగా కాన్వోకేషన్ వేడుకలో మెడిసిన్ పట్టాను అందుకుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు ఫొటోలు వైరల్‌గా మారాయి. నిజానికి శ్రీలీల తన తల్లి, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ స్వర్ణలత గారిని స్ఫూర్తిగా తీసుకుని మెడిసిన్ వైపు అడుగులు వేశారు. గత ఏడాది చేతినిండా సినిమాలతో అత్యంత బిజీగా ఉన్నప్పటికీ, తన లక్ష్యం కోసం చదువుపై ప్రత్యేక దృష్టి సారించారు. ఒక్కోసారి రోజంతా షూటింగ్‌లతో బిజీగా ఉంటూనే, విరామ సమయంలో పుస్తకాలు చదువుతూ ఆమె పడ్డ శ్రమ ఇప్పుడు ఫలించింది. చిన్నతనంలో తన అమ్మమ్మ అనారోగ్యం పాలైనప్పుడు ఒక వైద్యురాలిగా సేవ చేయాలన్న తన కోరికను ఆమె నేడు నెరవేర్చుకున్నారు.





# పవన్, సురేందర్ రెడ్డి కాంబో పక్కా మాస్ ఎంటర్టైనర్ మూవీ

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, స్టైలిష్ డైరెక్టర్ సురేందర్ రెడ్డి కాంబినేషన్‌లో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. ఈ భారీ ప్రాజెక్ట్ గురించి ఫిలిం నగర్ వర్గాల్లో ఒక ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతోంది. సాధారణంగా సురేందర్ రెడ్డి అంటే స్టైలిష్ యాక్షన్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తాడు. కానీ ఈసారి పవన్ కళ్యాణ్ కోసం ఆయన తన పంథాను పూర్తిగా మార్చుకున్నట్లు తెలుస్తోంది. పవన్ చేసిన యాక్షన్ సినిమా కంటే భిన్నంగా గతంలో సురేందర్ రెడ్డి అందించిన 'కిక్', 'రేసుగుర్రం' తరహాలో పక్కా హై-వోల్టేజ్ కామెడీ ఎంటర్‌టైనర్‌ను పవన్ కోసం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ బాడీ లాంగ్వేజ్‌కు సరిపోయే మేనరిజమ్స్‌తో కూడిన వినోదాన్ని వెలికితీయడమే లక్ష్యంగా రచయిత వక్కంతం వంశీ ఈ స్క్రిప్ట్‌ను రూపొందించినట్లు సమాచారం. ఈ సినిమాలో పవన్‌కు జోడీగా ప్రభాస్ 'ఫౌజీ' సినిమా హీరోయిన్ ఇమాన్వీ పేరు ప్రముఖంగా వినిపిస్తుండటం విశేషం. మరోవైపు ఈ చిత్రానికి సంబంధించి మరో క్రేజీ అప్‌డేట్ ఏమిటంటే, ఇందులో పవన్ కళ్యాణ్‌కు తమ్ముడిగా ఒక యువ అగ్ర హీరో నటించే అవకాశం ఉందని, అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో సాగే పక్కా మాస్ మూవీగా ఇది ఉండబోతుందని ఇన్‌సైడ్ టాక్. నిర్మాత రామ్ తాళ్లూరి దాదాపు రూ. 250 కోట్ల భారీ బ్జడెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ తన రాజకీయ బాధ్యతల నడుమ షూటింగ్‌లో పాల్గొనేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. 2026 మార్చి 19న ఉగాది పర్వదినం సందర్భంగా ఈ సినిమాను లాంఛనంగా ప్రారంభించి, 2027 సంక్రాంతి కానుకగా థియేటర్లలోకి తీసుకురావాలని మేకర్స్ పక్కా ఎ÷-లాన్‌తో ఉన్నారు. ఇప్పటికే పవన్ నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' మార్చి 26, విడుదల కానుండగా, ఆ వెంటనే ఈ భారీ ప్రాజెక్ట్ పట్టాలెక్కనుంది.

# తొలి జీతంతో స్కూలు ప్రారంభం

## నటి మోనాలిసా కీలక నిర్ణయం

మహా కుంభమేళాలో పూసల దండలు అమ్ముతూ ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకర్షించిన 'కుంభమేళా బ్యూటీ' మోనాలిసా ఇప్పుడు తన జీవితంలో మరో కీలక నిర్ణయం తీసుకుంది. తన మొదటి సినిమా నుంచి వచ్చే రెమ్యునరేషన్‌తో బాలికల కోసం ఒక పాఠశాలను ప్రారంభిస్తానని ప్రకటించి అందరి ప్రశంసలు అందుకుంటోంది. సాధారణ జీవితం నుంచి సినీ రంగం వరకు ఆమె చేసిన ఈ ప్రయాణం ఇప్పుడు ఎంతో మందికి ప్రేరణగా మారింది. ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహా కుంభమేళా సమయంలో మోనాలిసా దండలు అమ్ముతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆమెకు అనూహ్యంగా సినిమా అవకాశాలు వచ్చాయి. ప్రస్తుతం ఆమె సినీ పరిశ్రమలో అడుగుపెట్టి వరుస చిత్రాలతో బిజీగా మారింది. ఇటీవల ఆమె తొలి హిందీ చిత్రం 'ది డైరీ ఆఫ్ మణిపూర్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని భావోద్వేగానికి గురైంది. సినీ ప్రపంచంలోకి వచ్చినా తన పాత జీవితాన్ని ఎప్పటికీ మర్చిపోనని, ఆ అనుభవాలే తనకు బలం ఇచ్చాయని తెలిపింది. ఇటీవల మోనాలిసా మళ్లీ ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లి గంగా తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించింది. తన జీవితాన్ని మార్చిన ఆ స్థలానికి కృతజ్ఞతలు తెలుపుతూ, సమాజానికి తిరిగి ఏదో చేయాలనే ఆలోచనతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. మధ్యప్రదేశ్‌లోని ఖార్గోన్ జిల్లాలో బాలికల కోసం పాఠశాల స్థాపించాలన్నదే తన కల అని చెప్పింది. ఆ ప్రాంతాల్లో అమ్మాయిలకు సరైన విద్యావకాశాలు లేవని, చదువు లేక వెనుకబడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. బాలికల విద్య ద్వారానే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని, అందుకే తన సంపాదనను వ్యక్తిగత సౌకర్యాల కోసం కాకుండా భవిష్యత్ తరాల కోసం వినియోగించాలనుకుంటున్నానని మోనాలిసా స్పష్టం చేసింది. ప్రస్తుతం ఆమె మూడు సినిమాలతో బిజీగా ఉంది. అందులో రెండు తెలుగు చిత్రాలు కాగా, మరోటి హిందీ చిత్రం 'ది డైరీ ఆఫ్ మణిపూర్'. సినీ రంగంలో ఎదుగుతూ సమాజానికి సేవ చేయాలన్న ఆమె సంకల్పం నెటిజన్ల ప్రశంసలు అందుకుంటోంది.



# పవన్ షూటింగ్ చూసేందుకు వెళ్లి లాఠీ దెబ్బలు తిన్నా

## నటుడు సంతోష్ శోభన్ వెల్లడి

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కోసం ఒక ఘటనలో తాను కూడా లాఠీ దెబ్బలు తిన్నానని యంగ్ హీరో సంతోష్ శోభన్ తాజాగా వెల్లడించాడు. సంతోష్ శోభన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ' వాలెంటైన్స్ డే సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆయన ఈ ఆసక్తికర సంఘటనను గుర్తుచేసుకున్నారు. పవన్ కళ్యాణ్‌ను ప్రత్యక్షంగా ఎక్కువసార్లు చూడలేదని, అయితే ఒకసారి 'అత్తారింటికి దారేది' సినిమా షూటింగ్ సమయంలో ఆయనను చూసేందుకు వెళ్లిన అనుభవాన్ని పంచుకున్నారు. సంతోష్ శోభన్ మాట్లాడుతూ.. 'ఆ సమయంలో పవన్ కళ్యాణ్ గారి క్రేజ్ చాలా ఎక్కువగా ఉండేది. షూటింగ్ అవుట్‌డోర్‌లో జరగడంతో భారీ సంఖ్యలో అభిమానులు అక్కడికి చేరుకున్నారు. పరిస్థితి అదుపు తప్పుతుందని భావించిన పోలీసులు జనాన్ని నియంత్రించేందుకు ప్రయత్నించారు. ఆ క్రమంలో తోపులాటలు జరిగాయి. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు లాఠీచార్జ్ చేశారు. అప్పుడు అక్కడున్న అభిమానులతో పాటు నాకు కూడా లాఠీ దెబ్బలు పడ్డాయి' అని తెలిపారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సంతోష్ శోభన్ నటించిన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా రిలీజ్‌కు ముందు ఈ వ్యాఖ్యలు చిత్రంపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి.



# రవిబాబు.. యాక్షన్ హీరోగా 'రేజర్'

**హైదరాబాద్ వెలుతురు బ్యూరో (ఉదయ్ కిరణ్) ఫిబ్రవరి 11 :**

నటుడు, దర్శకుడు రవిబాబు హీరోగా నటిస్తూ రూపొందించిన కొత్త చిత్రం 'రేజర్' షూటింగ్ పూర్తి చేసుకుంది.సీనియర్ నిర్మాత సురేశ్‌బాబు సమర్పణలో సురేశ్ ప్రొడక్షన్స్ (Suresh Productions), ఫ్లయింగ్ ఫ్రాగ్స్ (Flying Frogs Production) సంయుక్త నిర్మాణంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో రవిబాబు హీరోగా నటిస్తుండడం విశేషం.టెన్షన్, వైలెన్స్ అంశాలతో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా పోస్టర్‌ను, గ్లింప్స్‌ను మంగళవారం విడుదల చేశారు. తెలుగు సినిమాల్లో ఇంతవరకూ చూడని కథాంశంతో రూపుదిద్దుకుంటున్న 'రేజర్' చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. వేసవిలో విడుదల చేస్తామని రవిబాబు చెప్పారు. అయితే.. ఇన్నాళ్లు యూత్, హర్రర్, కామెడీ చిత్రాలతో అలరించిన రవిబాబు సడన్‌గా తన స్టైల్ పూర్తిగా మార్చి బ్రూతల్ యాక్షన్ మోడ్‌లోకి రావడంపై ఫ్యాన్స్ ఆశ్చర్య పోతున్నారు.




# ఓటిటిలోనూ దురంధర్ దూకుడు

ఇండస్ట్రీలో సంచలనం సృష్టించిన చిత్రం 'ధురంధర్'. దాదాపు రెండు నెలలు థియేటర్‌లలో సందడి చేసి బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించిన ఈ చిత్రం.. ఇప్పుడు ఓటీటీలోనూ హవా చూపిస్తోంది. గతేడాది డిసెంబర్‌లో విడుదలైన 'ధురంధర్'.. జనవరి 30న నెట్‌ఫ్లిక్స్ (ఔ|బ్గా÷తిలీ) వేదికగా డిజిటల్ ప్రేక్షకుల ముందుకు అందుబాటులోకి వచ్చింది. స్ట్రీమింగ్‌కు వచ్చిన తొలిరోజు నుంచే వ్యూస్‌లో సత్తా చూపిస్తూ పలు రికార్డులను సొంతం చేసుకుంటోంది. పదిరోజుల్లో ఈ సినిమాకు దాదాపు 16 మిలియన్ల వ్యూస్ (15.9) వచ్చినట్లు నెట్‌ఫ్లిక్స్ తెలిపింది. మొదటి మూడు రోజుల్లోనే 7.6మిలియన్ల వ్యూస్‌తో గ్లోబల్ టాప్-10 నాన్ ఇంగ్లీష్ ఫిల్మ్స్ జాబితాలో నెం.1 స్థానంలో నిలిచిన 'ధురంధర్'. ఫిబ్రవరి 2 నుంచి 8 వరకూ 8.2 మిలియన్ల వ్యూస్‌ను తన ఖాతాలో వేసుకుంది. ఏకంగా 11 దేశాల్లో నం.1 స్థానంలో కొనసాగుతోంది. తొలిభాగం సూపర్ హిట్ కావడంతో చిత్రబృందం రెట్టింపు ఉత్సాహంతో రెండో పార్ట్‌ను విడుదల చేసేందుకు సిద్ధమైంది. మొదటి భాగానికి మించి ఇది విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందని నిర్మాత జ్యోతి దేశ్‌పాండే ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. అందుకే ఐదు భాషల్లో ఒకేసారి విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. తొలి చిత్రానికి కొనసాగింపుగా 'ధురంధర్2' రెడీ అవుతోంది. మార్చి 19న ఈ చిత్రాన్ని విడుదల కానుంది. ఇటీవల విడుదల చేసిన టీజర్ పార్ట్2పై అందరినీ ఆకట్టుకున్న విషయం తెలిసిందే.







# గవర్నర్‌కు స్వాగతం పిలకిన సిఎం, స్పీకర్



**అమరావతి, ఫిబ్రవరి11( వెలుతురు):** ఎపి అసెంబ్లీ సమావేశాలు బుధవారం ప్రారంభం అయ్యాయి. అసెంబ్లీ వద్దకు చేరుకున్న గవర్నర్ నజీర్‌కు సీఎం చంద్రబాబు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్వాగతం పలికారు. అసెంబ్లీ సమావేశాలకు మాజీ సీఎం జగన్ సహా వైకాపా సభ్యులు హాజరయ్యారు. గవర్నర్ ప్రసంగానికి పదేపదే ఆటంకం కలిగిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కాసేపటికే సభ నుంచి జగన్‌తో పాటు ఎమ్మెల్యేలు బయటకు వెళ్లిపోయారు.

# 11 వ తేదీ..11మంది..11 నిముషాలు

## - వైకాపా హాజరుపై స్పీకర్ ఛలోక్తులు




**అమరావతి, ఫిబ్రవరి11( వెలుతురు):**

ఏపీ అసెంబ్లీ లాబీలో మీడియాతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు సరదా వ్యాఖ్యలు చేశారు. వైకాపా సభ్యులు గవర్నర్ ప్రసంగం సందర్భంగా సభకు హాజరై కాసేపు నిరసన తెలిపి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో స్పీకర్ స్పందిస్తూ 11వ తేదీన 11 మంది 11 నిమిషాలు ఉండి వెళ్లిపోయారు!.. అంతకుమించి ఎక్కువ సమయం లేరుగా..! అని వ్యాఖ్యానించారు. సభ్యులు సభా సంప్రదాయాలను పాటిస్తే మంచిదని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం ఉదయం 10:00 గంటలకు ప్రారంభమయ్యాయి. సభ ఆరంభమైన కాసేపటికే వైసీపీ సభ్యులు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహా వైసీపీ ఎమ్మెల్యేలంతా 11 నిమిషాల వ్యవధిలోనే అసెంబ్లీ నుంచి బయటకు వెళ్లిపోయారు. తిరుమల లడ్డూ గోవిందా, గోవిందా అంటూ లాబీల్లో నినాదాలు చేశారు. ఈ సమయంలో జై జగన్ అనే నినాదాలని వైసీపీ సభ్యులు చేయగా.. నినాదాలు చేయొద్దని జగన్ వారించినట్లు తెలుస్తోంది. జగన్ చెప్పిన వినకుండా మరింత బిగ్గరగా సభ్యులు అరిచారు. సరిగ్గా 10 గంటలకు అసెంబ్లీలోకి వైసీపీ సభ్యులు వెళ్లి.. కేవలం 11 నిమిషాల పాటు నినాదాలు చేసి వైసీపీ సభ్యులు బయటకు వచ్చారు.

# అసెంబ్లీలో జగన్‌ను కలిసిన దువ్వాడ

## - తరవాత మాట్లాడుదామిన చెప్పిన వైకాపా నేత





**అమరావతి, ఫిబ్రవరి11( వెలుతురు):**

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఏపీ అసెంబ్లీలో వైసీపీ బహిష్కృత ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కలిసి మాట్లాడారు. ఈ ఘటన రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారి తీసింది. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వైఎస్ జగన్‌కు దువ్వాడ ఎదురుపడ్డారు. అసెంబ్లీ నుంచి బయటకు వచ్చే సమయంలో జగన్‌ను దువ్వాడ కలిశారు. దువ్వాడను చూసిన జగన్.. స్నేహపూర్వకంగా 'ఏం చేద్దాం శ్రీనివాస్?' అంటూ పలకరించారు. ధర్మానతో ఉన్న అంశాలపై మాట్లాడాలని దువ్వాడ అభ్యర్థించారు. సమగ్రంగా చర్చించేందుకు తాడేపల్లిలోని తన నివాసానికి రావాలని దువ్వాడను జగన్ ఆహ్వానించారు. వైసీపీ నుంచి సస్పెండ్ చేసినా సమావేశాల సమయంలో అసెంబ్లీకి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వస్తున్నారు. గతంలో ఆయనపై వచ్చిన వివాదాల నేపథ్యంలో ఏడు నెలల క్రితం వైసీపీ నుంచి పార్టీ అధిష్టానం సస్పెండ్ చేసింది. తాజాగా అసెంబ్లీ సమావేశాలకు వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసి బయటకు వచ్చే సమయంలో వైఎస్ జగన్‌ను దువ్వాడ కలిశారు. ప్రస్తుత పరిణామాలను జగన్‌కు వివరించే ప్రయత్నం చేయగా.. తర్వాత మాట్లాడదాం అంటూ మాజీ సీఎం వెళ్లిపోయారు. మండలిలో ప్రజా సమస్యలపై వ్యక్తిగత అజెండాతో ముందుకు వెళ్లే ఆలోచనలో దువ్వాడ ఉన్నట్లు తెలుస్తోంది. త్వరలో వైఎస్ జగన్‌ను కలుస్తానని, వైసీపీలో అవకాశం ఇవ్వకుంటే సొంతగా పోటీ చేసి బలం చూపిస్తా అని దువ్వాడ శ్రీనివాస్ చెప్పారు. మీడియాతో దువ్వాడ మాట్లాడుతూ? 'మండలిలో ప్రజా సమస్యలపై ప్రస్తావిస్తా. వైఎస్ జగన్‌ను త్వరలోనే కలుస్తాను. తిరుమల లడ్డూ వ్యవహారంలో భక్తుడి వైపు మాట్లాడతాను. మెడికల్ కాలేజీలని పీపీపీ విధానంలో నిర్మించాల్సిన అవసరం లేదు. జగన్ అవకాశం ఇవ్వకపోతే.. సొంతగా పోటీ చేసి నా బలం చూపిస్తాను' అని చెప్పారు.

# గవర్నర్ ప్రసంగం అడ్డుకునే యత్నం

## - సబలో నినాదాలు చేస్తూ వైసిపి వాకౌట్

**అమరావతి, ఫిబ్రవరి11( వెలుతురు):**



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు బుధవారం గవర్నర్ ప్రసంగంతో ప్రారంభం అయ్యాయి. గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తున్న సమయంలో వైసీపీ సభ్యులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ.. సభ నుంచి వాకౌట్ చేశారు. లడ్డు కల్తీ ఆరోపణలు, నిరుద్యోగ భృతి అంశం, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వంటి విషయాలపై ప్రభుత్వం వైఖరికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. సభలో స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టి వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నినాదాలు చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. వైసీపీ సభ్యుల నినాదాలతో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సభలో కొంతసేపు గందరగోళం నెలకొంది. కొందరు సభ్యులు స్పీకర్ చైర్ వైపు పేపర్లు విసిరి నిరసన వ్యక్తం చేశారు. సభలో క్రమశిక్షణ పాటించాలంటూ స్పీకర్ సూచించినప్పటికీ.. వైసీపీ సభ్యులు ఆందోళన కొనసాగించారు. అనంతరం సభను బహిష్కరిస్తూ వాకౌట్ చేశారు. ఈ సంఘటనతో అసెంబ్లీ సమావేశాలు రాజకీయంగా మరింత వేడెక్కాయి. ప్రభుత్వ-ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మరింత ముదురే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# బండికి ద్వంద్వ రాజకీయం ఢిల్లీకి భయం, తెలంగాణలో వీరంగం

## - సీఎంకు లేఖలు కేంద్రానికి సలామ్‌లు
## - రిటైర్డ్ ఉద్యోగుల అంశంపై బీజేపీ రాజకీయం
## - బండిపై రేఖ బోయలపల్లి ధ్వజం

**హైదరాబాద్ వెలుతురు ప్రతినిధి ఫిబ్రవరి 11:**

రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ డీఏలు, పీఆర్సీ బకాయిలను ముందుపెట్టి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేపడుతున్న దీక్షలు, లేఖలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాదని, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డా. రేఖ బోయలపల్లి విమర్శించారు. తెలంగాణకు కేంద్రం చేయాల్సిన ఆర్థిక సహాయంపై మాట్లాడకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని మాత్రమే నిందించడం ద్వంద్వ వైఖరని ఆమె అన్నారు.

### కేంద్రం బాధ్యత మరిచారా?

రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల విషయంలో కేంద్ర ప్రభుత్వ బాధ్యతను బండి సంజయ్ ఎందుకు ప్రస్తావించడం లేదని రేఖ ప్రశ్నించారు. "పెండింగ్ డీఏలకు కేంద్రం ఒక్క రూపాయి ఇచ్చిందా? పీఆర్సీ బకాయిలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించిందా? తెలంగాణకు రావాల్సిన పన్నుల వాటా ఎందుకు తగ్గించారు?" అని ఆమె నిలదీశారు. ఖీ=దీవీ నిబంధనల పేరుతో రాష్ట్ర ఆర్థిక స్వేచ్ఛను కట్టడి చేసిన కేంద్ర విధానాలను ప్రశ్నించే ధైర్యం బీజేపీ నేతలకు లేకపోయిందన్నారు.

### అప్పట్లో మౌనం.. ఇప్పుడే హడావుడా?

బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో ఉద్యోగులు, పెన్షనర్లు అనేక పోరాటాలు చేసినప్పుడు బండి సంజయ్ ఎందుకు స్పందించలేదని రేఖ ప్రశ్నించారు. అప్పట్లో ఒక్క దీక్ష కూడా చేయని నేతలు, ఇప్పుడు ఎన్నికల సమయం దగ్గరపడగానే ఉద్యోగుల సమస్యలు గుర్తొచ్చినట్టు మాట్లాడటం విడ్డూరమన్నారు.

### ఎంపీగా తెచ్చింది ఏమిటి?

కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ తెలంగాణ అభివృద్ధికి తీసుకొచ్చిన ప్రాజెక్టులపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు.
కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ప్లాంట్, మెట్రో రెండో దశ నిధులు, రైల్వే ప్రాజెక్టుల విషయంలో స్పష్టమైన పురోగతి ఎందుకు లేదని ప్రశ్నించారు. ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆయనపై ఉందన్నారు.

### రైతుల అంశంలో మౌనం ఎందుకు?

భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందం ప్రభావంతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై బీజేపీ నేతలు మాట్లాడకపోవడం దారుణమన్నారు. మీరా హామీలు అమలు కాకపోవడం, సబ్సిడీ దిగుమతుల వల్ల రైతులకు జరుగుతున్న నష్టంపై బండి సంజయ్ వైఖరి వెల్లడించాలన్నారు.

### కాంగ్రెస్ పాలనలో ప్రజలకు మేలు



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత బస్సు ప్రయాణం, ₹500 గ్యాస్ సిలిండర్, రైతు భరోసా, రుణమాఫీ, ఆరోగ్యశ్రీ విస్తరణ, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలు అమలవుతున్నాయని రేఖ వివరించారు. ప్రజలకు ప్రత్యక్ష లబ్ధి జరుగుతుండటంతో బీజేపీకి అసహనం పెరిగిందన్నారు.

### బండి సంజయ్ కు రేఖ సవాల్

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి బండి సంజయ్ ఢిల్లీ స్థాయిలో కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఆమె సూచించారు. లేఖలు రాయడం కాకుండా కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు.

# కచ్‌లోని శ్వేత మరుభూమిలో ప్రపంచంలోనే అతిపెద్ద ఖాదీ త్రివర్ణ పతాకం ఆవిష్కరణ

**మనోజ్ కుమార్, చైర్మన్, ఖాదీ మరియు గ్రామ పరిశ్రమల కమిషన్ (KVIC)**



**హైదరాబాద్ పిఐబి వెలుతురు ఫిబ్రవరి 11:**

నవ భారత ఆత్మవిశ్వాసానికి ప్రతీక గుజరాత్‌లోని కచ్ సరిహద్దుల్లో ఉన్న శ్వేత మరుభూమి (Rann of Kutch), నవ భారత మారుతున్న ఆత్మవిశ్వాసానికి సజీవ సాక్ష్యంగా నిలిచింది. ఇటీవల గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఇక్కడ ప్రపంచంలోనే అతిపెద్ద 'ఐకానిక్ ఖాదీ త్రివర్ణ పతాకాన్ని' అత్యంత వైభవంగా ప్రదర్శించారు. ఇది కేవలం ఒక ప్రదర్శన మాత్రమే కాదు, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో దేశం సాధిస్తున్న స్వయం సమృద్ధికి, జాతీయ సంకల్పానికి నిదర్శనం.

**చారిత్రాత్మక ఘట్టం – జన భాగస్వామ్యం**

ఈ అద్భుత దృశ్యాన్ని దేశంలోని కళాకారులు, సైనికులు మరియు పౌరులు వీక్షించారు. దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఖాదీ కళాకారులు వీడియో సందేశాల ద్వారా జాతీయ జెండాకు వందనం సమర్పించి కొత్త రికార్డు సృష్టించారు. ఒకప్పుడు స్వాతంత్ర్య ఉద్యమ ఆత్మగా ఉన్న ఖాదీ, నేడు 'ఆత్మనిర్భర్ భారత్' యొక్క శక్తిగా పునర్నిర్వచించబడుతోంది.

**భుజ్ పునర్నిర్మాణం:**
**విపత్తు నుంచి వికాసం వరకు**

25 ఏళ్ల క్రితం భూకంపంతో అతలాకుతలమైన భుజ్ నగరం, నేడు అభివృద్ధికి నమూనాగా నిలిచింది. అప్పటి ముఖ్యమంత్రి మరియు నేటి ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో, భుజ్ నగరం పటిష్టమైన మౌలిక సదుపాయాలతో సరికొత్తగా పునరుజ్జీవనం పొందింది. సరిహద్దు ప్రాంతాల్లో అభివృద్ధి మరియు భద్రత ఒకదానికొకటి తోడై దేశ ఆర్థిక పురోగతికి బాటలు వేస్తున్నాయి.

**ఖాదీ విప్లవం – గణాంకాల్లో పురోగతి**

ప్రధాని మోదీ మాటల్లో చెప్పాలంటే, "ఖాదీ కేవలం వస్త్రం మాత్రమే కాదు, అది ఒక సిద్ధాంతం." ఈ సిద్ధాంతం నేడు క్షేత్రస్థాయిలో అద్భుత ఫలితాలను ఇస్తోంది.

**అమ్మకాలు:**

ఖాదీ మరియు గ్రామ పరిశ్రమల ఉత్పత్తుల అమ్మకాలు రూ. 1.70 లక్షల కోట్లు దాటాయి, త్వరలోనే ఇవి రూ. 2 లక్షల కోట్లకు చేరనున్నాయి.

**ఉపాధి:**

ఈ రంగం ద్వారా సుమారు 2 కోట్ల మందికి పైగా ఉపాధి లభిస్తోంది.

**సాంకేతికత:**

గత 11 ఏళ్లలో 2.88 లక్షల యంత్రాలు మరియు టూల్‌కిట్లను కళాకారులకు పంపిణీ చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశారు.

**కళాకారుల సంక్షేమం – గౌరవం**

కాయకష్టానికి తగిన గౌరవం కల్పించడమే ఈ మార్పుకు ప్రధాన కారణం. ఖాదీ కళాకారుల వేతనాన్ని 'చిటికెకు' (per hank) రూ. 15 కు పెంచగా, దానిని రూ. 20 కి పెంచాలని నిర్ణయించారు. ఇది సంప్రదాయం మరియు సాంకేతికత కలిసిన ఒక సరికొత్త 'కళాకారుల యుగానికి' (Artisan Age) నాంది పలుకుతోంది.

**డిజిటల్ ప్రభావం మరియు ముగింపు**

సామాజిక మాధ్యమాల్లో #IconicKhadiTiranga హ్యాష్‌ట్యాగ్‌కు 2 కోట్ల పైగా వ్యూస్ రావడం, నేటి యువత (Gen`Z) తమ సాంస్కృతిక మూలాలను ఎంతగా ప్రేమిస్తున్నారో తెలియజేస్తోంది.
కచ్‌లోని తెల్లని ఎడారిలో రెపరెపలాడిన ఈ త్రివర్ణ పతాకం, భారతావని సాధిస్తున్న ఘనతలకు మరియు దేశం యొక్క ఉజ్వల భవిష్యత్తుకు దిక్సూచిగా నిలుస్తోంది.





నమస్తే,

ఫిబ్రవరి 17న కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే నిరాహార దీక్షకు మద్దతు తెలపండి.

రాష్ట్ర బడ్జెట్ లో గీత కార్మికుల సంక్షేమానికి 5000 కోట్లు కేటాయించాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17వ తేదీన ఉదయం 10 గంటల నుండి ఇందిరాపార్క్ వద్ద కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గం నిరాహారదీక్షకు పూనుకుంది. దీనికి మీరు హాజరై మద్దతు తెలియజేయాలని కోరుతున్నాము.

అభివందనములతో...
యం.వి.రమణ, రాష్ట్ర అధ్యక్షులు
బెల్లంకొండ వెంకటేశ్వర్లు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.



Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com